thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 120 కరీంనగర్ బుధవారం, 9 జూలై 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## భారత్‌తో కలిసి పనిచేస్తాం

బీజింగ్ : సరిహద్దుల వద్ద శాంతి, సుస్థిరత నెలకొల్పేందుకు భారత్‌తో కలిసి పనిచేసేందుకు తమ సైన్యం సిద్ధమని చైనా ప్రకటించింది. రెండు దేశాల సైనిక భవిష్యత్ సంబంధాలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు చైనా రక్షణ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఝూంగ్ జియావోగాంగ్ స్పందిస్తూ ఈ విషయం చెప్పారు. అత్యంత పురాతన నాగరికతలు కలిగి ఉన్న ఈ రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంలో గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన స్థానాలను ఆక్రమించాయన్నారు. ప్రజల ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.

## మాట తప్పడం సీఎం రేవంత్‌రెడ్డికి అలవాటే: కేటీఆర్

హైదరాబాద్: మాట తప్పడం సీఎం రేవంత్‌రెడ్డికి అలవాటేనని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. చర్చ సిద్ధమంటూ ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరిన కేటీఆర్ ఇవాళ ఉదయం ప్రెస్‌క్లబ్ వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. "కాంగ్రెస్ అరాచక పాలనలో రైతులు ఇబ్బంది పడుతున్నారు. దాదాపు 600 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు అంటూ ప్రజలను మోసం చేశారు. బేసిన్ల నాలెడ్జ్, బేసిక్ నాలెడ్జ్ లేని సీఎం చర్చకు రావాలి. బహిరంగ చర్చకు రేవంత్‌రెడ్డి సవాలు విసిరితే మేం వచ్చాం. సవాలు విసిరిన సీఎం ఇక్కడకు ఎందుకు రాలేదు? సీఎం రాకపోతే మంత్రులైనా వస్తారని భావించాం. బహిరంగచర్చకు రావాలని సీఎంకు మరోసారి చెబుతున్నాం. కొత్త తేదీ, ప్రదేశం రేవంత్‌రెడ్డి చెబితే మేం తప్పకుండా వస్తాం. అసెంబ్లీలో చర్చించేందుకు కూడా మేం సిద్ధంగా ఉన్నాం. మైకులు కట్ చేయకుండా.. పూర్తిగా మాట్లాడే అవకాశం ఇస్తే అసెంబ్లీలో కూడా చర్చకు సిద్ధం" అని కేటీఆర్ అన్నారు.



## యూరియా సరఫరా వేగవంతం చేయండి..

### కేంద్రమంత్రిని కోరిన సీఎం రేవంత్!

ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, పీయూష్ గోయల్‌లతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. తెలంగాణ రాష్ట్రంకు కేటాయించిన ఎరువులు సకాలంలో సరఫరా చేయాలని కేంద్రమంత్రి జేపీ నడ్డాను కోరారు. వానాకాలం పంటకు సంబంధించి ఇప్పటికి రావాల్సిన యూరియా అందని విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి సీఎం రేవంత్ తీసుకెళ్లారు. వానాకాలం సాగు దృష్టిలో పెట్టుకొని తెలంగాణకు కేటాయించిన యూరియా సరఫరా వేగవంతం చేయాలని కోరారు. ఏప్రిల్ నుంచి జూన్ మధ్య కేవలం 3.07 లక్షల మెట్రిక్ టన్నులే యూరియా సరఫరా అయింది. 5 లక్షల టన్నుల అవసరానికి తక్కువగా పంపిణీపై సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జులైలో అందాల్సిన యూరియా 160 వేల టన్నులు కాగా.. ఇప్పటివరకు కేవలం 29 వేల టన్నులే రాష్ట్రానికి పంపిణీ అయింది. దేశీయంగా ఉత్పత్తైన యూరియా కోటా పెంచాలంటూ సీఎం డిమాండ్ చేశారు. రైల్వే శాఖ తగిన రేక్స్ కేటాయించటం లేదని సీఎం ఆరోపించారు. యూరియా సరఫరా లోటు పాట్లు తొలగించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.





# నోరు అదుపులో పెట్టుకోండి!

## భారత రాష్ట్ర సమితి నేతలు తీరుమార్చుకోకుంటే మళ్లీ అదే పరిస్థితి: భట్టి విక్రమార్క

మహబూబాబాద్: ప్రజలకు ఏం చేశామనే అంశాలపై శాసనసభకు వస్తే చర్చిద్దామంటూ మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరితే భారత రాష్ట్ర సమితి నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సవాల్‌ను స్వీకరించాల్సిన పెద్దమనిషిని శాసనసభకు రాకుండా చేస్తూ వేరొకరు ప్రెస్‌క్లబ్‌కు వెళ్లి అవాకులు చవాకులు పేలుతున్నారని పరోక్షంగా కేటీఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు. అలా మాట్లాడినందుకే భారత రాష్ట్ర సమితికి లోక్‌సభ ఎన్నికల్లో 'సున్నా' వచ్చిందని.. ఆ పార్టీ నేతలు తీరు మార్చుకోకుంటే మళ్లీ అదే పరిస్థితి తప్పదన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు కేసముద్రంలో రూ.294.78 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన బహిరంగసభల్లో డిప్యూటీ సీఎంతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క, ఎంపీ బలరాం నాయక్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి 10 వేల ఎకరాలకూ నీళ్లివ్వలేదు...** భట్టి విక్రమార్క మాట్లాడుతూ రైతులకు అన్యాయం చేశామంటూ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని.. 9 రోజుల్లో రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయడం అన్యాయం చేసినట్లా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పాటైన మూడు నెలల్లోనే రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేయటం అన్యాయం చేసినట్లా.. పండించిన పంటకు రూ.500 బోనస్ ఇవ్వటం తప్పవుతుందా..? అని నిలదీశారు. కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణ వాటాల విషయంలో ముఖ్యమంత్రి ఇటీవలే అఖిలపక్ష సమావేశంలో మాట్లాడారన్నారు. రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యమని.. నీళ్ల విషయంలో ఎప్పుడైనా, ఎక్కడైనా మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను మరిచి అప్పట్లో కేసీఆర్ మాట్లాడారన్నారు. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి పట్టుమని పది వేల ఎకరాలకు నీళ్లివ్వని వారు కూడా తమపై విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

**ప్రజలపై ప్రేమ ఉన్నట్లు వారు నటిస్తున్నారు: మంత్రులు...** ఆరుగురు మంత్రులు రెండు బహిరంగ సభల్లో పాల్గొనటం..తరలివచ్చిన జనాన్ని ఉద్దేశించి చేసిన ప్రసంగాలు స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార సభలను తలపించాయి. ఏడాదిన్నర పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పనులను మంత్రులంతా వివరిస్తూ.. ఇందిరమ్మ పాలన, ప్రజాపాలనకు మద్దతుగా నిలవాలని కోరారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి వ్యక్తులను నిలబెడతాం.. మీరంతా ఒకతాటిపైకి వచ్చి భారీ మెజారిటీలతో గెలిపించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ ఉనికి చాటుకోవడానికే భారత రాష్ట్ర సమితి నేతలు పేదలపై ప్రేమ ఉన్నట్లు నటిస్తున్నారన్నారు. అన్నివర్గాల సంక్షేమం, పేదల అభ్యున్నతి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోందని.. కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్ రెడ్డి స్వగ్రామం ఇక్కడే ఉండటం..ప్రస్తుతం ఆయన కీలక పదవిలో ఉండటంతో ప్రత్యేక చొరవతో ప్రభుత్వం నుంచి రూ.400 కోట్ల వరకు నిధులు కేటాయింపు జరిగేలా చూశారని మంత్రులు సభలో చెప్పారు.




## కీలకమైన ఖనిజాలను ఆయుధాలుగా వాడుకోవద్దు.. బ్రిక్స్ ప్రసంగంలో మోదీ

రియో డి జనీరో: అత్యాధునిక సాంకేతిక పరికరాల తయారీలో కీలకమైన ఖనిజాలను ఏ దేశం స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకోకుండా, ఇతరులపై ఆయుధాలుగా ఉపయోగించుకునే పరిస్థితి రాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఖనిజాల సరఫరా గొలుసులను ఏర్పాటు చేసుకునేందుకు సభ్యదేశాలు కలిసికట్టుగా కృషిచేయాలని బ్రెజిల్‌లోని రియో డి జనీరో నగరంలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని పిలుపునిచ్చారు. క్రిటికల్ మినరల్స్ రంగంలో చైనా అధిపత్యం పెరుగుతుండటాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఏడాది బ్రిక్స్ అధ్యక్ష స్థానంలో భారత్ మానవతా విధానాలకు కీలక ప్రాధాన్యమిస్తుందని మోదీ చెప్పారు. బ్రిక్స్‌ను.. బిల్డింగ్ రీసీలియన్స్ అండ్ ఇన్నొవేషన్ ఫర్ కొవాపరేషన్ అండ్ సస్టెయినబిలిటీ అనే కొత్త రూపంలో పునర్నిర్వచించేందుకు తాము కృషి చేస్తామని చెప్పారు. జి-20 చైర్మన్‌షిప్ తీసుకున్నప్పుడు ఏవిధంగా ఎజెండాలో గ్లోబల్ సౌత్ అంశాలకు ప్రాధాన్యతనిచ్చామో బ్రిక్స్ సదస్సులోనూ దానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ప్రజలే కేంద్ర బిందువుగా మానవతా విధానాలకు తొలి ప్రాధాన్యమిస్తామని చెప్పారు. కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)పై మోదీ మాట్లాడుతూ, మానవతా విలువలు, సామర్థ్యాల పెంపునకు ఇదొక సాధనంగా ఇండియా నమ్ముతుందన్నారు. 'ఏఐ ఫర్ ఆల్' అనే మంత్రంతో ముందుకు వెళ్తున్నామని, అనేక రంగాల్లో ఏఐని సమర్థవంతంగా భారత్ ఉపయోగించుకుంటోందని చెప్పారు. వచ్చే ఏడాది భారత్ లో 'ఏఐ ఇంపాక్ట్' సదస్సును నిర్వహిస్తామన్నారు. బ్రిక్స్ సందర్భంగా క్యూబా అధ్యక్షుడు మియో డియోజ్ కనెల్ బెర్ముడెజ్, మలేసియా ప్రధానమంత్రి అన్వర్ బిన్ ఇబ్రహీం, ఉరుగ్వే అధ్యక్షుడు యమందు ఓర్సి, బొలీవియా అధ్యక్షుడు లూయిస్ ఆల్బెర్టో ఆర్స్ కాటకోరాలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భేటీ అయ్యారు.

# మరో అస్త్రం సిద్ధం!




## యుద్ధరంగంలో ఇక భారత్‌కు తిరుగులేదు..!!

భారత రక్షణ రంగం సరికొత్త మైలురాయిని చేరుకుంది. శత్రుదేశాల స్టెల్త్ యుద్ధవిమానాలు, డ్రోన్లు, హైపర్‌సోనిక్ క్షిపణులు వంటి అధునాతన ఆయుధాలకు దీటైన సమాధానంగా భారత్ తన మొట్టమొదటి ఫొటానిక్ రాడార్‌ను విజయవంతంగా అభివృద్ధి చేసింది.

ఈ అద్భుతమైన సాంకేతికతను డీఆర్‌డీవోలోని బెంగళూరు కేంద్రం అయిన ఎలక్ట్రానిక్స్ అండ్ రాడార్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ రూపొందించింది.

ఈ విజయంతో భారత్, ఈ రంగంలో అగ్రగాములైన అమెరికా, చైనా, ఇజ్రాయెల్ వంటి దేశాల సరసన నిలిచింది.

**-ఫొటానిక్ రాడార్ అంటే ఏమిటి?...** సాంప్రదాయ రాడార్లు రేడియో తరంగాలను ఉపయోగించి పనిచేస్తాయి. అయితే ఫొటానిక్ రాడార్లు కాంతి తరంగాలను (లేజర్లు, ఆప్టికల్ ఫైబర్లు) వినియోగిస్తాయి. ఇది వాటిని మరింత వేగంగా, అత్యంత ఖచ్చితత్వంతో పనిచేసేలా చేస్తుంది. స్పెక్ట్రమ్‌లో విస్తృతమైన బ్యాండ్‌విడ్త్‌ను కలిగి ఉండటం వల్ల, ఈ రాడార్లు వివిధ రకాల తరంగాలపై పనిచేయగలవు.

దీనివల్ల అత్యంత ఆధునిక స్టెల్త్ టెక్నాలజీ కలిగిన లక్ష్యాలను సైతం సులభంగా గుర్తించగలుగుతాయి.

**- ఫొటానిక్ రాడార్ ప్రత్యేకతలు:** ఈ విప్లవాత్మక రాడార్ అనేక విశేషమైన లక్షణాలను కలిగి ఉంది. స్టెల్త్ విమానాలనూ గుర్తించగల సామర్థ్యం దీని సొంతం. శత్రు దేశాల స్టెల్త్ విమానాలను గుర్తించడంలో అసాధారణమైన సామర్థ్యం కలిగి ఉంటుంది. ఎలక్ట్రానిక్ జామింగ్‌ను తట్టుకుని సమర్థవంతంగా పనిచేస్తుంది. తక్కువ వేడిని ఉత్పత్తి చేస్తూనే అత్యధిక సామర్థ్యాన్ని అందిస్తుంది.ఒకేసారి బహుళ లక్ష్యాలపై త్రీడీ నిఘా పెట్టగలదు. అద్భుతమైన స్పష్టత, వేగం, మరియు విశ్వసనీయతను కలిగి ఉంటుంది.ఫొటానిక్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్లను ఉపయోగించడం వల్ల సంకేత విశ్లేషణ వేగం గణనీయంగా పెరుగుతుంది.

**- ప్రయోగాత్మక దశలోకి అడుగులు:** ఈ ఫొటానిక్ రాడార్ పనితీరును మరింత మెరుగుపరచడానికి, ఈ ఏడాది చివరిలో డీఆర్‌డీవో విస్తృతంగా ప్రయోగాలు చేపట్టనుంది.

పర్వత ప్రాంతాలు, తీర ప్రాంతాలు వంటి విభిన్న వాతావరణాల్లో దీని పనితీరును పరీక్షించనున్నారు. అంతేకాకుండా భారత్‌కు చెందిన ఆకాశ్‌తీర్ వంటి గగనతల రక్షణ వ్యవస్థలకు దీనిని అనుసంధానం చేసే ప్రయత్నాలు కూడా కొనసాగుతున్నాయి.

**- యుద్ధవిమానాల్లో అమరిక.. మారుతున్న వ్యూహాలు:** ఈ రాడార్ చాలా చిన్నగా ఉండటం వల్ల, దీనిని సుఖోయ్-30 ఎంకేఐ, రఫేల్, తేజస్ వంటి యుద్ధవిమానాల్లో సులభంగా అమర్చవచ్చు. అంతేకాకుండా సంచార వేదికలపై కూడా అమర్చే అవకాశం ఉంది. ఇది పాకిస్థాన్, చైనా సరిహద్దుల వెంబడి దీనిని మోహరించడానికి వీలు కల్పిస్తుంది, తద్వారా మన దేశ రక్షణకు మరింత బలం చేకూరుతుంది.

**- చైనా, పాక్ వ్యూహాలకు చెక్...** చైనా యొక్క జె-20 స్టెల్త్ యుద్ధవిమానాలు , పాకిస్థాన్ డ్రోన్లు సాంప్రదాయ రాడార్లను మోసం చేయగలవు. అయితే, భారత్ అభివృద్ధి చేసిన ఈ ఫొటానిక్ రాడార్ ఈ వ్యూహాలను సమర్థవంతంగా అడ్డుకునే సామర్థ్యాన్ని కలిగి ఉంది. శత్రు వైమానిక దాడులపై ముందస్తు హెచ్చరికలు ఇవ్వగల ఈ రాడార్లు భారత రక్షణను మరింత బలోపేతం చేయనున్నాయి. భారత్ అభివృద్ధి చేసిన ఈ ఫొటానిక్ రాడార్ రక్షణ రంగంలో ఒక విప్లవాత్మక ముందడుగు. ఇది శత్రు దేశాల ఆధునిక వాయుసేన వ్యూహాలకు సమర్థవంతమైన బదులుగా నిలుస్తుంది.

తక్కువ గమనించబడే స్టెల్త్ టెక్నాలజీ ఉన్న విమానాలను, డ్రోన్లను కూడా పట్టుకునే ఈ నూతన పరికరం ద్వారా దేశ గగనతల రక్షణ మరింత పటిష్టంగా మారనుంది.




హైదరాబాద్ / అమరావతి : కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, దేశవ్యాప్తంగా 10 ప్రధాన కార్మిక సంఘాలు మరియు వాటి అనుబంధ సంఘాల ఐక్యవేదిక జూలై 9న భారత్ బంద్‌కు పిలుపునిచ్చింది. కేంద్రం కార్మికుల హక్కులను లెక్కచేయకపోవడం, కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేయడంపై ఈ బంద్ చేపట్టినట్లు నేతలు తెలిపారు. గత 10 ఏళ్లుగా వార్షిక కార్మిక సమావేశాలు నిర్వహించకుండా కేంద్రం పనితీరు దుర్వినియోగమవుతోందని వారు ఆరోపిస్తున్నారు.

**బ్యాంకింగ్, పోస్టల్, ఇన్సూరెన్స్ రంగాల్లో ప్రభావం...** ఈ బంద్‌లో బ్యాంకింగ్, పోస్టల్, ఇన్సూరెన్స్ వంటి కీలక రంగాలకు చెందిన ఉద్యోగులు పాల్గొననున్నారు. దీంతో పలు సేవల్లో అంతరాయం కలగవచ్చు.

ప్రజలు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ విధానాల వల్ల నిరుద్యోగిత పెరుగుతోందని, కార్మికులకు కనీస భద్రత లేకుండా పోతోందని సంఘాలు మండిపడ్డాయి.

**రైతులతో కలిసి విస్తృతమైన ఉద్యమం...** ఈ బంద్‌కు రైతు సంఘాలు కూడా మద్దతు తెలుపడంతో, దీని వ్యాప్తి మరింత విస్తృతమయ్యే అవకాశం ఉంది. ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ నేతల ప్రకారం, దేశవ్యాప్తంగా సుమారు 25 కోట్ల మంది ఈ బంద్‌లో పాల్గొననున్నట్లు అంచనా. కార్మికుల హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఉద్యమాలు మరింత ఉధృతంగా మారతాయని హెచ్చరించారు.




## కూలిన కరకట్ట గోడ.. డేంజర్‌లో భద్రాచలం

భద్రాచలంను గోదావరి వరదల నుంచి కాపాడే కరకట్ట ప్రమాదంలో పడింది. ఎప్పటికప్పుడు తాత్కాలిక మరమ్మత్తులు చేసినా.. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి 50 మీటర్ల మేర రక్షణ గోడ కూలిపోయింది. ఇప్పటికిప్పుడు పెద్ద నష్టం ఏమీ లేకపోయినా.. భారీ వరదలొస్తే ఇబ్బందికర పరిస్థితులు ఉంటాయంటున్నారు నిపుణులు.

**ప్రమాదంలో భద్రాచలం కరకట్ట..** బ్రిడ్జ్ సెంటర్-కొత్త కాలనీ మధ్య కరకట్ట కుంగిపోయింది. గోదావరి వెంట నిర్మించిన కరకట్టపైన కూడా భారీగా పగుళ్లు కనిపిస్తున్నాయి. కరకట్ట కుంగిన చోట ఇసుక బస్తాలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు అధికారులు. వరదల వేళ కరకట్ట బలహీనపడటంతో భద్రాచలం వాసులు ఆందోళనలో ఉన్నారు.

**20 ఏళ్ల కిందట కరకట్ట నిర్మాణం..** 80 అడుగుల మేర వరదలొచ్చినా ముంపు తలెత్తకుండా భద్రాచలాన్ని కాపాడేందుకు 20 ఏళ్ల కిందట కరకట్టను నిర్మించారు. గత మూడేళ్లుగా కరకట్టకు అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టలేదు. కరకట్టపైన సీసీ రోడ్లు పగుళు ఇచ్చినా పట్టించుకోలేదు. రాష్ట్ర విభజన తర్వాత దాదాపు 5 కిలోమీటర్ల పొడవైన కట్ట తెలంగాణలో ఉండగా.. మిగతా భాగం ఏపీలోకి అల్లూరి జిల్లా ఎటపాక పరిధిలోకి వెళ్లింది. గోడ కూలిన విషయాన్ని రంపచోడవరంలోని ఇరిగేషన్ అధికారులకు సమాచారమిచ్చినా ఎవరూ పట్టించుకోలేదని తెలుస్తుంది.

**మళ్లీ వరదలొస్తే ఆగని కరకట్ట...** గోదావరి కరకట్టకు వెంటనే మరమ్మతులు చేయించి, బలోపేతం చేయాలని స్థానికులు కోరుతున్నారు. 70 అడుగుల మేర గోదావరి వరద వచ్చినప్పటికీ భద్రాచలం పట్టణానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా గోదావరి కరకట్టకు మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం స్పందించి దీనిపై చర్యలు చేపట్టాలని వారు విన్నవిస్తున్నారు. మళ్లీ గోదావరి వరదలు 72 అడుగులు మేర వచ్చినట్లయితే కరకట్ట ఆగే పరిస్థితి లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరకట్ట పైభాగంలో నిర్మించిన సీసీ రోడ్డు చాలాచోట్ల గుంతలు ఏర్పడి పగుళు ఏర్పడ్డాయి. కరకట్టకు రెండు వైపులా పెద్ద పెద్ద చెట్లు, పిచ్చి చెట్లు, ముళ్ల కంపలతో దర్శనమిస్తోంది.

**ఘటనపై పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు...** ఏపీ అధికారుల అనుమతి లేకుండా కూలిన చోట మరమ్మతులు చేస్తే సాంకేతిక చిక్కులు వస్తాయని భద్రాచలం ఇరిగేషన్ అధికారులు చెప్తున్నారు.

భద్రాచలం- ఎటపాక మధ్య మేడువాయి వాగుకు వరద చేరితే ఆ నీరు విరిగిపడ్డ గోడ వైపున స్లూయిస్‌కు చేరుతుంది. అదే జరిగితే ప్రమాదం తలెత్తొచ్చు.




హైదరాబాద్: కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై ఈ ప్రభుత్వాన్ని 18 నెలలుగా నిలదీస్తున్నామని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు.

"అభివృద్ధిపై చర్చకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఎన్నో సార్లు ఆహ్వానించాం. అసెంబ్లీలో కాదంటే.. ప్రెస్‌క్లబ్‌లోనైనా చర్చకు రావాలని చెప్పా. రుణమాఫీ, రైతు బోనస్ వంటి అంశాలపై చర్చకు రావాలని ఆహ్వానించా. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఉన్నారని తెలిసింది... సీఎం రాకుంటే మంత్రులైనా రావాలి. సీఎం ఇవాళ హాజరుకాకుంటే.. మరో రోజు చర్చకైనా మేం సిద్ధం. సీఎం రేవంత్‌రెడ్డికి వీలైన తేదీ, ప్రదేశం చెప్పాలని అడుగుతున్నాం. అసెంబ్లీలో మైక్ కట్ చేయకుండా మాట్లాడిస్తామని హామీ ఇస్తే.. అసెంబ్లీలో కూడా సిద్ధం.

ఈ ప్రభుత్వం ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. రేవంత్‌రెడ్డి తప్పుకొంటే.. అభివృద్ధి అంటే ఏంటో కేసీఆర్ చేసి చూపిస్తారు" అని కేటీఆర్ అన్నారు. మీడియాతో మాట్లాడిన తర్వాత పార్టీ నేతలతో కలిసి సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు బయల్దేరారు.




భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి ఏపీలోని పురుషోత్తపట్నంలో ఉన్న భూముల్లో ఆక్రమణలను అడ్డుకునేందుకు వెళ్లిన ఆలయ ఈవో రమాదేవిపై గ్రామస్థులు దాడి చేశారు. ఈవోతో పాటు ఆలయ సిబ్బందిపైనా ఆక్రమణదారులు దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో స్పృహ తప్పి పడిపోయిన ఈవోను ఆలయ సిబ్బంది భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆమెతో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వినీల్ అస్వస్థతకు గురికావడంతో అతడికి కూడా చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వాళ్లిద్దరూ కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నంలో భద్రాచలం రామాలయానికి చెందిన 889 ఎకరాల భూమి ఉంది. చాలా కాలంగా ఇది ఆక్రమణలకు గురి అయింది. ఈ వ్యవహారంలో ఏపీ హైకోర్టు దేవస్థానానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆలయ భూములకు సంబంధించి దేవస్థానానికి పట్టాదారు పాసు పుస్తకాలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో నిర్మాణాలు చేపట్టవద్దని అడ్డుకునేందుకు వెళ్లిన ఈవోతో పాటు ఆలయ సిబ్బందిపై గ్రామస్థులు కర్రలతో దాడి చేశారు. ఆలయ ఈవోపై దాడిని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఖండించారు. దేవస్థాన భూముల ఆక్రమణలపై అడిగేందుకు వెళితే దాడి చేయడం సరికాదన్నారు. దాడి చేసిన వారిపై పోలీసులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.




సంగారెడ్డి: పాశమైలారం సిగాచీ పరిశ్రమ ప్రమాదంలో మృతుల సంఖ్య 44కు చేరింది. ఈ ఘటనలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో మరో ఇద్దరు మృతి చెందారు. పనేషియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆరిఫ్, ధ్రువ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అఖిలేశ్వర్ మృతి చెందారు. ఇవాళ ఇద్దరి మృతితో ఈ ఘటనలో ఇప్పటి వరకూ ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 44కు చేరింది. మరోవైపు నేడు పాశమైలారం సిగాచీ పరిశ్రమకు నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ బృందం రానుంది. ఘటనా స్థలాన్ని NDMA బృందం పరిశీలించనుంది. పరిశ్రమలో పేలుడుకు గల కారణాలపై ఎస్‌డీఎంఏతో కలిసి అధ్యయనం చేయనుంది. ప్రమాదానికి గల కారణాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక ఇవ్వనుంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచనలు చేయనుంది.




హైదరాబాద్: భద్రాచలం ఈవో రమాదేవిపై జరిగిన దాడి ఘటనపై మంత్రి కొండా సురేఖ స్పందించారు. ఈవోలపై దాడి చేస్తే ఊరుకునేది లేదన్నారు. దేవాలయ భూములను కబ్జా చేస్తే పీడీ యాక్ట్ పెడతామని హెచ్చరించారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఏపీ సీఎం చంద్రబాబును కొండా సురేఖ కోరారు.

**భద్రాచలం ఆలయ ఈవోపై దాడి..** ఏపీలోని పురుషోత్తపట్నంలో భద్రాచలం రామాలయానికి చెందిన భూముల్లో ఆక్రమణలను అడ్డుకునేందుకు మంగళవారం ఈవోతో పాటు సిబ్బంది వెళ్లారు. ఈవోపై గ్రామస్థులు దాడి చేశారు. దీంతో ఆమె స్పృహ కోల్పోయారు. ప్రస్తుతం ఈవో రమాదేవి భద్రాచలం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

## రాళ్లతో కొట్టే పరిస్థితి వస్తుంది..కేటీఆర్ కు బల్మూరి వార్నింగ్



గులాబీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావుకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్. పిచ్చికుక్కలా మాట్లాడితే.. రాళ్లతో కొట్టే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఇవాళ ఉదయం నుంచి... కేటీఆర్ వర్సెస్ కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిపై చర్చకు రావాలని కేటీఆర్... సోమాజిగూడ ప్రెస్ క్లబ్ కు వెళ్లారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు... కాంగ్రెస్ నేతలపై విరుచుకుపడ్డారు కేటీఆర్. అయితే కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ నేతలు కౌంటర్ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ పై విరుచుకుపడ్డారు బల్మూరి వెంకట్. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే రాళ్లతో కొట్టే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. నీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే... మీ నాన్నను అసెంబ్లీకి తీసుకురా... అప్పుడు చర్చ పెడదామని సవాల్ విసిరారు.

ముందు నీ ఇంట్లో వివాదాలు చక్కదిద్దుకో అంటూ కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం... తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడుపుతోందని... స్పష్టం చేశారు. కాంగ్రెస్ పైన తెలంగాణ ప్రజలకు నమ్మకం ఉందన్నారు.

## 'బీసీ' బిల్లు ఆమోదించకపోతే రైల్‌రోకో: ఎమ్మెల్సీ కవిత




దిల్లీ: బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు ఇవ్వాలని భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. దిల్లీలో ఆమె మీడియాతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఆమోదించకపోతే జులై 17న రైల్‌రోకో చేస్తామని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లు సాధించేవరకు పోరాడతామని చెప్పారు. రైల్‌రోకోకు మద్దతు కోరుతూ బుధవారం అన్ని పార్టీలకు లేఖ రాస్తామని తెలిపారు.




కోవూరు: వైకాపా నేత ప్రసన్నకుమార్‌రెడ్డి మురికి వ్యాఖ్యలకు నిరసనగా నెల్లూరు జిల్లా కోవూరులో ఆందోళనలు ఉద్ధృతమయ్యాయి. వేలాది మంది మహిళలు రోడ్డెక్కారు. స్థానిక మహిళా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన ప్రసన్నకుమార్‌రెడ్డిని నియోజకవర్గంలో అడుగు పెట్టనీయమని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి తెలుగు మహిళలతోపాటు, పార్టీ కార్యకర్తలు కోవూరు పట్టణంలోని మందబయలు సెంటరుకు భారీగా చేరుకొని నిరసన తెలిపారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తి.. మహిళ పట్ల అసభ్యకరంగా మాట్లాడటం దారుణమని మండిపడ్డారు. ప్రసన్నకుమార్‌రెడ్డిపై తెదేపా మహిళానేతలు కోవూరు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి బహిరంగ క్షమాపణ చెప్పిన తర్వాతే ప్రసన్నకుమార్‌రెడ్డి నియోజకవర్గానికి రావాలని నినాదాలు చేశారు. నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బరితెగించి మరీ మహిళా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మురికి వ్యాఖ్యలు చేయడంతో సోమవారం రాత్రి ఆయన ఇంటిపై దాడి జరిగింది. కోవూరు నియోజకవర్గం పడుగుపాడులోని ఓ కల్యాణ మండపంలో సోమవారం మధ్యాహ్నం వైకాపా నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ప్రసన్నకుమార్‌రెడ్డి నోరుపారేసుకున్నారు. ప్రశాంతిరెడ్డి చరిత్ర మొత్తం తనకు తెలుసంటూ.. దారుణమైన పదజాలాన్ని వాడారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఎవరూ దొరకనట్టు ఆమెను చేసుకున్నారని.. ఆయన కోరితే ఓ కన్నెపిల్లను తెచ్చి తానే పెళ్లి చేసేవాడినంటూ మాట్లాడారు. 'పదేళ్ల కిందట నువ్వు ఎక్కడున్నావ్? ఆ ప్రభాకర్‌రెడ్డికి ఒకటే చెబుతున్నా.. నీ దగ్గర రూ.వేల కోట్ల ఆస్తులున్నాయ్. జాగ్రత్తగా ఉండాలి నువ్వు. ఇప్పటికే నిన్ను చంపడానికి రెండు సిట్టింగ్‌లు అయ్యాయని నా దగ్గర సమాచారం ఉంది' అంటూ మరికొన్ని మురికి వ్యాఖ్యలు చేశారు. 'అతనో పిచ్చోడు. ఎందుకు ఈమెను పెళ్లిచేసుకున్నాడో తెలియదు. అతను అడిగి ఉంటే.. జిల్లాలో ముక్కుపచ్చలారని ఏ అమ్మాయినైనా అతనికిచ్చి పెళ్లి చేసేవాడిని' అని అన్నారు.

# విలక్షణ నటుడు సంజీవ్ కుమార్ - జూలై 9...సంజీవ్ కుమార్ జయంతి



ఒక విలక్షణమైన నటుడు. రంగస్థలం అంటే అతనికి ప్రాణం. సినిమాల్లోకి రావాలని ప్రయత్నిస్తున్న సమయంలో రాజశ్రీ సంస్థ స్క్రీన్ టెస్ట్‌లో విఫలమయ్యాడు. అతడే ఆ తర్వాత జాతీయ స్థాయిలో ఉత్తమ నటుడుగా రెండుసార్లు 'భారత్' అవార్డులను అందుకోవడం విశేషం. ఆయనే సంజీవ్ కుమార్. సంజీవ్ కుమార్ అసలు పేరు హరిహర్ జెఠాలాల్ జరీవాలా (హరిభాయ్ అని కూడా పిలిచేవారు.) ఆయన 1938 జూలై 9న సూరత్, బాంబే ప్రెసిడెన్సీ, బ్రిటిష్ ఇండియాలో ఒక గుజరాతీ పటేల్ కుటుంబంలో జన్మించారు. ఇతని బాల్యం సూరత్‌లో గడచింది. తరువాత ఆయన కుటుంబం ముంబాయికి తరలి వెళ్ళింది. అక్కడ ఒక ఫిలిం స్కూలులో సంజీవ్ కుమార్ శిక్షణ పొందారు. తద్వారా బాలీవుడ్‌లో నటుడిగా స్థిరపడ్డారు. నట జీవితాన్ని నాటక రంగం ద్వారా ప్రారంభించారు. మొదట ఇతడు ముంబాయిలోని "ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ ", తర్వాత "ఇండియన్ నేషనల్ థియేటర్" సంస్థల నాటకాలలో వేషాలు వేశారు. రంగస్థల నటుడిగా ఇతడు 22 ఏళ్ల వయసులో ముసలి వేషాలు వేసేవారు. 1952లో శశిధర్ ముఖర్జీ బెంగాలి సినిమా 'బసు పరివార్' చిత్రాన్ని హిందీలో 'హమ్ హిందుస్తానీ' పేరుతో 1960లో పునర్నిర్మించారు. సునీల్ దత్, ఆశాపరేఖ్ జంటగా నటించిన ఈ చిత్రం ద్వారా సంజీవ్ కుమార్ బాలీవుడ్‌కు పరిచయ మయ్యాడు. ఇతనితోపాటే ప్రేమ్ చోప్డా కూడా వెండితెరకు చేరువయ్యారు. హీరోగా హిందీ సినిమాలో పరిచయం కావడానికి సంజీవ్ కుమార్‌కు ఐదేళ్ళు పట్టింది. 1965లో 'నిశాన్' అనే సినిమా ద్వారా కథా నాయకుడి వేషాలు వేయడం మొదలు పెట్టాడు. 1968లో 'సంఘర్ష్' సినిమాలో ప్రముఖ నటుడు దిలీప్ కుమార్‌తో కలిసి నటించారు. తరవాత 'స్మగ్లర్', 'పతి పత్ని', 'హుస్న్ అవుర్ ఇష్?', 'బాదల్' వంటి సినిమాల్లో నటించినా సంజీవ్ కుమార్‌కు పెద్దగా గుర్తింపు రాలేదు. హిందీ సినిమాలలోనే కాక మారాఠీ, తెలుగు, పంజాబీ, సింధీ, తమిళ, గుజరాతీ సినిమాలలో కూడా నటించారు. ఇతడు గుల్జార్, ఎ.కె.హంగల్, హృషీకేశ్ ముఖర్జీ, యశ్ చోప్రా, సుభాష్ ఘాయ్, సత్యజిత్ రే మొదలైన దర్శకులతో పనిచేశారు. అరుణా ఇరానీ, జయ బాధురి, ఎల్.విజయలక్ష్మి, రాఖీ, లీనా చంద్రావర్కర్, సులక్షణా పండిట్, మౌసమీ చటర్జీ, యోగీతా బాలీ, అపర్ణా సేన్, షర్మిలా ఠాగూర్ మొదలైన నటీమణుల సరసన నటించారు. ఇతడు నటించిన షోలే చిత్రంలో ఠాకూర్ పాత్ర ఇతడికి మంచి పేరు తెచ్చి పెట్టింది. 'నయాదిన్ నయీరాత్' సినిమాలో తొమ్మిది పాత్రలను ధరించారు. ఈ పాత్రలను తమిళం (నవరాత్రి)లో శివాజీ గణేశన్, తెలుగు (నవరాత్రి)లో అక్కినేని నాగేశ్వరరావు పోషించారు. బాలీవుడ్‌లో ప్రవేశించిన తొలిరోజుల్లో లఘు బడ్జెట్ సి-గ్రేడ్ చిత్రాల్లో నటించారు. 1965లో 'నిషానా' సినిమాతో హీరో అవతార మెత్తిన సంజీవ్ కుమార్ అచిరకాలం లోనే 'ఖిలోనా' వంటి విభిన్న సినిమాల్లో అద్భుత నటనా వైదుష్యాన్ని చూపి, భవిష్యత్ ప్రస్థానానికి పునాదులు నిర్మించు కున్నారు. రాజిందర్ సింగ్ బేడి నిర్మించిన 'దస్తక్' సినిమా ఉత్తమ కథానాయకునిగా సంజీవ్ కుమార్‌కు జాతీయ పురస్కారాన్ని అందించింది. తరువాత గుల్జార్ దర్శకత్వం వహించిన 'కోషిష్', 'పరిచయ్' సినిమాలు విభిన్న పాత్రలను ప్రసాదించి సంజీవ్ కుమార్‌లోని అసలు సిసలైన నటుణ్ణి వెలికి తీశాయి. గుల్జార్ పర్యవేక్షణలోనే వచ్చిన 'ఆంధీ', 'మౌసమ్' సినిమాలు సంజీవ్ కుమార్ నట ప్రస్థానాన్ని సుస్థిరం చేశాయి. తరువాత గుల్జార్ దర్శకత్వంలో వచ్చిన 'కోషిష్' సినిమా సంజీవ్ కుమార్‌కు ఉత్తమ నటుడిగా జాతీయ బహుమతి తెచ్చి పెట్టింది. ఇక 'షోలే' సినిమాలో ఠాకూర్ బలదేవ్ సింగ్ పాత్రలో ఆయన ఒదిగి పోయారు. ఆయనకు పుట్టుకతోనే గుండెలో లోపం వుండేది. అది జన్యుపరంగా సంక్రమించినదే. 1976లో తొలిసారి గుండెపోటు వచ్చినప్పుడు అమెరికాలో బైపాస్ చికిత్స చేయించు కున్నారు. అయితే 1985 నవంబరు 6న సంజీవ్ కుమార్‌కు తీవ్రమైన గుండెపోటు వచ్చింది. దాంతో బ్రతికే అవకాశం లేకుండా పోయింది. అయితే ఆరోగ్యాన్ని సరిగ్గా పట్టించుకోక 47 సంవత్సరాలకే బ్రహ్మచారిగా మిగిలి తనువు చాలించారు. గుజరాత్ రాష్ట్రం సూరత్ లో ఒక వీధికి ఇతని స్మృత్యర్థం "సంజీవ్ కుమార్ మార్గ్" అని నామకరణం చేశారు. ఇతనిపేరుతో సూరత్‌లో ఒక పాఠశాల నెలకొల్పారు. 2013, మే 3వ తేదీ భారతప్రభుత్వం ఇతనిపై ఒక తపాలాబిళ్ల విడుదల చేసింది. 14 ఫిబ్రవరి 2014లో ఇతని స్వంత పట్టణం సూరత్‌లో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి, ప్రస్తుత భారత ప్రధాని నరేంద్ర మోడీ 108 కోట్ల విలువైన సమావేశ మందిరాన్ని "సంజీవ్ కుమార్ ఆడిటోరియం" పేరుతో ప్రారంభించారు. ఇతని పేరుతో "సంజీవ్ కుమార్ ఫౌండేషన్" ఒక జాతీయ స్థాయి సేవా సంస్థ ఏర్పాటు చేయబడింది. ఈ సంస్థ బాలల విద్య, ఆరోగ్య, సాంస్కృతిక అభ్యున్నతికై పనిచేస్తున్నది.


**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# "విద్యార్థి శక్తికి జాతీయ రూపం: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆవిర్భవం"

## "విద్యార్థుల హక్కుల నుండి సామాజిక సేవ దాకా: ఎ బి వి పి విశిష్ట ప్రస్థానం"

## 1949 జూలై 9...- అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆవిర్భవ దినం

భారత స్వాతంత్ర్యానంతరం దేశానికి ఎదురైన అతిపెద్ద సవాళ్లలో ఒకటి %–% యువతను సరిదిద్దడం. స్వాతంత్ర్య పోరాటంలో చురుకైన పాత్ర పోషించిన విద్యార్థి వర్గం, స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే ఒక విచిత్రమైన ఖాళీ స్థితిలోకి వెళ్లి పోయింది. ఆలోచనా హీనత, దిశా హీనత, కమ్యూనిస్టు ప్రభావం, విదేశీ మత ప్రచారాల వల %–% ఇవన్నీ దేశ యువతను తార్కికంగా, చైతన్య వంతంగా పునరుద్ధరించాల్సిన అవసరాన్ని ఏర్పరిచాయి. ఈ నేపథ్యంలోనే 1949 జూలై 9న ముంబయిలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఎ బి వి పి ఆవిర్భవించింది. ఈ సంస్థ ఆరంభంలోనే విద్యార్థి శక్తిని దేశ నిర్మాణానికి దోహదపడే దిశగా నడిపించాలన్న తపనతో ముందడుగు వేసింది. ఇది కేవలం విద్యార్థి సమస్యల పరిష్కారానికి కాదు, దేశం పట్ల బాధ్యతగల పౌరులను తీర్చిదిద్దాలన్న ఆత్మ బలంతో ఏర్పడింది. ఈ భావనకు శక్తినిచ్చినది రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్. మొదట్లోనే బల్వంత్ ఆప్టే వంటి ఆచార్యులు దీన్ని ప్రారంభించినా, 1958నాటికి ప్రొఫెసర్ యశ్వంత్ రావు కెల్కర్ దీన్ని సంస్థాగతంగా శక్తివంతం చేసి, దేశవ్యాప్తంగా విస్తరించేలా చేశారు. ఆదిలోనే ఈ సంస్థ నాలుగు ప్రధాన దిశలలో దృష్టిపెట్టింది %–% జాతీయత, విద్యా సంస్కరణలు, విద్యార్థుల హక్కుల పరిరక్షణ, సామాజిక సేవ. ఈ నలభై దశాబ్దాల్లో ఎన్నో విద్యా, రాజకీయ, సాంస్కృతిక సంఘర్షణల మధ్య ఎ బి వి పి తన స్ఫూర్తిని నిలుపుకుంటూ ముందుకు సాగింది. స్వాతంత్ర్యానంతర కాలంలో విద్యా వ్యవస్థ బ్రిటిష్ ప్రభావానికి లోనై, స్వదేశీ అవసరాలకు దూరంగా కొనసాగుతోంది. పాఠ్యాంశాల్లో భారతీయత గల్లంతవుతోంది. విద్యార్థుల ప్రాథమిక అవసరాలు, హక్కులు నిర్లక్ష్యం చెందబడ్డాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు ఎ బి వి పి తన తొలి పోరాటాలను ప్రారంభించింది. మొదట ముంబయి విశ్వ విద్యాలయంలో ఉపన్యాసాలు, చర్చా కార్యక్రమాలు, న్యాయమైన విద్యా పద్ధతులపై చైతన్య యాత్రలు నిర్వహించ బడినవి. 1950లలోనే ఎ బి వి పి దేశ వ్యాప్తంగా విస్తరించేందుకు పునాదులు వేసింది. 1958లో ఇది ఆరెస్సెస్ అధికారిక విద్యార్థి విభాగంగా గుర్తింపు పొందిన తర్వాత, మరింత శక్తివంతమైన విస్తరణ ప్రారంభమైంది. ఈ కాలంలో ఎ బి వి పి విద్యార్థి వేదికలను ఉపయోగించి దేశమంతా చైతన్యాన్ని వ్యాపింప జేసింది. విద్యార్థి సంఘటనలు, పోటీలు, సమ్మేళనాలు, ఉద్యమాల ద్వారా విద్యార్థుల్లో జాతీయ భావనను కలిగించే కార్యక్రమాలు పెరిగాయి. 1970లలో, ప్రత్యేకించి ఎమర్జెన్సీ సమయంలో ఎ బి వి పి తన అసలైన విలువలను ప్రదర్శించింది. ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే శాసనాలపై అభ్యంతరాలు తెలిపి, వేలాది మంది కార్యకర్తలు నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. ఆ సమయంలో విద్యార్థి ఉద్యమం సైద్ధాంతికంగా పదిలమైంది. అరెస్టులు, నిర్బంధాలు కూడా ఎ బి వి పి పోరాట హృదయాన్ని నిలువరించ లేక పోయాయి. 1980లలో విద్యా వ్యవస్థలో నకిలీ డిగ్రీల సవాళ్ళపై, మౌలిక వసతులపై, ఫీజుల పెంపుపై, ప్రాంతీయ వివక్షలపై ఎ బి వి పి అనేక ఉద్యమాలు నిర్వహించింది. అదే సమయంలో దేశమంతటా సామాజిక విప్లవాల నేపథ్యంలో కశ్మీర్, ఉత్తరాంధ్ర, బస్తర్, బెంగళూరు వంటి ప్రాంతాలలో జాతీయతా భావనను బలపరచ డానికి దీక్షాభ్యాసాలు, సమీక్షా వేదికలు, జాతీయ యాత్రలు నిర్వహించాయి. 1993లో "చలో ఎర్రబొడ్డు" ఉద్యమం ద్వారా నక్సలిజానికి వ్యతిరేకంగా విద్యార్థి శక్తిని సమీకరించింది. ఈ యాత్ర తెలంగాణ యువతలో జాతీయతకు ఓ నూతన ఊపిరి ఇచ్చింది. ఆ తరువాత "విద్యార్థి ఆవాహన్", "జ్ఞాన యజ్ఞం", "సంస్కృతి సురక్షా యాత్ర" వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులను దేశ సాంస్కృతిక వారసత్వంపై చైతన్యవంతం చేసింది. 2000 తర్వాతి దశలో ఎ బి వి పి తన




కార్యకలాపాల్లో టెక్నాలజీ, సోషల్ మీడియా వినియోగాన్ని విస్తరించింది. రక్షా బంధన్ కార్యక్రమాల ద్వారా సైనికుల పట్ల కృతజ్ఞతా వ్యక్తీకరణ, సేవా యాత్రలు, యువ సమ్మేళనాల ద్వారా సామాజిక బాధ్యతను గుర్తు చేయడం, ఆరోగ్య శిబిరాలు, ప్రకృతి పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమగ్ర ప్రేరణా వేదికగా ఎ బి వి పి మారింది. 2020లో కరోనా మహమ్మారి సమయంలో దేశవ్యాప్తంగా అనేక ఎ బి వి పి కార్యకర్తలు మానవ సేవా దృక్పథంతో ఆక్సిజన్ సరఫరా, మందుల పంపిణీ, ఆహార సేవ, శ్మశానాల్లో సహకారం వంటి సేవా కార్యక్రమాలలో పాల్గొన్న తీరు %–% విద్యార్థి శక్తి సామాజిక సేవకు ఎలా నడిచిందనేది చూపింది. ఈ సమయంలో "సేవా నిరత విద్యార్థి" అనే కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో నడిపారు. 2024 నాటికి ఎ బి వి పి దేశవ్యాప్తంగా 4,500 పైగా కళాశాల శాఖలతో విస్తరించింది. దాదాపు 12 లక్షల మందికి పైగా విద్యార్థులు ఇందులో భాగస్వాములుగా ఉన్నారు. ప్రతి సంవత్సరం 10,000కి పైగా శిక్షణా శిబిరాలు, వర్క్షాపులు, చైతన్య పరమైన ఉద్యమాలు జరుగు తున్నాయి. ఏకకాలంలో విద్యార్థి హక్కుల కోసం పోరాటం చేస్తూనే, సమాజానికి ఉపయోగపడే నాయకత్వాన్ని తీర్చిదిద్దడమే ఈ సంస్థ ప్రత్యేకత. ఈ సంస్థలో నుంచి అరుణ్ జైట్లీ, వెంకయ్య నాయుడు, ఉమా భారతి, ధర్మేంద్ర ప్రధాన్ వంటి కేంద్రస్థాయిలోకి ఎదిగిన నాయకులు పుట్టుకొచ్చారు. వారు విద్యార్థి జీవితం లోనే దేశ రాజకీయ చైతన్యానికి బీజం వేసి, నాయకత్వ లక్షణాలు పెంపొందించు కున్నారు. అలాగని ఎ బి వి పి విమర్శల నుండి విముక్తి పొందినదేం కాదు. కొన్ని వర్గాలు దీన్ని మతపరమైన భావజాలంతో పని చేసే సంస్థగా అభివర్ణించాయి. విద్యా సంస్థల స్వతంత్రతకు భంగం కలిగించిందని ఆరోపణలు వచ్చాయి. కానీ ఎ బి వి పి తన కార్యకలాపాలు "రాష్ట్ర హితం %–% విద్యార్థి శ్రేయస్సు" అనే సిద్ధాంతానికి అనుగుణంగా కొనసాగిస్తున్నట్లు పదే పదే స్పష్టీకరించింది. ఈ పంచ దశాబ్ద కాలంలో విద్యార్థి ఉద్యమం ఎలా రూపుమారిందో, ఒక సామాజిక శక్తిగా ఎలా ఎదిగిందో తెలుసుకోవాలంటే ఎ బి వి పి పాత్రను విస్మరించలేం. ఇది కేవలం ఒక విద్యార్థి సంఘం కాదు %–% ఇది ఒక ఉద్యమం. ఇది విద్యార్థికి దేశం పట్ల బాధ్యతను నేర్పే సంఘటిత వేదిక. విద్యార్థి శక్తిని చైతన్య వంతంగా, క్రమశిక్షణతో, దేశభక్తితో నడిపించడంలో ఎ బి వి పి కొనగాంచిన సేవలు దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గవే. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# పరమ పుణ్యప్రదం...సింహాచల గిరి ప్రదక్షిణం




విశాఖ పరిసర ప్రాంతాలతో పాటు ఉత్తరాంధ్ర, ఒడిశా ప్రాంత భక్తులంతా సింహాద్రి అప్పన్నగా పిలుచుకునే శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి కొలువై వున్న ప్రసిద్ధ వైష్ణవ పుణ్యక్షేత్రం సింహాచలం దీనిని షిమాద్రి ఆలయం అని కూడా పిలుస్తారు. సింహాచలం%ౌ% సింహం కొండ అని అర్థం. ఇది పద్దెనిమిది "నరసింహ క్షేత్రాలలో" ఒకటి. చందన రూపుడు, సింహాచలేశుడు దేశం లోని అన్ని నారసింహ క్షేత్రాల్లో విశాఖపట్నం జిల్లాలోని సింహాచలం క్షేత్రం అతి ప్రాచీనమైనది. విశాఖ పట్నానికి 11 కిలోమీటర్ల దూరంలో తూర్పు కనుమలలో, సముద్ర మట్టానికి 244 మీటర్ల ఎత్తున వున్న 'సింహగిరి' అనే పర్వతం మీద కొలువై వున్న సింహాచలం తెలుగు రాష్ట్రాల్లోనే సుప్రసిద్ధ నారసింహ క్షేత్రం. ఈ క్షేత్రంలో భక్తులందరూ 'సింహాద్రి అప్పన్న'గా పిలుచుకునే వరాహ లక్ష్మీ నరసింహ స్వామి కొలువై వున్నాడు. సింహాచలం క్షేత్రంలో రెండు విష్ణు అవతారాలు కలసిన మూర్తిని పూజిస్తారు. రెండు అవతారాలు ఒకదాని కొకటి సంబంధించి ఉన్నాయిని అర్థం. ఒకటి భూదేవి భర్తయైన వరహావతారం. రెండవది లక్ష్మీదేవి భర్తయైన నరసింహావతారం. వేదాలు అపహరించిన హిరణ్యాక్షుడిని సంహరించిన వరాహ అవతారం, ఆ తర్వాత యుగంలో హరి ద్వేషంతో.. భక్తులను హింసించిన హిరణ్యకశిపుని వధించిన నృసింహావతారాల కలయికగా.. స్వామి ఇక్కడ వరాహ నృసింహ స్వామిగా స్వయం వ్యక్తమయ్యారు. హిరణ్య కశిపుని వధానంతరం భక్తశ్రేష్టుడైన ప్రహ్లాదునిచేత ప్రతిష్టితమైనదిగా చెప్పుకుంటారు. చంద్రవంశానికి చెందిన పురూరవుడు అనే యాదవ రాజు గగన యానం చేస్తూ విమానం మీద వెళ్ళుతుండగా ఈ స్థలానికి ఉన్న అత్యంత ప్రశస్తమైన శక్తి ప్రభావం వల్ల పురూరవుడి విమానం క్రిందకు ఆకర్షించ బడింది. ఆరాజుకు భూమిలో కప్పబడి ఉన్న నరసింహస్వామి కనిపించాడు. విగ్రహాన్ని సంవత్సరకాలం పాటు చందనంతో కప్పి ఉంచి వైశాఖ శుద్ధ తదియ రోజు మాత్రమే చందనం లేకుండా నిజరూప దర్శనం కలిగే టట్లు చేయమని ఆకాశవాణి పురూరవుడికి వచించి నట్లు కథనం. మూల విరాట్టు లింగము ఆకారంలో కనిపిస్తుంది. అసలు విగ్రహానికి మంచి గంధం పూత పూయటం వలన ఆ విధంగా కనిపిస్తుంది. విగ్రహం వేడిగా వుంటుందని, ఆ వేడిని ఉపశమింప జేయడానికి నిరంతరం చందనం లేపనంగా పూస్తూ వుంటారని చెబుతారు. దేవాలయపు గర్భగుడికి ఎదురుగా ఉన్న ప్రాకారములో కప్ప స్తంభం ఉంది. ఈ స్తంభం సంతాన గోపాల యంత్రం ప్రతిష్టితమై ఉంది. ఇది అత్యంత శక్తివంతమైనది అని భక్తుల నమ్మకం. సంతానం లేనివారు ఈ కప్ప స్తంభమును కౌగిలించుకొంటే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. స్వామి వారికి భక్తులు ఇక్కడే కప్పాలు (కప్పం/పన్ను) చెల్లించేవారు కనుక దీనిని కప్పపు స్తంభం అనేవారు. కాలక్రమేణా అది కప్ప స్తంభం అయింది. సింహాచల క్షేత్రానికి సంబంధించి గిరి ప్రదక్షిణ ముఖ్య కార్యక్రమం. ఆషాఢ శుద్ధ చతుర్దశి నాడు మధ్యాహ్నం 2 గంటలకు సింహాచలం కొండ దిగువన ఉన్న తొలి పావంచా నుంచి అప్పన్న స్వామి విగ్రహంతో పుష్ప రథం ప్రారంభమవుతుంది. రథాన్ని ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు జెండా ఊపి ప్రారంభించనున్నారు. రథంతో పాటు లక్షలాది మంది భక్త జనం గిరి ప్రదక్షిణలో పాల్గొని శ్రీకారం చుడతారు. సింహగిరి మెట్ల వద్ద ప్రారంభించి, కాలి నడకన సింహగిరి చుట్టూ ప్రదక్షిణ చేసి, కొండపైన స్వామిని దర్శించడం. ఆషాడ పౌర్ణమి నాడు గిరి పౌర్ణమిని సింహాద్రి అప్పన్న ఉత్సవంగా చేస్తారు. కొండ దిగువన వున్న తొలి పావంచా దగ్గర నుంచి భక్తులు గిరి ప్రదక్షిణ మొదలు పెడతారు. 32 కి.మీ వైశాల్యం కలిగిన అప్పన్న కొండ చుట్టూ భక్తులు ప్రదక్షిణం చేస్తారు. గిరి ప్రదక్షిణం చేసిన భక్తులు, మరునాడు ఆలయంలో అప్పన్నను దర్శించుకుంటారు. కొండ చుట్టూ తిరగలేని భక్తులు , ఆలయంలోనే ప్రదక్షిణం చేస్తారు. గిరి ప్రదక్షణ చేస్తే, భూ ప్రదక్షిణ చేసినంత ఫలితం లభించ గలదని భక్తుల నమ్మకం.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# ఫ్యాటీ లివర్ కు చెక్ పెట్టండిలా..

ఈ రోజుల్లో బీపీ, షుగర్ లాగానే ఫ్యాటీ లివర్ అనే సమస్య కూడా ఎక్కువగా వినిపిస్తుంది. దీన్నే హెపాటిక్ స్టీటోసిస్ అని కూడా పిలుస్తుంటారు. మామూలుగా లివర్ లో ఎంతో కొంత కొవ్వు ఉండటం సహజం. కానీ ఆ కొవ్వు మోతాదు కాలేయంలో ఎక్కువగా ఉంటే ఈ సమస్య వస్తుంది. ఫ్యాటీ లివర్ లో కూడా రకాలున్నాయి. ఈ ఫాటీ లివర్ రావడానికి పలు కారణాలున్నాయి. కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు, జెనెటిక్స్, తీసుకునే ఆహారం, జీర్ణకోశ వ్యవస్థ లోపం కారణంగా ఈ ఫ్యాటీ లివర్ వచ్చే ఛాన్సులు ఎక్కువ. కెమికల్ ఫ్యాక్టరీల్లో వర్క్ చేసే వారికి ఈ సమస్య ఎక్కువగా వస్తూ ఉంటుంది. అయితే ఈ ఫ్యాటీ లివర్ ను నిర్లక్ష్యం చేస్తే ఫైబ్రోసిస్, సిర్రోసిస్, క్యాన్సర్ వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయంటున్నారు వైద్య నిపుణులు.



ఈ సమస్యను అధిగమించడానికి ఆహారంలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం కచ్చితంగా ఉందంటున్నారు. కేవలం ఆహారం మాత్రమే సమస్యను పూర్తిగా నయం చేయకపోయినా ఈ మార్పు ప్రమాదాన్ని చాలా వరకు తగ్గిస్తుందని, కొన్ని రకాల ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల ఈ సమస్యను అడ్డుకోవచ్చని పరిశోధనలు చేసి సైంటిస్టులు చెప్తున్నారు.

పెరుగు, డార్క్ చాక్లెట్స్, దాల్చిన చెక్క, వాల్‌నట్స్, ఆపిల్ లాంటి వాటిని విడివిడిగా కాకుండా కాంబినేషన్స్ తో తీసుకోవడం వల్ల మంచి ఫలితాలుంటాయంటున్నారు. వారానికి రెండు సార్లైనా గుప్పెడు వాల్‌నట్స్, రెండు ఖర్జూరాలను కలిపి తీసుకుంటే లివర్ ఇన్‌ఫెక్షన్లను అడ్డుకోవచ్చని పరిశోధనలు చెప్తున్నాయి. డ్రైనట్స్ తో డార్క్ చాక్లెట్ ను తిన్నా మంచి ఫలితాలుంటాయని, ఆపిల్– దాల్చినచెక్క పొడి– తేనె కలిపి తీసుకున్నా మంచి ఫలితాలుంటాయి. వీటిని తీసుకుంటూ చక్కెర, ప్రాసెస్డ్ ఫుడ్ కు దూరంగా ఉండాలని శాస్త్రజ్ఞులు చెప్తున్నారు.

# మస్క్ ఇలా పార్టీ పెట్టాడు.. అలా 'టెస్లా' కొంప కొల్లేరు అయ్యింది

అమెరికా టెక్ ప్రపంచంలోనే కాక, ప్రపంచ వ్యాప్తంగా కీలక పరిణామాలకు కారణమయ్యే వ్యక్తిగా గుర్తింపు పొందిన ఎలాన్ మస్క్ ఇప్పుడు మరో కొత్త అడుగు వేశారు. ఆయన తాజాగా అమెరికాలో ఓ కొత్త రాజకీయ పార్టీ ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. అయితే ఈ ప్రకటన ప్రభావం పెట్టుబడిదారుల నమ్మకాన్ని దెబ్బతీసినట్లు స్పష్టమవుతోంది.

**–టెస్లా షేర్లకు నెగెటివ్ షాక్...** మస్క్ ప్రకటన వెలువడిన వెంటనే టెస్లా షేర్లు ప్రీమార్కెట్ ట్రేడింగ్‌లో 7% మేర పతనమయ్యాయి. గత వారాంతంలో %వి%315.35 వద్ద ముగిసిన టెస్లా షేరు తాజా ట్రేడింగ్‌లో %వి%291.96కి పడిపోయింది. ఇది ఒకే రోజు వ్యవధిలో భారీ నష్టంగా పరిగణించవచ్చు. ఈ ట్రెండ్ కొనసాగితే కంపెనీ మార్కెట్ వాల్యూషన్ మీద గణనీయమైన ప్రభావం పడనుంది.

**–పెట్టుబడిదారుల విశ్వాసంపై ప్రభావం...** ఎలాన్ మస్క్ ఎప్పుడూ తన ట్వీట్లు, నిర్ణయాలతో మార్కెట్లను ప్రభావితం చేసే వ్యక్తిగా పేరు పొందారు. కానీ రాజకీయాల్లోకి అడుగుపెట్టే నిర్ణయం పెట్టుబడిదారుల్ని భయపెట్టినట్లుగా కనిపిస్తోంది.



బిజినెస్‌కు బదులుగా పాలిటిక్స్ మీద దృష్టి కేంద్రీకరిస్తే కంపెనీకి నష్టం కలుగుతుందని వారు భావిస్తున్నారు.

**–గత కాలంలో టెస్లా విజయం...** టెస్లా షేర్లు గత ఐదేళ్లలో ఇన్వెస్టర్లకు 206%కు పైగా లాభాలు తెచ్చిపెట్టాయి.

విద్యుత్ వాహన రంగంలో టెస్లా వేసిన అడుగులు, ఎలాన్ మస్క్ యొక్క విజన్ కంపెనీని ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందే స్థాయికి తీసుకువచ్చింది. కానీ ఇప్పుడు మస్క్ రాజకీయ అడుగు ఆ విశ్వాసాన్ని కొంతవరకు దెబ్బతీసినట్లుగా కనిపిస్తోంది.

**–మస్క్ రాజకీయ పార్టీపై ఇప్పటి వరకు...** ఇప్పటివరకు మస్క్ ఎలాంటి పార్టీ పేరును ప్రకటించలేదు కానీ, అది సాంప్రదాయ రిపబ్లికన్ లేదా డెమొక్రటిక్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఉంటుందని సన్నివేశాలు చెబుతున్నాయి. ఫ్రీ స్పీచ్, టెక్నాలజీ ఫ్రీడమ్, గవర్నమెంట్ నియంత్రణలపై మస్క్ చేసిన గత వ్యాఖ్యలు ఈ పార్టీ పాలసీ డైరెక్షన్‌కి దారి చూపుతున్నాయి. ఎలాన్ మస్క్ రాజకీయాల్లోకి అడుగుపెట్టడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. కానీ వ్యాపారపరంగా టెస్లా వంటి బహుళ జాతి కంపెనీకి ఇది మంచి సంకేతమా, లేక ప్రమాద ఘంటికలంటూ మోగుతున్న సంకేతమా అనేది ఇంకా కాలమే నిర్ణయించాలి. ఒకవేళ మస్క్ తన వ్యాపార భవిష్యత్తునే రాజకీయాలకు బలిచేస్తే, పెట్టుబడిదారులు మరింత వెనక్కి తగ్గే అవకాశముంది.

చురకలు



చురకలు

## సంపాదకీయం

# రాజకీయంగా 'ఒంటరి'గా ట్రంప్ ఎందుకు మిగిలిపోతున్నాడు?

అమెరికా రాజకీయాల్లో డొనాల్డ్ ట్రంప్ ఎప్పుడూ సంచలనాలకు మారుపేరు. అనూహ్య నిర్ణయాలు, ధీటైన వ్యాఖ్యలు, విభేదాలను లెక్కచేయని పాలనా ధోరణి ఆయనకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి. అయితే, అదే విధానం ఇప్పుడు ఆయన్ను ఒంటరిగా మారుస్తుందా అన్న అనుమానం కలుగుతోంది. రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికై కొన్ని నెలలే గడిచినా, ట్రంప్ చుట్టూ ఒక వలయం ఏర్పడుతోంది. అది మిత్రుల విరక్తి వలయం.

**– మిత్రులే శత్రువులుగా!** ట్రంప్ తిరిగి అధికారంలోకి వచ్చాక ఆయన గుండెచప్పుడు విన్నవారే ఒక్కొక్కరుగా విపక్షం వైపు మొగ్గుతుండటం గమనార్హం. ఎలాన్ మస్క్, మైక్ పెన్స్, జాన్ బోల్టన్, జిమ్ మ్యాటిస్, జాన్ కెల్లీ, మార్క్ మిల్లే వంటి కీలక నాయకులు ఇప్పుడు ట్రంప్‌కు వ్యతిరేకంగా బహిరంగంగా గొంతు విప్పుతున్నారు. ట్రంప్‌కు మద్దతుగా నిలిచి ఆయన ప్రచారానికి కోట్ల డాలర్లు ఖర్చు చేసినప్పటికీ, అధికారంలోకి వచ్చాక ట్రంప్ తీసుకున్న "బిగ్ బ్యూటిఫుల్ చట్టం" పట్ల మస్క్ అసంతృప్తిగా ఉన్నారు.

ఈ చట్టం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని బలవంతంగా పెంచే అవకాశం లేకుండా చేయడంతో మస్క్ తన ప్రయోజనాలకు భంగం కలిగిందని భావిస్తున్నారు. తీరా, ట్రంప్ దుశ్చర్యలను తట్టుకోలేక మస్క్ "అమెరికా పార్టీ" అనే కొత్త రాజకీయ సంస్థను ప్రకటించారు. ఇది ట్రంప్‌కు ఝలక్ అని చెప్పవచ్చు.

**-వ్యతిరేక స్వీప్: రిపబ్లికన్ పార్టీలో విభేదాల ధ్వని...** మైక్ పెన్స్‌ను ట్రంప్ ఒకానొకప్పుడు తన 'సెకండ్ ఇన్ కమాండ్'గా చూశారు. కానీ 2021 క్యాపిటల్ హిల్ దాడి అనంతరం వారిద్దరి మధ్య దూరం పెరిగింది. ట్రంప్ మాటలు పాటించకుండా రాజ్యాంగ విధుల ప్రకారం పెన్స్ పని చేయడాన్ని ఆయన విశ్వాసఘాతుకంగా అభిప్రాయపడ్డారు. జాన్ బోల్టన్, జిమ్ మ్యాటిస్, జాన్ కెల్లీ, మార్క్ మిల్లే వంటి సీనియర్ భద్రతా వ్యవస్థకు చెందినవారు కూడా ట్రంప్ పరిపాలన విధానాలపై తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు. "ఫాసిస్టు", "అత్యంత ప్రమాదకర వ్యక్తి" వంటి పదాలను వారి నోట వినడం ఆందోళన కలిగించే విషయం.

**మూడో పార్టీ మాయాజాలం.. ట్రంప్ భయం నిజమా?..** ఎలాన్ మస్క్ ఏర్పాటు చేసిన "అమెరికా పార్టీ"పై ట్రంప్ తీవ్రంగా స్పందించడం, మూడో పార్టీ అమెరికాలో స్థిరపడలేదని చెప్పడంలో ఆయన భయం స్పష్టంగా కనిపిస్తోంది. మస్క్ వంటి ప్రతిభావంతుడైన వ్యక్తి, భారీ ఆర్థిక వనరులున్న కార్పొరేట్ నేత ఒకవేళ మూడో పార్టీని నిలదొక్కుకునే స్థితికి తీసుకెళ్తే, అది ట్రంప్ లాంటి శక్తిమంతుడికి కూడా నిద్రలేని రాత్రులను కలిగించే అంశం అవుతుంది.

**– ట్రంప్ భవిష్యత్తు ఎటు?....** ట్రంప్ రాజకీయ మంత్రంగా "లాయల్టీ" అనే పదాన్ని ఎప్పుడూ ప్రాధాన్యంలో ఉంచారు. కానీ, అదే పదం ఇప్పుడు ఆయనకు శాపంగా మారుతోంది. వైఖరి మార్చకుండా అన్ని విషయాల్లో తానే చేసినా సరైందన్న గర్వం చివరకు ఆయన చుట్టూ భయంకరమైన మౌనాన్ని తెచ్చింది. విశ్వసించిన వారు ఒక్కొక్కరుగా వెళ్లిపోతుండగా, కొత్తగా ఆయనవైపు రావాలని ఆశపడే వారెవరూ లేరు. వాస్తవానికి ట్రంప్ ఇప్పుడు రాజనీతి శక్తిగా ఉన్నా, మానవ సంబంధాల పరంగా మాత్రం శూన్యంలోకి అడుగులు వేస్తున్నారని చెప్పొచ్చు. అధికారంలో ఉన్నప్పుడు మిత్రులను ఆదరించని నాయకుడిని, అధికారానికి వచ్చాక మిత్రులే నిలదీస్తున్న దుస్థితి అతడికి ఎదురవుతోంది. మొత్తంగా ట్రంప్ పాలన పునరావృతమవుతోందేమో గానీ, అదే పాత వైఖరులు, అదే పాత పద్ధతులు ఈసారి ఆయన్ను తుడిచిపెట్టే అవకాశాన్ని కల్పించుకూడదని ఆయన తక్షణం తెలుసుకోవాలి. లేకపోతే మిత్రుల నీడలే శత్రు ఆకృతులుగా మారతాయి.

# క్యారక్టర్ యాక్టర్ గుమ్మడి - జూలై 9...గుమ్మడి వెంకటేశ్వరరావు జయంతి



తెలుగు సినిమా ప్రేక్షకులకు సుపరిచితమైన నటుడు గుమ్మడి. ఎన్టీఆర్ ఏఎన్నార్ ఎస్వీ రంగారావు, చిత్తూరు నాగయ్య లాంటి నాటి అగ్ర శ్రేణి నటులతో నటించి ప్రత్యేక గుర్తింపు పొందిన గుమ్మడి వేంకటేశ్వర రావు తెలుగు సినిమా చరిత్రలో ప్రత్యేక పేజీలు కలిగి ఉన్నారు. ప్రత్యేక పంచె కట్టు ఉత్తరీయం, సాంప్రదాయ దుస్తులతో అచ్చ తెలుగు వారిగా చిరస్థాయిగా నిలిచి పోయారు. ప్రశాంత వదనంతో, చెరగని చిరునవ్వుతో, తెలుగు దనానికి నిలువెత్తు చిరునామాగా కనిపించే మహామనిషి, శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు. అయిదు దశాబ్దాల పాటు తెలుగు చలన చిత్ర రంగంలో విభిన్న పాత్రలను పోషించి, తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంచేత 'రఘుపతి వెంకయ్య' అవార్డును స్వీకరించారు. దాదాపుగా 500 లకు పైగా సినిమాలలో నటించారు. తండ్రిగా, అన్నగా, మామగా, జమీందారుగా, పోలీసు అధికారిగా, ప్రతి నాయకునిగా, సాంఘిక పాత్రలు, జానపదాలలో రాజుగా, మంత్రిగా, రాజ గురువుగా విభిన్నపాత్రలు, పౌరాణికాలలో బలరామునిగా కర్ణుడిగా, దుర్యోధనునిగా, నటించి నాటి మేటి నటులు శ్రీ ఎన్. టి. రామారావు, శ్రీ నాగేశ్వరరావు, శ్రీ ఎస్, వి రంగారావు గార్లతో సమ ఉజ్జీగా ఉత్తమమైన నటన ప్రదర్శించి "శభాష్ " అనిపించుకున్న నటుడు శ్రీ గుమ్మడి. తెలుగు సినిమా రంగంలో అతి చిన్న వయసులో అతి పెద్ద పాత్రలు ధరించి అలవోకగా ప్రేక్షకులను మెప్పించిన మహా నటులు గుమ్మడి జులై 9 1927 న గుంటూరు జిల్లా తెనాలికి దగ్గరలోని "రావికంపాడు" గ్రామంలో సాధారణ రైతు కుటుంబంలో తల్లిదండ్రులకు మొదటి సంతానంగా జన్మించారు. ఎనిమిదవ తరగతి చదువుతున్న రోజులలోనే, ఉపాధ్యాయుని ఆదేశంతో పేదరైతు అనే నాటకంలో వయోవృద్ధుడైన రైతు పాత్రను పోషించారు. అదృష్ట దీపుడు (1950) ద్వారా సినీ జీవితం ప్రారంభించారు. దానిలో గుమ్మడిగారి పాత్ర ముక్కామలకు అసిస్టెంట్. రెండవ సినిమా, నవ్వితే నవరత్నాలు. మూడవ సినిమా పేరంటాలు, నాలుగవ సినిమా ప్రతిజ్ఞ. వీటన్నిటిలో చిన్న చిన్న పాత్రలు మాత్రమే లభించాయి. తర్వాత తోడుదొంగలు' (1954 ), 'మహా మంత్రి తిమ్మరుసు' (1962) సినిమాలు గుమ్మడికి నటుడిగా మంచి పేరు తెచ్చిపెట్టాయి. 'తోడుదొంగలు' కు రాష్ట్రపతి బహుమతి రాగా, 'మహామంత్రి తిమ్మరుసు' లో ఆయన నటనకు జాతీయ స్థాయిలో ఉత్తమ సహాయ నటుడిగా బహుమతి వచ్చింది. 'మాయా బజార్' (1957), మాయింటి మహా లక్ష్మి (1959), కులదైవం (1960), కుల గోత్రాలు (1962), జ్యోతి(1977), నెలవంక (1981), మరో మలుపు (1982), ఏకలవ్య (1982), ఈ చరిత్ర ఏ సిరాతో(1982), గాజు బొమ్మలు (1983), పెళ్ళి పుస్తకం (1991) మంచి పేరు తెచ్చాయి. సినీరంగంలో మృదుభాషిగా, సహృదయుడుగా పేరు తెచ్చుకున్న గుమ్మడి పుస్తక ప్రేమికుడు. సమయము దొరికినప్పుడు మంచి పుస్తకాలను చదివే రసజ్ఞుడు. గుమ్మడి అభిరుచిని గమనించి, అయన రస హృదయానికి స్పందించి, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, ప్రఖ్యాత కవి, సి. నారాయణ రెడ్డి ఒక కావ్యమును అంకిత మివ్వడం సామాన్య విషయం కాదు. గుమ్మడి వంటి మహానటుని 50 సంవత్సరాల సుదీర్ఘ నటనా రంగంలో సాధించిన ఘనతకు గుర్తింపుగా, తిమ్మరుసు పాత్రకు పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయం వారు "కళాప్రపూర్ణ బిరుదుతోను, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారు "రఘుపతి వెంకయ్య" అవార్డు తోను సత్కరించారు. ఆయన 3 సార్లు నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ జ్యూరీ మెంబర్ గాను, 2 సార్లు నంది అవార్డ్స్ కమిటి సభ్యులుగాను నియమించ బడటం మరియే నటుడికి దక్కని గౌరవం దక్కించుకున్న వ్యక్తి. ఎందరో నటులను ప్రోత్సహించారు. కొన్ని చిత్రాలలో నటించినా, నిర్మాతల నుండి పారితోషికాలు తీసుకోలేదని చెపుతారు. అజాత శతృవు, స్నేహ పిపాసి, పుస్తక పఠ నాభి లాషి, మానవత్వం పరిమళించే మూర్తి, ప్రతిభ ఎవరిలో ఉన్నా, గుర్తించి ప్రోత్సహించిన మహా నటుడు శ్రీ గుమ్మడి 26 జనవరి 2010 న కన్ను మూశారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# భారతదేశపు రాజసపు చిహ్నం పులి - 1969 జూలై 9....భారత వన్యప్రాణి బోర్డు, పులిని జాతీయ జంతువుగా ప్రకటించిన దినం.

1969 జూలై 9 – భారత దేశ వన్యప్రాణి సంరక్షణ చరిత్రలో మైలురాయిగా నిలిచిన రోజు. ఆ రోజున భారత వన్యప్రాణి బోర్డు పులిని భారత జాతీయ జంతువుగా అధికారికంగా ప్రకటించింది. ఈ నిర్ణయం కేవలం ఒక జీవిని ప్రతినిధిగా ఎంపిక చేయడమే కాదు, భారత దేశం యొక్క సహజ సంపదను, వన్యప్రాణి సంరక్షణ పట్ల దేశం తీసుకున్న దృఢ నిశ్చయాన్ని ప్రతిబింబించే చిహ్నంగా నిలిచింది. ఆ కాలంలో పులుల సంఖ్య దేశ వ్యాప్తంగా వేగంగా తగ్గిపోతుండటంతో వేట, అక్రమ వాణిజ్యం, అటవీ విపత్తులు, నివాస ప్రదేశాల నాశనం వంటి కారణాల వల్ల పులుల ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. 1947 నాటికి దేశంలో సుమారు 40,000 పులులు ఉన్నాయని అంచనా, కానీ 1972 నాటికి ఆ సంఖ్య 1,800కి పడిపోవడం ఆందోళనకరం. ఇలాంటి సంక్షోభంలో ప్రభుత్వం ప్రజల దృష్టిని ఆకర్షించే విధంగా పులికి జాతీయ గుర్తింపు ఇచ్చింది. ఇది ఒక అవగాహనాత్మక చర్యగా, ఒక రక్షణ ప్రమాణంగా మారింది. పులిని జాతీయ జంతువుగా ఎంపిక చేయడానికి గల ముఖ్యమైన కారణాలలో శక్తి, ధైర్యం, రాజసమైన రూపం ప్రధానమైనవి. భారతీయ సంస్కృతిలో పులి అంటే శక్తి, స్వేచ్ఛ, ఉత్సాహానికి చిహ్నం. ఇది దేశపు భౌగోళిక వైవిధ్యాన్ని ప్రతినిధిస్తుందే కాకుండా, దేశంలోని విభిన్న అటవీ ప్రాంతాల్లో – హిమాలయాల నుండి సుందర్బన్ల వరకు – విస్తరించి ఉంటుంది. పులి 'APEX PREDATOR'గా, ఆహార గొలుసులో అగ్రస్థానంలో ఉండి, పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో కీలకంగా పనిచేస్తుంది. పులి భారతీయ సంస్కృతిలో,



పురాణాలలో, మతపరమైన చిత్రీకరణల్లో విశేష స్థానం పొందింది. దుర్గాదేవి వాహనంగా పులి ప్రాచుర్యం పొందినదే కాదు, జానపద కళల్లో, శిల్పాల్లో, కథల్లో ఈ జంతువు కేంద్ర బిందువుగా ఉంటుంది. దీని అందం, శక్తి, విలాసవంతమైన ఆకృతి భారతీయులకు గర్వకారణం. 1969లో తీసుకున్న ఈ నిర్ణయం పులుల సంరక్షణకు ఒక బలమైన ఆరంభంగా నిలిచి, 1973లో "ప్రాజెక్ట్ టైగర్" అనే దేశ వ్యాప్తంగా అమలైన బృహత్తర పథకానికి మార్గం ఏర్పడింది. ఈ ప్రాజెక్ట్ పులుల నివాస ప్రాంతాల పరిరక్షణ, వేట నియంత్రణ, అటవీ అభివృద్ధి వంటి అంశాలలో విశేష పురోగతిని సాధించింది. 2006 నాటికి దేశవ్యాప్తంగా 1,411 పులులు మాత్రమే ఉన్నా, తర్వాతి దశాబ్దంలో అనేక చర్యల ఫలితంగా 2018 నాటికి ఆ సంఖ్య 2,967కి, 2022 నాటికి 3,167కి చేరింది. ఇది ప్రపంచంలో అత్యధిక పులుల సంరక్షణ భారత్‌దే అనే ఘనతకు మార్గం వేసింది. పులిని జాతీయ జంతువుగా ప్రకటించడ మొక గొప్ప మానవ విలువల ప్రతిబింబం. ఒక జంతువును కాపాడటానికి దేశం చేసిన సంకల్పం, సమగ్ర దృష్టిని, శాస్త్రీయ వ్యవస్థను కలిపి పనిచేయడమే దీనికి మూలం. పులిని కాపాడాలంటే ఆ నివాస వ్యవస్థను కాపాడాలి. అది పూర్తిగా ఆరోగ్యంగా ఉండాలంటే అన్ని జీవుల జీవనశైలి సమతుల్యంగా ఉండాలి. ఇది పర్యావరణ పరిరక్షణకు, జీవవైవిధ్య రక్షణకు ప్రాథమిక భోధన. ఈ ప్రకటనతో పాటు పులి భారత దేశ చిహ్నాలలో స్థిరంగా స్థానం సంపాదించింది. ప్రభుత్వ లోగోలు, నాణేలు, తపాలా బిల్లులు, పర్యాటక ప్రచారాలపై పులి ముఖచిత్రం కనిపించటం ప్రారంభమైంది. జాతీయ చిహ్నంగా పులి ప్రాముఖ్యత దేశ ప్రజల్లో గర్వాన్ని పెంచింది. పులి మన సంస్కృతిలో, ప్రకృతిలో, తత్వ శాస్త్రం లోనూ ఒక జీవిలా కాక, జీవితం అనే భావనను ప్రతిబింబించే జంతువుగా మారింది. ఈ చారిత్రాత్మక నిర్ణయం ద్వారా భారత దేశం తన వన్యప్రాణుల పట్ల గౌరవాన్ని, బాధ్యతను ప్రకటించింది. పులి నేడు కేవలం ఒక జంతువు కాదు %–% అది జీవ వైవిధ్యానికి రక్షణ కవచం, భారత దేశానికి శక్తి ప్రతీక, మానవుడు ప్రకృతితో కలిసిన జీవన విధానానికి గుర్తింపు.పులిని కాపాడటం అంటే మన భవిష్యత్తును కాపాడటం. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# వంటలో వింతలు... కళలో కుకీలు! - జూలై 9...జాతీయ చక్కెర కుకీ దినోత్సవం

ప్రతి సంవత్సరం జూలై 9వ తేదీన జరుపుకునే జాతీయ చక్కెర కుకీ దినోత్సవం, రుచి, కళ, అనుబంధం అనే మూడు అంశాల సమ్మేళనంగా నిలుస్తుంది. సాధారణ పదార్థాలతో తయారయ్యే ఈ తీపి తిను బండారంలో ఉన్న అందం, మాధుర్యం, వ్యక్తీకరణ శక్తి ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది మనసులను కదిలిస్తుంది. ఇది భావోద్వేగాలకు ప్రతిరూపం, సంబురానికి ప్రతీక, అనుబంధాలకు మధురమైన సంకేతం. చక్కెర కుకీలకు సంబంధించిన చరిత్ర 18వ శతాబ్దపు అమెరికా లోని పెన్సిల్వేనియా రాష్ట్రంలోని నాజరెత్ పట్టణానికి దారి తీస్తుంది. అక్కడికి జర్మన్ వలస దారులుగా వచ్చిన మొరావియన్లు తమ సాంప్రదాయ బేకింగ్ నైపుణ్యంతో "నాజరెత్ బిస్కెట్" అనే పేరుతో ఈ కుకీలను రూపొందించారు. చక్కెర, మైదా, వెన్న, గుడ్లు, వనిల్లా వంటి సాధారణమైన పదార్థాలతో వీటిని తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంతో, తక్కువ శ్రమతో తయారు చేయడం వీటిని త్వరగా ప్రజాదరణ పొందేలా చేసింది. కాలక్రమేణా, ఈ కుకీలు అమెరికాలోని ప్రతి ఇంట్లో ప్రత్యేకమైన స్థానం సంపాదించాయి. పండుగలు, పుట్టినరోజులు, సెలవులు లాంటి సందర్భాల్లో ఈ తీపి వంటకానికి ఒక స్థిరమైన స్థానం ఏర్పడింది. చక్కెర కుకీల అస్తిత్వంలో ప్రత్యేకత ఒక్క రుచిలో మాత్రమే కాదు. వీటి రూపాల చాతుర్యం, అలంకరణ కళ, అందులోనూ వ్యక్తిగత, ప్రత్యేకతకు దక్కిన స్థానం అపూర్వమైనది. క్రిస్మస్ సమయంలో క్రిస్మస్ ట్రీ ఆకారాలు, వాలెంటైన్స్ డేనాడు హృదయాకారాలు, పిల్లల కోసం జంతువుల ఆకారాలు – ఇలా ప్రతి సందర్భానికి, ప్రతి భావనకు తగ్గ ఆకారాల్లో చక్కెర కుకీలు రూపొందించ వచ్చు. ఐసింగ్, స్ప్రింకిల్స్, ఫాండెంట్ వంటి శృంగార పదార్థాలతో ఈ కుకీలను అద్భుతమైన కళాఖండాలుగా అలంకరించ వచ్చు. వాస్తవానికి ఇవి తినే కంటే ముందుగా చూసి తీయగా నవ్వించే కళాత్మక రూపాలు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ ఇష్టపడే ఈ కుకీలు, వారి సృజనాత్మకతకు పోషణగా నిలుస్తాయి. ఓ చిన్న పిండి ముద్దను కట్టర్‌తో ఆకారంలోకి తేవడమూ, దానిపై రంగుల ఐసింగ్‌ను పట్టించి, స్ప్రింకిల్స్ జల్లెడగా చల్లడమూ, తర్వాత ఆ కుకీని చూసి చిన్నారి ఆనందంగా నవ్వడమూ – ఇవన్నీ కేవలం వంట క్రమంలో జరిగే దృశ్యాలు కావు, అవి కుటుంబ బంధాలను మరింత బలపరచే మధుర క్షణాలు. మన జీవితంలో చిన్న ఆనందాలకూ, సాధారణ విషయాలకూ ఎంత విలువ ఉంటుందో, జాతీయ చక్కెర కుకీ దినోత్సవం దీన్ని గుర్తు చేస్తుంది. ఈ రోజు మనం ఇంట్లోనే కుటుంబ సభ్యులతో కలిసి కుకీలు బేక్ చేయవచ్చు. పిల్లలతో కలిసి అలంకరించ వచ్చు. స్నేహితులతో పంచు కోవచ్చు. అవసరమైతే స్థానిక బేకరీలకు మద్దతుగా నిలబడవచ్చు. సోషల్ మీడియాలో హ్యాష్ ట్యాగ్‌తో కుకీ కళను ప్రపంచానికి తెలియ జేయవచ్చు. ముఖ్యంగా ఈ దినోత్సవం మనం పిల్లల్లో బేకింగ్ నైపుణ్యం పట్ల ఆసక్తిని పెంపొందించడానికి, వారి లోని క్రియాశీలతకు వేదికగా మారుతుంది. చక్కెర




కుకీలు ఒక చిన్న తీపి తిను బండారంగా కనిపించవచ్చు, కానీ ఆ లోపల ఎంతో ప్రేమ, ఆప్యాయత, జ్ఞాపకాలు, అనుబంధాలు నిక్షిప్తమై ఉంటాయి. ఇవి మన చిన్నపాటి ప్రయత్నాలలో ప్రతిఫలించే ఒక అందమైన గుర్తు. మనిషిలోని కలలకు, కళలకు, నైపుణ్యానికి దోహదపడే చిన్న మాధ్యమం. ఈ జూలై 9న మీరు కూడా మీ జీవితాన్ని తీయగా మార్చుకోవాలనుకుంటే – ఒక చక్కెర కుకీ తీసుకోండి. బేక్ చేయండి. అలంకరించండి. పంచుకోండి. నవ్వండి. ఆనందించండి. ఈ రోజును తీయని జ్ఞాపకాల పండుగగా మలచండి.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# గంజాయి మత్తులో యువత భవిష్యత్తు... దేశాన్ని మింగుతున్న మత్తు మానవ విపత్తు



గంజాయి అనే మత్తు పదార్థం ఈ కాలంలో దేశాన్ని మానవీయ విపత్తుగా ముప్పతిప్పలు పెడుతోంది. గ్రామీణం గానీ, పట్టణం గానీ, పాఠశాలలైనా, కళాశాలలైనా, యువతీ యువకులైనా ... తేడా లేకుండా ఈ మత్తు మహమ్మారి వేగంగా విస్తరిస్తోంది. ఇది కేవలం ఒక మానసిక వ్యసనం కాదు. శారీరక ఆరోగ్యాన్ని, కుటుంబ పరిమితిని, సామాజిక సమతుల్యతను, ఆర్థిక స్థిరత్వాన్ని నాశనం చేసే భయంకరమైన వ్యాధిగా రూపుదిద్దుకుంది. గంజాయి అనేది "గంజి మొక్క" నుండి వచ్చే మత్తు పదార్థం. దీనిలో ప్రధానంగా ఉండే క్రియాశీల పదార్థం టెట్రా హైడ్రో. కానబినాల్, ఇది మెదడులోని స్వభావాన్ని ప్రభావితం చేస్తూ తాత్కాలిక ఆనందానుభూతిని కలిగించ గలదు. అయితే దీర్ఘకాల వాడకం వల్ల మానసిక అస్థిరత, భ్రమలు, నిస్పృహ, బహుళ వ్యక్తిత్వ లక్షణాలు, ఆందోళన, విపరీత భావోద్వేగాలు తలెత్తుతాయి. ఆరోగ్యపరంగా ఊపిరితిత్తుల సమస్యలు, గుండె వేగం పెరగడం, జీర్ణక్రియ మందగించడం వంటి శారీరక దుష్ప్రభావాలు కలుగుతాయి. 2021లో ఆఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ రూపొందించిన డ్రగ్ వినియోగంపై జాతీయ సర్వే ప్రకారం దేశంలో సుమారు 3.1 కోట్ల మంది కనీసం ఒక్కసారి గంజాయి వాడినట్లు తేలింది. ఇందులో దాదాపు 70 లక్షల మంది గంజాయికి బానిసలుగా మారిన వారే. పట్టణాల్లో మాత్రమే కాదు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా గంజాయి వినియోగం వేగంగా పెరుగుతోంది. ముఖ్యంగా 15 నుండి 35 ఏళ్ల మధ్య వయస్సు కల యువత దీనికి బలవుతున్నారు. గంజాయి వినియోగానికి ప్రధాన కారణాలలో ఒకటి %–% సులభ లభ్యత. దేశంలోని ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌ల ఏజెన్సీ ప్రాంతాలలో విస్తృతంగా సాగవుతోంది. అక్కడినుండి ఇది దేశ వ్యాప్తంగా అక్రమంగా రవాణా అవుతోంది. ముంబయి, ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో కళాశాలలు, పబ్‌లు, పార్టీలు గంజాయి విక్రయాలకు కేంద్రాలుగా మారిపోయాయి. యువతలో స్నేహితుల ఒత్తిడి, సరదా ప్రయోగం అనే పేరుతో మొదలై, వ్యసనంగా మారుతోంది. నిరుద్యోగం, కుటుంబ కలహాలు, ప్రేమ విఫలాలు వంటి మానసిక ఒత్తిళ్లు కూడా గంజాయి వైపు నెట్టేస్తున్నాయి. అంతేకాదు, "గంజాయి హానికరం కాదు", "ఇది ఆయుర్వేద మందు" అనే తప్పుడు ప్రచారాలు కూడా యువతను ఈ మత్తులోకి తొక్కిస్తున్నారు. ఈ మత్తు పదార్థం ప్రభావం కేవలం వ్యక్తిగత స్థాయిలో కాకుండా కుటుంబానికి, సమాజానికి తీవ్రంగా విస్తరిస్తోంది. గంజాయి వాడకం వల్ల పాఠశాల విద్యార్థులలో చదువుపై ఆసక్తి తగ్గిపోతోంది. తరచుగా గైర్హాజరు అవుతూ చివరికి చదువు మానేస్తున్నారు. జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, ఏకాగ్రత కోల్పోవడం, మానసిక స్థిరత్వం కోల్పోవడం వలన ఉద్యోగ అవకాశాలపై కూడా తీవ్ర ప్రభావం పడుతోంది. నేరాల శాతం పెరుగుతోంది. గంజాయి కొనుగోలుకు డబ్బుల కోసం దొంగతనాలు, దాడులు వంటి నేరాలకు పాల్పడే అవకాశాలు కూడా పెరిగాయి. డ్రగ్ ఆధారిత నేరాల శాతం గత ఐదేళ్లలో 32 శాతం మేర పెరిగిందన్నది ప్రభుత్వ గణాంకాలే చెబుతున్న నిజం. ఇటు తెలంగాణలో 2023లో మాత్రమే గంజాయి అక్రమ రవాణా కేసులు 850కి పైగా నమోదయ్యాయి. హైదరాబాదు, రంగారెడ్డి ప్రాంతాల్లోనే దాదాపు 220 కేసులు చోటుచేసుకున్నాయి. ఆంధ్ర ప్రదేశ్‌లోని విశాఖ, అల్లూరి సీతారామరాజు, పాడేరు, ముంపు ప్రాంతాల్లో గంజాయి సాగు కొనసాగుతూనే ఉంది. ఏజెన్సీ ప్రాంతాల్లో సుమారు 1,500 ఎకరాల గంజాయి సాగు గుర్తించబడి నాశనం చేయబడినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్ని ఎదుర్కొనటానికి కేంద్ర ప్రభుత్వం 1985లో మాదక ద్రవ్యాలు మరియు మానసిక ప్రభావ పదార్థాల చట్టాన్ని తీసుకువచ్చింది. దీని ప్రకారం గంజాయి సాగు, నిల్వ, రవాణా, విక్రయం, వినియోగం నేరంగా పరిగణించ బడుతుంది. కేంద్ర స్థాయిలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, రాష్ట్రాల్లో పోలీసు శాఖలు, ఎక్సైజ్ శాఖలు గంజాయి వ్యాపారాన్ని అరికట్టేందుకు కృషి చేస్తున్నాయి. డ్రోన్‌ల ద్వారా పర్యవేక్షణ, సరిహద్దుల్లో తనిఖీలు, రహస్య సమాచార మాధ్యమాల ద్వారా గంజాయి వాణిజ్యాన్ని గుర్తించి నిర్వీర్యం చేస్తున్నారు. పాఠశాల స్థాయిలో అవగాహన సదస్సులు, కళాశాలల వద్ద డ్రగ్ నిరోధ శిబిరాలు నిర్వహించడం మొదలు పెట్టారు. 2025 నాటికి మత్తు పదార్థాల వినియోగాన్ని 50 శాతం తగ్గించాలన్న లక్ష్యంతో కేంద్రం "దేశీయ మత్తు నియంత్రణ చర్యల కార్యాచరణ పథకం"ను చేపట్టింది. ఇందులో అవగాహన కార్యక్రమాలు, పునరావాస కేంద్రాల ఏర్పాటు, మానసిక చికిత్సలు, కుటుంబాల సహకారం వంటి అంశాలను మేళవించారు. కొన్ని రాష్ట్రాలు పాఠశాలల పాఠ్యాంశాలలో డ్రగ్స్ హానిపై ప్రత్యేక అధ్యాయాలు ప్రవేశ పెట్టాయి. అయితే ఈ చర్యలు సరిపోవు. సమాజం మొత్తం దీన్ని ఒక జాతీయ సంక్షోభంగా గుర్తించాలి. ప్రతీ పాఠశాల, కళాశాల, కుటుంబంలో ఈ విషయంపై చర్చ, చైతన్యం అవసరం. యువత మానసిక ఒత్తిళ్లకు గురికాకుండా ఉండేందుకు వారికి మానసిక ఆరోగ్య మార్గదర్శకత అవసరం. ఉపాధి అవకాశాలు పెంచాలి. సినిమా, టెలివిజన్, సోషల్ మీడియా వంటి వేదికల్లో గంజాయి వాడకాన్ని ప్రోత్సహించే దృశ్యాలను నియంత్రించాలి. నిత్యజీవితంలో ప్రతి ఒక్కరికీ ఈ పోరాటంలో భాగస్వామ్యం ఉండాలి. గంజాయి మహమ్మారి మన దేశ యువతను బలి తీసుకుంటోంది. అది కేవలం ఒక మత్తు పదార్థం కాదు %–% అది ఒక భవిష్యత్ హంతక మార్గం. ఈ మత్తు మాయను అంతమొందించాలి. ప్రభుత్వాలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మానసిక నిపుణులు, సమాజ సేవా సంస్థలు, యువతీ, యువకులు %–% అందరూ చేతులు కలిపి పని చేయాలి. అంతే కాదు, మానవతా దృష్టితో ఈ వ్యసనాన్ని ఔషధ చికిత్స, పునరావాసం, బోధన, శిక్షణ, క్రమశిక్షణ అనే అంశాలుగా అర్థం చేసుకుని ముందుకెళ్లాలి. మన దేశం ఆరోగ్యంగా ఉండాలంటే మన యువత ఆరోగ్యంగా ఉండాలి. యువత చేతులు సృష్టి కర్తలుగా ఎదగాలి. మత్తు పదార్థాలకు బానిసలుగా కాక. యువతను గంజాయి సంకెళ్ల నుండి విముక్తి చేయాలంటే – చైతన్యంతో, శక్తితో, స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ఒక అడుగు ముందుకు వేయాలి. అప్పుడు గంజాయి రహిత భారతం సాధ్యమే. అప్పుడు మన దేశ భవిష్యత్తు వెలుగులవైపు ప్రయాణిస్తుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్టు – 9440595494**

# ప్లాస్టిక్‌పై స్టీల్ పంజా

మంథని : కూరగాయలు, కిరాణం, పాలు, పండ్లు, భోజనాలు, వివాహాలు, ఉత్సవాలు, సభలు జరిగినా ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ విచ్చలవిడి వినియోగంతో మానవాళికి ముప్పు వాటిల్లనుంది. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో అధికారులు చర్యలు చేపడుతున్నారు. గ్రామాల్లో స్టీల్ బ్యాంకులను ఏర్పాటు చేస్తున్నారు. మంథని నియోజకవర్గంలోని 76 గ్రామపంచాయతీలలో స్టీల్ బ్యాంకుల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. కమాన్‌పూర్ మండలంలో 9, మంథని మండలంలో 35 పంచాయతీలకు 34, ముత్తారం మండలంలో 15 గ్రామపంచాయతీలకు 14, రామగిరి మండలంలో 17 పంచాయతీలలో స్టీలు బ్యాంక్‌లను ఏర్పాటు చేశారు. నూతనంగా గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన మంథని మండలంలోని తోటగోపయ్యపల్లి, ముత్తారం మండలంలోని జిల్లెలపల్లిలో స్టీలు బ్యాంక్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రభుత్వ కార్యాలయాల్లో స్టీలు



బ్యాంక్‌లు ఏర్పాటుతో ప్రజల్లో ప్లాస్టిక్ నివారణపై మరింత అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా పాలనాధికారి కోయ శ్రీహర్ష, అదనపు పాలనాధికారి వేణు, డీపీవో వీర బుచ్చయ్య, డీఎల్‌పీవో కొమ్మెర సతీష్ ఆదేశాలతో గ్రామ పంచాయతీ అధికారులు గ్రామాల్లో ప్లాస్టిక్ నిషేధానికి కృషిచేస్తున్నారు. గ్రామ సభలు, పంచాయతీ సమావేశాలలో స్టీలు వస్తువులను వాడుతున్నారు.

**నిరంతర పర్యవేక్షణ**

మంథని నియోజకవర్గ వ్యాప్తంగా 76 గ్రామ పంచాయతీలలో నిరంతరం పర్యవేక్షణ చేస్తూ అధికారులకు సూచనలిస్తున్నాం. ప్లాస్టిక్ రహిత గ్రామ పంచాయతీలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. గ్రామ పంచాయతీ కార్యాలయాల నుంచే స్టీలు బ్యాంక్ కార్యక్రమం ప్రారంభించాం. ప్రజలను ప్లాస్టిక్ భూతంపై చైతన్య పరిచేందుకు గ్రామాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాం.

కొమ్మెర సతీశ్, డీఎల్‌పీవో

# ఆ బడుల్లో అఆఇఈ

భువనగిరి : ఉమ్మడి జిల్లాలో గతేడాది విద్యార్థులు లేరనే కారణంతో 461 పాఠశాలలను మూసివేశారు. ఈ విద్యాసంవత్సరంలో బడిబాట కార్యక్రమం చేపట్టి సర్కారు బడుల్లో సౌకర్యాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. దీంతో నూతన ప్రవేశాలు గణనీయంగా పెరిగాయి. మూతబడిన 24 పాఠశాలలను తెరిపించారు. వాటినీ కాపాడుకోవాల్సిన అవసరముంది.

యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా 735 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా గతేడాది విద్యార్థులు లేక 60 పాఠశాలలు మూతపడ్డాయి. గత విద్యాసంవత్సరం జిల్లా వ్యాప్తంగా పదో తరగతి ఉత్తమ ఫలితాలు, అమ్మ ఆదర్శ కమిటీల పేరిట పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయులకు వృత్త్యంతర శిక్షణతో పాటు ముందస్తుగా బడిబాట కార్యక్రమం చేపట్టడంతో ప్రస్తుత విద్యాసంవత్సరంలో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెరిగింది.

పాఠశాలల పునఃప్రారంభంతో జిల్లా వ్యాప్తంగా మూతపడిన ఏడు పాఠశాలలు తిరిగి ప్రారంభించారు. తదుపరి విద్యార్థులు పాఠశాలల్లో చేరేందుకు విముఖత చూపడంతో నాలుగు బడులను తిరిగి మూసివేయాల్సి వచ్చింది. ప్రస్తుతం బొమ్మలరామారం మండలం యావాపురం, బీబీనగర్ మండలం పెద్ద పలుగుతండా, గుండాల మండలంలోని నూనెగూడెంలలో తిరిగి ప్రారంభించిన పాఠశాలల్లో 27 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండటం గమనార్హం.

**నమ్మకాన్ని పెంపొందిస్తాం**

సత్యనారాయణ, యాదాద్రి జిల్లా విద్యాశాఖాధికారి

ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పెంపొందిస్తాం. విద్యార్థులకు సదుపాయాల కల్పనతోపాటు నాణ్యమైన విద్యను అందిస్తాం. ఖాన్ అకాడమీ ద్వారా ఎనిమిది నుంచి తొమ్మిది తరగతుల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో సైన్స్, గణితం పాఠ్యాంశాలను బోధిస్తాం. అవసరం ఉన్న పాఠశాలల్లో ఉన్నతాధికారుల అనుమతితో ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తాం. జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్‌లను ఏర్పాటు చేసి విద్యను అందిస్తాం.

# రైతుకు కులాసా!

ఖమ్మం : అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో చాలావరకు వానాకాలం పెట్టుబడి సాయం నిధులు జమయ్యాయి. ఎన్ని ఎకరాలు ఉన్నప్పటికీ అందరికీ రైతు భరోసా పథకాన్ని ప్రభుత్వం వర్తింపజేసింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని లబ్ధిదారులకు ఎనిమిది రోజుల వ్యవధిలోనే సాయమందింది. వానాకాలం పంటల సాగు సమయంలో పెట్టుబడి సాయమందటం వల్ల ఆర్థికంగా వెసులుబాటు కలిగిందని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**ఈ కొద్దిమందికీ దక్కాలి సాయం**

డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ఫెయిలైన వారి బ్యాంకు ఖాతాలకు నిధులు జమకాలేదు. కొంతమంది బ్యాంకు ఖాతాలు సరిగ్గా ఉండకపోవటం, మరికొందరి ఖాతాలు మనుగడలో లేకపోవటం, ఇంకొంతమంది స్థానికంగా ఉండకపోవటం, మిగిలిన వారి చిరునామాల్లో తప్పులు దొర్లటం వంటి కారణాల వల్ల పెట్టుబడి సాయం అందలేదు. మొత్తమ్మీద ఖమ్మం జిల్లాలో 15,891 (4.50 శాతం)



మంది, భద్రాద్రి జిల్లాలో 10,302 (5.48 శాతం) మందికి 'రైతు భరోసా' దక్కాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. వీరిలో డీబీటీ ఫెయిలైన రైతులు ఖమ్మం జిల్లాలో 814 (0.23 శాతం) మంది, భద్రాద్రి జిల్లాలో 604 (0.32 శాతం) మంది ఉన్నారని వెల్లడించారు. 'రైతు భరోసా' అందని వారి వివరాలను సరిచేసి పంపించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇదే పనిలో వ్యవసాయశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. 'సాంకేతిక సమస్యలను పరిష్కరించిన తర్వాత అర్హులైన మిగతా రైతుల బ్యాంకు ఖాతాల్లోనూ పెట్టుబడి సాయం నిధులు జమవుతాయి' అని ఖమ్మం డీఏఓ పుల్లయ్యకు తెలిపారు.

# గిరి భూముల్లో జల సవ్వడి!



వికారాబాద్ : గిరిపుత్రులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం ఎన్నో రకాల పథకాలను రూపొందించి అమలు పరుస్తోంది. ఆర్‌వోఎఫ్‌ఆర్ చట్టం కింద పట్టాలుండి పోడు భూముల్లో పంటలు పండిస్తున్న గిరిజన రైతుల అభివృద్ధే లక్ష్యంగా తీసుకొచ్చిన 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకానికి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. వారి భూముల్లో సోలార్ పంపుసెట్ల ఏర్పాటుకు నిర్ణయించింది. దీని ద్వారా ఆదాయం పెంచాలని భావిస్తోంది. ఈ పథకాన్ని గిరిజన సంక్షేమ శాఖ అమలు చేయనుంది.

**విడతల వారీగా..** జల వికాస పథకం అయిదేళ్లపాటు కొనసాగుతుంది. 2024-25లో 50 మంది రైతులకు చెందిన 138 ఎకరాల్లో సాగునీటి సౌకర్యం కల్పించనున్నారు. 2026-27 నుంచి 2029-30 వరకు నాలుగేళ్లపాటు 251 రైతులకు చెందిన 351 ఎకరాల్లో నీటి సదుపాయం కల్పించనున్నారు.

**హెక్టారు భూమికి ఒక యూనిట్..**

ఈ పథకానికి ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలున్న రైతులంతా అర్హులే. ఒక హెక్టారు భూమి ఉన్న రైతులకు ఒక యూనిట్ మంజూరు చేస్తారు. అంతకన్నా తక్కువ భూమి ఉంటే మరికొందరు రైతులతో కలిపి మంజూరు చేస్తారు. అటవీ ప్రాంతాల్లో విద్యుత్తు లైన్లు, అది కష్టమైన ప్రాంతాల్లో సోలార్‌ను ఏర్పాటు చేయనున్నారు.

**బోర్లు, బావుల తవ్వకాలు..**

ఈ పథకం ద్వారా జిల్లాలోని 1,054 గిరిజన కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి. ఇందుకుగాను త్వరలో అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. 200 ఫీట్ల లోతులో బోరుబావులను తీయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ లోతులో అన్ని జిల్లాల్లో నీటి లభ్యత లేదని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించే అవకాశముంది. బోర్లు సాధ్యం కాని ప్రాంతాల్లో బావులు తవ్వాలని నిర్ణయించింది.

**దరఖాస్తుల స్వీకరణ...**- పి.కమలాకర్‌రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి, వికారాబాద్ అర్హులైన గిరిజనుల నుంచి ఈ పథకానికి దరఖాస్తులు త్వరలో స్వీకరి స్తాం. ఈ పథకం అమల్లో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నడుచుకుం టాం. వికారాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాలను కలిపి ఒక యూనిట్‌గా చేశారు.

# యూరియా మరింత కావాలయా!



కరీంనగర్ : జిల్లాలో ప్రస్తుతానికి యూరియా ఇబ్బందులు లేకున్నా.. వరినాట్లు పడ్డాక వినియోగం పెరిగి కొరత ఏర్పడే అవకాశముంది. జిల్లాలో గతేడాది వానాకాలంలో దాని వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యవసాయాధికారులు ఈ వానాకాలానికి 43,254 మెట్రిక్ టన్నులు అవసరమని అంచనా వేసి ప్రతిపాదనలు పంపించారు. అయితే ఇప్పటి వరకు 24,493 మెట్రిక్ టన్నులు మాత్రమే జిల్లాకు వచ్చింది. అధికారుల అంచనా ప్రకారం భవిష్యత్తు అవసరాలకు ఈ మొత్తం ఎంత మాత్రం సరిపోదని భావన వ్యక్తమవుతోంది.

**ప్రత్యేక నిఘా..**జిల్లా వ్యవసాయ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, యూరియా కొనుగోళ్లపై నియంత్రణ పెడుతోంది. వర్షాలు సమృద్ధిగా కురిసి వరి నాట్లు పెద్ద ఎత్తున పడితే మాత్రం ఆగస్టులో యూరియా తిప్పలు తప్పేలా లేవు. గతేడాది కూడా కొన్ని ప్రాంతాల్లో ఈ సమస్య వచ్చింది. ప్రత్యామ్నాయంగా నానో యూరియా వినియోగించుకోవచ్చని వ్యవసా య శాస్త్రవేత్తలు సూచిస్తున్నా.. రైతులు ఆసక్తి చూపడంలేదు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మంత్రి తుమ్మల మరింత యూరియా తెప్పిస్తే ఇలాంటి ఇబ్బంది ఉండదంటున్నారు.

**సరిపోవడం కష్టమే..**

గతేడాది వానాకాలం సాగులో యూరియా వినియోగాన్ని బట్టి వ్యవసాయ శాఖ ఈ సంవత్సరం వానాకాలంలో ఏ నెలలో ఎంత వినియోగంపై అంచనా రూపొందించారు. జూన్-5,190, జులై-12,976, ఆగస్టు-15,139, సెప్టెంబరు-8,651 మెట్రిక్ టన్నులు అవసరమని ప్రణాళికలు తయారు చేశారు.

ప్రస్తుతం 24,493 మె.ట.గాను ఇప్పటి వరకు 5,682 మె.ట విక్రయించారు. ఇంకా 18,128 మె.ట. నిల్వ ఉన్నా.. అందులో ఆరు వేల టన్నులు రాష్ట్ర వ్యవసాయ కమిషన్ ఆదేశాలుంటే తప్పా వినియోగించుకులేని పరిస్థితి. అంటే ఇంకా 12 వేల మె.ట. మాత్రమే జిల్లాకు వినియోగించుకునే అవకాశముంది.

జులైలో ఉన్న నిల్వలు సరిపోయినా.. ఆగస్టులో వినియోగం పెరుగుతుంది. నాట్లు వేశాక రెండు సార్లు ఎదుగుదలకు చల్లుతారు. మొక్కజొన్న, పత్తి పంటలకూ అవసరముంటుంది.

**అవసరం లేని రైతులు నిల్వ చేయొద్దు**

జిల్లా అవసరాలకు మరింత యూరియా రావాల్సిన అవసరముంది. అవసరం లేని రైతులు ఎట్టి పరిస్థితుల్లో నిల్వ చేయొద్దు. ఇతర ఎరువులకు ఎలాంటి ఇబ్బంది లేదు.

భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారిణి

# నేలపై నిద్ర.. అర్ధరాత్రి స్నానాలు



గంగాధర: జమ్మికుంటకు చెందిన ఓ విద్యార్థిని ఇటీవల గంగాధరలోని ఓ గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరింది. కానీ ఇక్కడ నీటి వసతి లేక రాత్రి 3.30 గంటలకు స్నానాలు చేయడం.. మరుగుదొడ్లు, మూత్రశాలలు శుభ్రంగా లేక.. మంచాలు లేక నేలపైనే నిద్రించడం ఇబ్బందిగా ఉందని చెప్పి మూడు రోజులకే వెళ్లిపోయింది. ఈ ఉదంతం ఉమ్మడి జిల్లాలోని గురుకుల పాఠశాలల్లోని సమస్యలను వేలెత్తి చూపుతోంది. ఎక్కువ గురుకులాల్లో సమస్యలే ఉంటున్నాయి.

**అద్దె భవనాలు.. అరకొర వసతులు**

గంగాధర ప్రధాన కూడలిలోని మహాత్మా జ్యోతిబా పులే బీసీ బాలికల గురుకుల పాఠశాల అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. నెలకు రూ.లక్షల్లో అద్దె చెల్లిస్తుండగా కనీస వసతులు లేక విద్యార్థులు తల్లడిల్లుతున్నారు. 5వ తరగతి నుంచి పదో తరగతి వరకు 500 మంది బాలికలు చదువుకుంటున్నారు. ఇది చాలదన్నట్లుగా ఇంటర్‌లో గంగాధరతోపాటు మెట్‌పల్లి జూనియర్ కళాశాలను ఇక్కడే కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం వంద మంది విద్యార్థులు ఉన్నారు. పడక మంచాలు లేక బాలికలు నేలపైనే నిద్రిస్తున్నారు.

మండల కేంద్రంలోని బీసీ బాలుర గురుకులానికి సొంత భవనం లేకపోవడంతో నెలకు రూ.2 లక్షలకు పైగా అద్దె చెల్లిస్తూ ప్రైవేటు భవనంలో పాఠశాల నిర్వహిస్తున్నారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 400 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. మంచాలు వేస్తే ఫ్యాన్లకు తగులుతుందనే కారణంతో రాత్రిపూట వాటిని వేయకపోవడంతో నేలపైనే నిద్రిస్తున్నారు.

ఎల్ఎండీలోని బాలికల గురుకుల పాఠశాలకు మాత్రమే సొంత భవనం ఉండగా మిగతా అన్ని పాఠశాలలు అద్దె భవనాల్లోనే అరకొర వసతుల మధ్య నిర్వహిస్తున్నారు.

**అంతటా అదే పరిస్థితి..**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 13 బీసీ బాలురు, 13 బాలికల గురుకులాలు నిర్వహిస్తున్నారు. రెండేళ్ల కిందట అదనంగా మరో 33 గురుకులాను ఏర్పాటు చేసింది. 5వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఒక తరగతికి 40 మంది విద్యార్థులు ఉండగా రెండు సెక్షన్లు కొనసాగుతున్నాయి. ఇలా ఆరు తరగతులకు 12 గదులు అవసరం. ల్యాబ్‌ల నిర్వహణ, స్టాఫ్ రూం, కార్యాలయ గది, వంటశాల, డైనింగు హాల్ వీటన్నింటికీ 6 గదులు అవసరం. స్నానాల గదులు, మరుగుదొడ్లు, ఇతర వసతుల్లేక విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. 2019లో ఏర్పాటు చేసిన పాఠశాలలకు ఫర్నీచర్ ఇవ్వకపోవడంతో నేల చదువులు, రాత్రి నిద్రకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

# జల కల.. సాకారం దిశగా

ఖమ్మం : మధిర, ఎర్రుపాలెం మండలాల రైతులకు మంచిరోజులు రానున్నాయి. ఎన్నెస్పీ కింద చివరి ఆయకట్టు (మూడో స్టేజీ)లోని ఈ మండలాలకు ఏపీ మీదుగా కాల్వల్లో ప్రవహించే సాగర్ నీరు రావాల్సి ఉంది. జిల్లా నుంచి సాగర్ జలాలు ఏపీలోకి వెళ్లాక.. అక్కడ సకాలంలో గేట్లు ఎత్తకపోవటం, ఆ రాష్ట్ర రైతుల అవసరాలు తీరాక నీటిని విడుదల చేస్తుండటంతో మధిర, ఎర్రుపాలెం మండలాల్లో సుమారు 50వేల ఎకరాల్లో పంటలు సరిగ్గా పండక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారంపై దృష్టిసారించిన తెలంగాణ ప్రభుత్వం జవహర్ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టింది. తద్వారా 33,025 ఎకరాలకు సాగునీరందించనుంది. 'జవహర్ ఎత్తిపోతలకు నిధులు మంజూరయ్యాయి. గుత్తేదారుతో ఒప్పందం కుదుర్చుకున్నాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం' అని జలవనరుల శాఖ ఎస్ఈ వాసంతి తెలిపారు.

**ఎత్తిపోతల ఎక్కడంటే..**

సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏన్కూరు మండలంలోని రాజీవ్ ఫీడర్ కాల్వను వైరా నదితో అధికారులు అనుసంధానిస్తున్నారు. ఇక్కడి నుంచి దిగువకు 33 కిలోమీటర్ల దూరం పారే గోదావరి జలాలు మధిర మండలం వంగవీడులో నిల్వ ఉండటానికి రూ.630.30 కోట్లతో చెక్‌డ్యాం, దీని ఆధారంగా జవహర్ ఎత్తిపోతల పథకం నిర్మించనున్నారు. పంపుహౌజ్‌కు నిరంతర విద్యుత్తు సరఫరా కోసం



రూ.25కోట్లతో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తారు. పంప్‌హౌజ్(ఎత్తిపోతల)లో మూడు మోటార్లు ఉంటాయి. వీటి ద్వారా నిదానపురం, జమలాపురం, మైలవరం మేజర్లకు నీటిని ఎత్తిపోసి వాటి పరిధిలోని ఆయకట్టును సస్యశ్యామలం చేయనున్నారు.

ఎత్తిపోతల పథకం ద్వారా చిన్న, పెద్దచెరువులను నింపుతారు. కట్లేరు ప్రాజెక్టు రెండు కాల్వలకు ఎత్తిపోతల ప్రెషర్ మెయిన్లను అనుసంధానించి ఆయకట్టును స్థిరీకరిస్తారు. తాగునీటి అవసరాలూ తీర్చనున్నారు. ఈ పథకం ద్వారా మధిర, ఎర్రుపాలెం మండలాల రైతులు గోదావరి, కృష్ణాజలాలను వినియోగించుకునే వెసులుబాటు దొరుకుతుంది.

**మేజర్ల పరిస్థితి ఇలా..**

మధిర బ్రాంచి కెనాల్‌పైన గల నిదానపురం మేజర్‌కు 17,309 ఎకరాల ఆయకట్టు ఉంది. 11.125 కి.మీ. దూరం నుంచి నీటిని పైపుల ద్వారా తీసుకొచ్చి నాగలవరపాడు(కెనాల్‌కు 38 కి.మీ.)లో విడిచిపెడతారు. అక్కడి నుంచి మధిర, ఎర్రుపాలెం మండలాల పరిధిలోని పొలాలకు సరఫరా చేస్తారు.

నూజివీడు బ్రాంచికెనాల్‌పై గల ఈ మేజర్‌కు ఎర్రుపాలెం మండలంలో 10,623 ఎకరాల ఆయకట్టు ఉంది. 33.380 కి.మీ. వద్ద గుంటుపల్లి గోపవరంలో నీటిని పంప్ చేస్తారు.

నూజివీడు బ్రాంచ్ కెనాల్‌పై ఈ మేజర్‌కు ఎర్రుపాలెం మండలంలో 5,093 ఎకరాల ఆయకట్టు ఉంది. దీనికి 27.30 కి.మీ. వద్దగల రాజుపాలెం సమీపంలో నీటిని విడుదల చేస్తారు.

# ముంపు ముప్పు తప్పేలా..!

కొత్తగూడెం : గోదావరి వరదలను సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. భారీ వర్షాలకు భద్రాచలం పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఏటా వరద ముంపును ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఈసారి పటిష్ఠ వ్యూహంతో ముందుకు సాగాలని అధికారులు నిర్ణయించారు.

**ముంచేది మురుగే..!**

ఏటా గోదావరికి వరదలు రావటం.. రామాలయ పరిసర ప్రాంతాలు, విస్తా కాంప్లెక్స్, శిల్పానగర్, కొత్తకాలనీ, అయ్యప్పకాలనీ ముంపునకు గురవటం సర్వసాధారణం. వర్షం నీటికి పట్టణం నుంచి వెలువడే వ్యర్థజలాలు తోడవటంతో లోతట్టు ప్రాంతాలు మురుగునీటితో నిండిపోతున్నాయి. గత అనుభవాల దృష్ట్యా నీటిని ఎత్తిపోసేందుకు కరకట్టకు ఉన్న ఏడు స్లూయిస్‌ల వద్ద మోటార్లను బిగిస్తున్నారు. ఎక్కువ నీరు నిలిచే విస్తా క్లాంప్లెక్స్ వద్ద 150 హెచ్‌పీ సామర్థ్యం గల మూడు మోటార్లను సిద్ధం చేస్తున్నారు.


**వీటిపైనా దృష్టి సారించాలి..**

వరద నీరు భద్రాచలం పట్టణంలోని రోడ్లపైకి చేరకుండా స్లూయిస్‌లు, మురుగుకాల్వల్లో చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలి.

ఓపెన్ నాళాల వద్ద హెచ్చరిక బోర్డులు అమర్చాలి.

వరదల వల్ల రాకపోకలు నిలిచిపోయే ప్రాంతాలను గుర్తించి ముందస్తు సౌకర్యాలు కల్పించాలి.

**పునరావాసం కల్పించేందుకు సిద్ధమేనా?**



గోదావరి వరదల తీవ్రత ఎక్కువగా ఉంటే భద్రాచలం, బూర్గంపాడు తదితర లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి. వీటిలో ముందుగానే తాగునీరు, విద్యుత్తు, ఇతర సదుపాయాలు సమకూర్చాలి. బ్లీచింగ్, శానిటైజర్లు సిద్ధంగా ఉంచాలి. మహిళలు, పిల్లల కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. వృద్ధులు, గర్భిణులకు వైద్యసౌకర్యాలను అందుబాటులో ఉంచాలి. బఫర్ స్టాక్‌పై స్పష్టత రావాల్సి ఉంది.

**కరకట్టతోనే కష్టాలకు అడ్డుకట్ట**

గోదావరి వరదలను నియంత్రించేందుకు చేపట్టిన కరకట్ట విస్తరణ పనుల్లో జాప్యం నెలకొంది. వర్షాల కారణంగా పనులు ముందుకు సాగటం లేదు. 70 అడుగుల వరదొచ్చినా.. ప్రజలకు ఇబ్బంది కలగకుండా కట్ట కిందిభాగంలో అధికారులు రాతితో రివిటింగ్ చేయిస్తున్నారు. వరదనీరు పట్టణంలోకి రాకుండా కరకట్టకు స్లూయిస్ బిగించారు. విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారి మధ్యలోంచి కరకట్ట ఏర్పాటు చేయాల్సి రావటంతో రోడ్డు ఎత్తు పెంచేందుకు 1.5కి.మీ పొడవైన కాజ్‌వే నిర్మించాలి. అయినా ఇంకా అడుగులు పడటం లేదు. గోదావరి వరదలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, వర్షాల వల్ల కరకట్ట నిర్మాణానికి అంతరాయం కలిగినా ఎలాంటి ఇబ్బంది లేదని భద్రాచలం జలవనరులశాఖ ఈఈ జానీకు తెలిపారు.

## ల్యాండ్ పూలింగ్ చట్టంలో మార్పులు

హైదరాబాద్: హెచ్ఎండీఏతోపాటు మున్సిపల్ కార్పొరేషన్లలో ల్యాండ్‌పూలింగ్ చట్టం విధి విధానాల్లో మార్పులకు రంగం సిద్ధం అవుతోంది. కన్సల్టెంట్ నియామకానికి హెచ్ఎండీఏ నోటిఫికేషన్ జారీ చేసింది. అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. కొత్త ప్రాంతాలను అభివృద్ధి చేసే క్రమంలో కొత్త పాలసీ ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు. లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్‌ను అమలు చేయబోతోంది. ల్యాండ్ పూలింగ్ చట్టానికి మెరుగులు దిద్ది ఎల్ఏడీపీను అమలు చేయనున్నారు.

**ఏం చేయనున్నారంటే..**

ఎల్ఏడీపీ, ల్యాండ్‌పూలింగ్‌లో భాగంగా రైతుల లేదా అసైనీల, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో పక్కాగా లేఅవుట్లను అభివృద్ధి చేయనున్నారు. 60 శాతం భూమిచ్చిన వారికి పోను మిగతా 40 శాతంలో అన్నిరకాల మౌలిక వసతులు కల్పించారు.

రోడ్ నెట్‌వర్క్, డ్రైనేజీ, తాగునీరు ఇతర సదుపాయాలతోపాటు ప్రతి ప్లాట్‌కి రోడ్లతో అనుసంధానం జరగనుంది. ప్రస్తుత ల్యాండ్ పూలింగ్ యాక్టులో స్కూళ్లు, యూనివర్సిటీలు, ఆసుపత్రులు, విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లకు ప్రత్యేకంగా భూ కేటాయింపులు లేవు. 10 శాతం ప్రజావసరాలకు ఇచ్చిన భూమిలోనే వీటి కోసం వాడుకోవాలి.

అయితే ఆ 10 శాతం భూమిని ప్రజావసరాలకు రాకుండా పైరవీలతో కబ్జా చేస్తున్న ఉదంతాలున్నాయి. ప్రతి లేఅవుట్‌కు మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు.

అంతేకాక ప్రభుత్వానికి దఖలు పడిన 40 శాతం భూమిలో అన్ని అవసరాలకు పోను కొంత భవిష్యత్తు కోసం ప్రభుత్వ ఖాతాకు మళ్లిస్తారు. దీంతో హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ ఇతర మున్సిపాలిటీలు, కార్పొరేషన్లల వద్ద క్రమేపీ భూ బ్యాంకు పెరగనుంది. నగరం విస్తరించే కొద్దీ ఇతర అనేక అవసరాలకు ఈ భూములను కేటాయించేందుకు వీలు ఏర్పడనుంది.

## గంజాయి చిక్కదు.. దందా కనిపించదు

హైదరాబాద్: లాలాగూడ ప్రాంతానికి చెందిన మెకానిక్ తరచూ నాగపూర్ వెళ్తుంటాడు. తిరుగు ప్రయాణంలో 250-300 గంజాయి ప్యాకెట్లు తీసుకొని రైలులో నగరం చేరతాడు. రూ.30వేల ఖర్చుతో రూ.లక్షన్నర సంపాదిస్తున్నాడు. ఇతడి జాబితాలో 27 మంది కొనుగోలుదారులున్నారు. ఇప్పటికే మూడుసార్లు విజయవంతంగా సరకు తెచ్చి అమ్మి సొమ్ము చేసుకున్నాడు. తాజాగా హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్(హెచ్న్యూ) పోలీసులకు పట్టుబడి జైలుకెళ్లాడు. బస్సులు, కార్లలో గంజాయి తెస్తే దొరికిపోతారు. అదే రైలులో అయితే దొరకకుండా తప్పించుకోవచ్చు. గంజాయి దొరికినా.. పోలీసులకు పట్టుబడే పరిస్థితి ఉండదు. ఈ సురక్షిత దందాపై గంజాయి ముఠాలు దృష్టి సారించాయి.



హైదరాబాద్-నాగ్‌పుర్ మధ్య పెద్దఎత్తున గంజాయి దందా సాగుతున్నట్టు పోలీసులు అంచనాకు వచ్చారు. ఇప్పటి వరకూ ఏపీ, కర్ణాటక నుంచే మత్తుపదార్థాలు నగరానికి వస్తున్నట్టు భావించారు. ఇప్పుడు మహారాష్ట్ర నుంచి వివిధ పద్ధతుల్లో ఎక్కువగా వస్తోంది.

**నాగ్‌పుర్ అడ్డా..:** కొందరు యువకులు, రౌడీషీటర్లు, వివిధ వృత్తుల్లో ఉన్నవారు గంజాయి విక్రయం వైపు దృష్టిసారిస్తున్నారని పోలీసుల విచారణలో బయటపడుతోంది. నగరం నుంచి రైళ్లలో నాగ్‌పుర్ చేరుతున్నారు. అక్కడ ఏజెంట్ల సహాయంతో స్మగ్లర్లను కలసి సరకు కొనుగోలు చేస్తున్నారు. రైళ్లలో ఇక్కడకు చేరవేస్తున్నారు. తనిఖీల్లో దొరకకుండా రైల్వేస్టేషన్ల సమీపంలో రైలు వేగం తగ్గగానే దిగిపోతున్నారు. 4 గ్రా. గంజాయి రూ.100లకు కొంటున్నారు. హైదరాబాద్‌లో రూ.600లకు విక్రయిస్తున్నారు.

**యాచకులతో..:** నాగ్‌పుర్‌లో గంజాయి ప్యాకెట్ల సరఫరాకు యాచకులను ఏజెంట్లుగా మార్చుకుంటున్నారు. ప్రార్థనామందిరాల వద్ద బిక్షాటన చేస్తున్నట్టు కూర్చుంటారు. గంజాయి కొనేందుకువచ్చే వారిని గుర్తించి అమ్మకాలు చేస్తున్నారు.

## గ్రేటర్ మార్కెట్లలో సమస్యల దరువు

హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరంలోని మార్కెట్లలో సిబ్బంది కొరతతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. మార్కెట్లలో 187 మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా 54 మందే ఉన్నారు. కేటాయించిన పోస్టుల్లో మూడోవంతు కూడా ఉద్యోగులు లేరంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఫలితంగా మార్కెట్లు, రైతుబజార్లకు పంటలు, కూరగాయలు తీసుకువచ్చే అన్నదాతలకు గిట్టుబాటు ధరలు వచ్చేలా, వినియోగదారులకు సరసమైన ధరలకు నాణ్యమైన ఉత్పత్తులు లభించేలా చర్యలు చేపట్టలేకపోతున్నారు.

**పర్యవేక్షణ ఎలా సాధ్యం?**

గ్రేటర్ పరిధిలో గడ్డిఅన్నారం, హైదరాబాద్(మలక్‌పేట), బోయిన్‌పల్లి, గుడిమల్కాపూర్ ప్రధాన మార్కెట్లు ఉన్నాయి. గడ్డిఅన్నారం మార్కెట్ పరిధిలో కొత్తపేట పండ్ల మార్కెట్, ఎల్‌బీనగర్ మార్కెట్‌తో పాటు మూడు రైతు బజార్లు ఉన్నాయి. బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ పరిధిలో వ్యవసాయ మార్కెట్, బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్, భరత్‌నగర్ మార్కెట్‌తో పాటు ఐదు రైతుబజార్లు ఉన్నాయి. మలక్‌పేట (హైదరాబాద్) మార్కెట్ పరిధిలో మలక్‌పేట మార్కెట్, ఉస్మాన్‌గంజ్, మీరాలంమండీ, మాదన్నపేట మార్కెట్, మూడు రైతుబజార్లు ఉన్నాయి. గుడిమల్కాపూర్ మార్కెట్ పరిధిలో తెలంగాణలోనే అతి పెద్దదైన పూల మార్కెట్, కూరగాయల మార్కెట్ ఉన్నాయి. నిత్యం వేలాది మంది వ్యాపారులు, రైతులు, లక్షల మంది కొనుగోలుదారుల లావాదేవీలు కొనసాగే మార్కెట్లలో పర్యవేక్షణ 54 మందికే పరిమితమైంది.

**అటకెక్కిన తనిఖీలు** మార్కెట్లలో సిబ్బంది కొరతతో రైతులు, వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వానికి ఫీజులు పూర్తిస్థాయిలో వసూలు కావడం లేదు. నోటిఫైడ్ ఏరియాలో లైసెన్స్ లేని వ్యాపారాలను గుర్తించి అడ్డుకట్ట వేయాల్సి ఉన్నా సిబ్బంది లేకపోవడంతో తనిఖీలే చేపట్టడం లేదు.

# చెరువులకు 'మంచి' రోజులు



హైదరాబాద్: హైడ్రా చర్యలతో.. నగరంలోని చెరువులు ప్రాణం పోసుకుంటున్నాయి. ఆక్రమణల తొలగింపుతో.. వాస్తవ విస్తీర్ణం వరకు తటాకాలు విస్తరిస్తున్నాయి. మురుగునీటి చీడ వదులుతోంది. దుర్వాసన తొలగుతోంది. ఈ వర్షాకాలం పూర్తయ్యేలోపు.. ఎంపిక చేసిన ఆరు తటాకాల్లో వర్షపునీటిని నిల్వ చేస్తామని హైడ్రా ధీమా వ్యక్తం చేస్తోంది. అదే నెరవేరితే.. రాజధానిలోని నీటి వనరులకు మంచి రోజులు మొదలైనట్టే. యుద్ధప్రాతిపదికన జరుగుతోన్న సున్నంచెరువు, ఉప్పల్ నల్లచెరువు, కూకట్‌పల్లి నల్లచెరువు, తమ్మిడికుంట, బమ్‌రుఖ్‌నుద్దౌలా చెరువు, బతుకమ్మకుంటల పునరుద్ధరణ పనులు ఎప్పుడెప్పుడు పూర్తవుతాయా అని.. నగరవాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

**తమ్మిడికుంటతో మొదలు..**

ఏడాది క్రితం ఏర్పాటైన హైడ్రా.. మాదాపూర్ తమ్మిడికుంటలోని ఎన్-కన్వెన్షన్, దాని చుట్టుపక్కలున్న పలు నిర్మాణాల కూల్చివేతతో నగరంలో చెరువుల సంరక్షణ చర్యలకు బీజం పడింది. ఇప్పటివరకు సుమారు 30 చెరువుల్లో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. మరిన్ని తటాకాల సంరక్షణ పనులు సర్వే, ఇతరత్రా దశల్లో ఉన్నాయి. అన్యాక్రాంతమైన వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు ప్రభుత్వ వశమయ్యాయి. కూల్చివేతలు చేపట్టడమేగాక.. చెరువులకు పూర్వ వైభవం తీసుకురావాలన్న లక్ష్యంతో హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ పునరుజ్జీవ కార్యక్రమం చేపట్టారు. మొదటి పది చెరువులను ఎంపిక చేయగా.. కోర్టు కేసులతో ఆరు చెరువుల అభివృద్ధిని చేపట్టారు. ఒక్కో చెరువుపై దాదాపు రూ.10కోట్లు వెచ్చించి.. వాటిలో మంచినీటిని నిల్వ చేయాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు.

**బెంగళూరు నమూనాతో అభివృద్ధి..**

-యూనస్, విమోస్ టెక్నాలజీ సంస్థ డైరెక్టర్

కొన్నేళ్లుగా బెంగళూరులో చెరువుల సంరక్షణ పనులు జరుగుతున్నాయి. మేము 130 తటాకాలను పునరుద్ధరించాం. అదే మాదిరి పనులు చేపట్టాలని హైడ్రా కమిషనర్ మాకు ఆరు చెరువులను అప్పగించారు. వాటిలో మంచి నీటిని నిల్వ చేయాలని రంగనాథ్ లక్ష్యం నిర్దేశించారు. ఆయన ఆదేశాల ప్రకారం.. తటాకాల్లో రెండు, మూడు రెట్ల లోతున పూడికను తొలగిస్తున్నాం. అడుగు భాగాన్ని అలుగు వైపునకు ఏటవాలుగా ఉండేట్టు మార్పు చేస్తున్నాం. చుట్టూ రాళ్లతో కట్ట నిర్మించి, కట్టపై కాలిబాట నిర్మాణంతోపాటు పార్కులు, ఇతరత్రా సౌకర్యాలను కల్పిస్తాం. మురుగు చెరువులోకి చేరకుండా నీటి వనరును మూడు కుంటలుగా విభజిస్తాం. వరదతో కలిసి చెరువులోకి చేరే మురుగునీరు ఒకటో కుంటలోకి ప్రవేశిస్తుంది. అందులో నీటిని వడపోసే మొక్కలు, గడ్డి ఉంటుంది. అందులోని నీరు.. కంకర రాళ్లు, ఇసుక మిశ్రమం ద్వారా వడపోతకు గురై.. రెండో కుంటలోకి చేరుతుంది. అక్కడ మరింత వడపోత జరిగి.. మూడో కుంటలోకి మంచినీటిలా ప్రవేశిస్తుంది. ఇలా.. మూడు దశల్లో నీటిని వడపోసేట్టు చెరువుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

# చౌక బేరం.. కాలుష్య భూతం



హైదరాబాద్ : రూ.50 లక్షల వాహనం రూ.15లక్షలకే, రూ.20 లక్షల వాహనం రూ.3 లక్షలకే..ఇవి దిల్లీ నుంచి వాహనాలను అమ్మే వ్యాపారులు చేస్తున్న ప్రచారాం.. పెద్ద కార్లు తక్కువ ధరకు వస్తుండడంతో ఇక్కడివాళ్ల ఎగబడుతున్నారు... ఎందుకంటే దిల్లీ కాలుష్య కారకాలని కేసులు నమోదు చేయడంతో ఏ మాత్రం తేడాది ఉన్నా తక్కువ ధరకు అమ్మేసుకుంటున్నారు. వాటిలో ఎక్కువ రాష్ట్రానికే వస్తున్నాయి.

**కాలపరిమితి ముగిస్తే...:** పాత వాహనాలు కిలోమీటరుకు సగటున 150 నుంచి 350 గ్రా. కార్బన్‌డయాక్సైడ్, 1 నుంచి 10 గ్రా. కార్బన్ మోనాక్సైడ్, 0.5 నుంచి 8 గ్రా. నైట్రస్ ఆక్సైడ్, 00.1 నుంచి 0.5 గ్రా. ధూళి కణాలను విడుదల చేస్తాయి. అందుకే దిల్లీ ప్రభుత్వం వాహన కాలుష్య నియంత్రణపై అనేక విధానాలతో చర్యలు తీసుకుంటోంది. అక్కడ 62లక్షలకు పైగా కాలం చెల్లిన వాహనాలున్నాయి.

**ఇక్కడ 25లక్షలకు పైగా.:** గ్రేటర్‌లో కాలం చెల్లిన వాహనాలపై కఠిన చర్యలు లేకపోవడంతో చాలా రోడ్లపైకి వస్తున్నాయి.

ప్రస్తుతం 80లక్షలకు పైగా వాహనాలు ఉన్నాయి.

వీటిలో కాల పరిమితి దాటిన వాహనాలు సుమారు 25లక్షలు ఇందులోనూ 17 లక్షల ద్విచక్ర వాహనాలు, 3.5 లక్షల కార్లు, లక్ష సరకు రవాణా వాహనాలు, 25 వేలు ఆటోరిక్షాలు, 2500 బస్సులున్నాయి.

మాదాపూర్, హైటెక్‌సిటీ, గచ్చిబౌలి ప్రాంతాల్లో ఉండే ఐటీ ఉద్యోగులు ఈ తరహా వాహనాలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

పాత వాహనాన్ని స్క్రాప్ చేసి కొత్త వాహనాన్ని కొనుగోలు చేసేవాళ్లకు జీవితకాల పన్నులో రవాణాశాఖ కొంత మొత్తాన్ని మినహాయింపునిస్తున్నా ఆశించిన స్పందన లేదు.

తనిఖీలకు స్పందన కరవు: మోటారు వాహన చట్టం ప్రకారం 15 ఏళ్లు దాటిన రవాణా వాహనాలు గ్రీన్ టాక్స్ చెల్లించి మరో 5 ఏళ్ల వరకు రెన్యువల్ చేసుకోవచ్చు. 20 ఏళ్లు దాటిన వ్యక్తిగత వాహనాలకు సైతం రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ సదుపాయం ఉంది. ఈ వెసులుబాటుతో స్వచ్ఛంద స్క్రాపింగ్‌కు ఆశించిన స్పందన రావడం లేదు.పీసీబీ తనిఖీలు విస్మరించడంతో డొక్కు వాహనాలు తిరిగేస్తున్నాయి.

కొత్త వాహనాలు (బీఎస్-6)తో పోల్చితే పాత వాహనాలు 20 నుంచి 50శాతం ఎక్కువ కార్బన్‌డయాక్సైడ్‌ను విడుదల చేస్తాయి.

# గ్రంథాలయాలకు అందని సెస్!



కరీంనగర్ : స్థానిక సంస్థలు ప్రత్యేక రాయితీ కల్పించి ఆస్తి పన్ను వసూలు చేశాయి. కానీ నిర్దేశిత వాటా ప్రకారం గ్రంథాలయాలకు 'సెస్' జమ చేయడం లేదు. గ్రంథాలయాల ఆర్థిక పరిపుష్టికి ఇది చాలా అవసరం. నిధుల లేమితో గ్రంథాలయాల్లో కనీస మౌలిక వసతులు కరవయ్యాయి. నిర్మాణ పనులు, పెయింటింగ్, పునర్నిర్మాణం, పుస్తకాల కొనుగోలు మొదలైనవన్నీ సెస్ నిధులతోనే జరుగుతాయి. ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల్లో పూర్తిస్థాయిలో ఆధునికీకరణతోపాటు డిజిటలైజేషన్ జరగాల్సి ఉంది. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు గ్రంథాలయాలపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఈ క్రమంలో ఎప్పటికప్పుడు కొత్త పుస్తకాలు కొనుగోలు చేసి అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది. ప్రధాన పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి అవసరమయ్యే పుస్తకాల కొరత ఉంది.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం**

మార్చి గడువు ముగిసినా పూర్తి స్థాయిలో సెస్ వసూలు కాలేదు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. పంచాయతీ కార్యదర్శులతోపాటు బల్దియాల కమిషనర్లకు లేఖలు రాస్తున్నాం.

సరిత, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలు

**చారిత్రక బడి.. శిథిలావస్థకు చేరి**

ధర్మపురి పట్టణంలో తొలి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల సమస్యలకు కేంద్రంగా మారింది. గ్రామస్థుల భాగస్వామ్యంతో 1964లో పాఠశాలను ఏర్పాటు చేయగా దివంగత మధ్వాచారి రాధాబాయమ్మ 6.9 ఎకరాల విలువైన స్థలాన్ని దానం చేశారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాంతో కలిసి బాబాఅటామిక్ రీసెర్చ్ కేంద్రంలో పని చేసిన ధర్మపురివాసి ముత్యాల రామనాథం ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు.

వందలాది మందికి విద్యాదానం చేసిన ఈ పాఠశాలలో ప్రస్తుతం గదులు శిథిలావస్థకు చేరాయి. ఇక్కడ 112 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తుండగా గదుల కొరత నెలకొంది.

**ఉత్తర్వులు ఇచ్చినా..**

ఈ పాఠశాల పురాతన గదులను తొలగించాలని ఆర్అండ్‌బీ అధికారులు 2023లో ఉత్తర్వులు జారీ చేసినా కార్యరూపం దాల్చలేదు. నడిచే సమయంలో పాములు కనిపిస్తుండగా విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు.

మూత్రశాలలు శిథిలావస్థకు చేరగా మరిన్నింటిని నిర్మించాల్సిన అవసరం ఉంది.

2023లో మన ఊరు మనబడి కార్యక్రమంలో రూ.32 లక్షల వ్యయంతో డైనింగ్‌హాల్ నిర్మాణ పనులు ప్రారంభించగా నిధులు లేక అర్ధాంతరంగా నిలిచిపోయింది.

పాఠశాల భవనానికి కిటికీలు, తలుపులకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. సైన్సు ల్యాబ్ కోసం అదనంగా గదులు, గ్రంథాలయ భవనం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## సందర్శిద్దాం.. బడులను బతికిద్దాం

వికారాబాద్ : పాఠశాలలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారంటే విద్యార్థుల బాధలు వెంటవెంటనే తొలగిపోతాయి. క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది మరింత చురుగ్గా పనిచేస్తూ సమస్యలను పరిష్కరించగలుగుతారు. విద్యారంగానికి ప్రభుత్వం వివిధ రూపాల్లో పెద్దమొత్తంలో ప్రభుత్వం వెచ్చిస్తోంది. విద్యావ్యవస్థలో ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయడం సహా విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేసే గురుతర బాధ్యత అధికారు లపై ఉంటుంది. ఉన్నతాధికారులు నెలలో 8 పాఠశాలలను సందర్శించాల్సి ఉంటుంది. గురుకులాలు, వసతిగృహాలను ఉమ్మడి జిల్లాలో తరచూ పరిశీలిస్తున్నారు. ప్రభుత్వ బడుల తనిఖీ మాత్రం కేవలం 20 శాతం మాత్రమే ఉంటోంది.

**నిర్వహణా లోపాలు**

క్షేత్రస్థాయిలో కొన్నిచోట్ల భిన్నమైన పరిస్థితి నెలకొంది.

పారిశుద్ధ్య లోపాలు ఉంటున్నాయి.

సకాలంలో ఉపాధ్యాయులు రావడం లేదనే ఆరోపణలున్నాయి.

కొందరు ఉపాధ్యాయులు బడిలో చరవాణి వినియోగిస్తున్నారు.



మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండటం లేదు.

నధికారికంగా వాలంటీర్లను నియమిస్తున్నారు. ఇటీవల పటాన్‌చెరులో ఓ ఉపాధ్యాయిని అధికారులకు పట్టుబడ్డారు.

**ప్రయోజనాలు**

మౌలిక వసతులు మెరుగు

పాఠ్యాంశాలు సకాలంలో పూర్తి

అభ్యసన సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి

సమస్యలపై ప్రభుత్వానికి నివేదన

అన్ని ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం.

విద్యార్థులతో మమేకం కావాలి - గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ (సిద్దిపేట జిల్లా)అధికారుల సందర్శనతో అప్రమత్తత పెరగనుంది. సెలవులు, ఇతర విషయాల్లో ఉపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకుంటారు. ఇప్పటి వరకు పలు పాఠశాలలను సందర్శించా. విద్యార్థులతో మమేకమైనపుడు వారి ఆసక్తులు, అభిప్రాయాలు చెబుతుంటారు. వారి వెన్నుతట్టి ప్రోత్సహించాలి.

## మెనూ చిక్కన.. అమలు పలచన

సూర్యాపేట : సర్కారు బడిలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందిస్తోంది. కానీ మెనూ అంతంత మాత్రంగానే అమలవుతోంది. శుచి, శుభ్రతదీ అదే పరిస్థితి. వంటగదులు, భోజనశాలలు లేక ఆరుబయట వంటలు చేస్తూ నిర్వాహకులు, చెట్లు, మట్టిలో కూర్చుని ఆరగిస్తూ విద్యార్థులు అవస్థలు పడుతున్నారు..జిల్లాలోని పలు పాఠశాలల్లో పరిశీలించింది..

**చెట్ల కిందే ఆరగింపు**

స్థానిక పీఎంశ్రీ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 500 మందికిగాను 400 మంది భోజనం ఆరగించారు. మెనూ ప్రకారం భోజనం అందించారు. విద్యార్థులు ఆరుబయట చెట్ల కింద మట్టిలో కూర్చుని భోజనం చేస్తున్నారు. దీంతో దుమ్ము, ధూళి అన్నంలో పడుతోంది. భోజనశాల నిర్మించినా ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు.

**ఇంటి వద్దే వంట**

బండతండాలో గుడ్డుతో గోరుచిక్కుడుకాయ, టమాట కూర, చారుతో 12మందికి వడ్డించారు. ప్రభుత్వ పాఠశాలలో వంటగదుల్లేక, సరిపోను పిల్లల్లేక నిర్వాహకులు ఇంటివద్ద భోజనం తయారు చేసుకొని



వస్తున్నారు. తిరుమలగిరి మండలం తుమ్మలకుంటతండా, రాజనాయక్‌తండా, జేత్యాతండా, లాక్యాతండా, బోళ్లగడ్డతండా, హేమ్లాతండా, పాఠశాలలో ఈ పరిస్థితి నెలకొంది.

**పురుగుల అన్నం.. సరిపోని సాంబారు**

గరిడేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 157 మంది విద్యార్థులుండగా భోజనానికి 118 మంది హాజరయ్యారు.మెనూను పూర్తిగా అమలు చేయలేదు. అన్నం, సాంబారు, సొరకూర, గుడ్డును వడ్డించారు. బియ్యం బాగా పురుగుబట్టి తుట్టెలు కట్టింది. అన్నంలో తెల్లని పురుగులు ఉండటంతో చాలామంది పారవేశారు. సాంబారు సరిపడా అందలేదు. కూర కారంగా ఉందని ఎక్కువమంది ఇష్టపడలేదు.

స్థానిక ఎన్నెస్పీ క్యాంపు ప్రాథమిక పాఠశాలలో మెనూ ప్రకారం వడ్డించారు. కానీ వంట చేసే ప్రాంతం అపరిశుభ్రంగా ఉంది. వంటగది పూర్తిగా ఇరుకుగా ఉండటంతో పక్కనే వంటలు చేస్తుండడంతో పొగ వస్తోంది.

**వంట పొగతో తంటా**

సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 158 మందికి గాను భోజనానికి 106 మంది హాజరయ్యారు. అన్నం, సాంబారు, దోసకాయ, టమాటా, గుడ్డుతో వడ్డించారు. విద్యార్థులు ఆరుబయట వరండాలో, మైదానంలో ఆరగించారు. తాగునీటిని కళాశాల నుంచి పైపు ద్వారా అందిస్తున్నారు. విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునే సమయంలో మైదానం బురదగా మారుతోంది. కట్టెలపొయ్యితో నిర్వాహకులు ఆరుబయట వంట చేయడంతో పొగతో విద్యార్థులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**చర్యలు తీసుకుంటాం**

అశోక్, డీఈవో, సూర్యాపేట

సర్కారు బడుల్లో మధ్యాహ్నం నాణ్యమైన భోజనం అందేలా ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. గరిడేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పురుగుల అన్నం వడ్డించింది మా దృష్టికి రాలేదు. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. వంట గదులు, భోజనశాలలు లేని చోట్ల నిర్మాణం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

చురకలు



# అక్రమార్కులకు సిరి.. సహజ సంపద ఆవిరి

సిరిసిల్ల: సహజ సంపదకు ఆపద వాటిల్లుతోంది. మొరం.. చెరువు మట్టి దందా పలుకుబడి కలిగిన వారికి కాసులు కురిపిస్తోంది. ప్రభుత్వ ఆదాయానికి మాత్రం గండిపడుతోంది. గనులు, రెవెన్యూ అధికారులు తమకు పట్టనట్టుగా మామూలుగా తీసుకోవడం వల్లే జిల్లా అంతటా దందా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఇదిగో.. అక్రమాల తంతు**

సిరిసిల్ల పట్టణం చిన్నబోనాలలో జంగమయ్యకుంట, తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లిలోని ప్రభుత్వ భూముల నుంచి సెలవు రోజులు, రాత్రి సమయాల్లో మట్టి దందా యథేచ్ఛగా జరుగుతోంది. ఇక్కడి నుంచి సిరిసిల్ల, తంగళ్లపల్లిల్లోని స్థిరాస్తి వెంచర్లకు తరలిస్తున్నారు. వేములవాడ అర్బన్, గ్రామీణ మండలాల్లో ఎర్రమట్టిదందా యథేచ్ఛగా సాగుతోంది. అనుపురం, కొడుముంజ, రుద్రవరం, మధ్యమానేరు నీరులేని ప్రాంతాల నుంచి అనుమతులు లేకుండా తవ్వుతూ పట్టణాలకు తరలిస్తున్నారు. ట్రాక్టర్‌కు రూ.2 వేలు, టిప్పర్లలో అయితే రూ.6 వేలు వసూలు చేస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్టతండా, రాగట్లపల్లి, ముస్తాబాద్ మండలం పొత్గల్ ప్రాంతాల నుంచి మట్టి తవ్వుతూ మండల కేంద్రాలకు తరలిస్తున్నారు. ఇటీవల ఎల్లారెడ్డిపేట రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందగా తనిఖీలకు వెళ్లారు. దేవునిగుట్టతండా నుంచి అనుమతుల్లేకుండా మట్టి తరలిస్తున్న వాహనాలను ఠాణాకు తరలించారు. అధికారులు పక్కకు వెళ్లిన సమయంలో మట్టితో ఉన్న వాహనాలను తీసుకుపోవడం గమనార్హం. వేములవాడ, కోనరావుపేట, సిరిసిల్ల సమీపంలోని ఇటుక బట్టీలకు నాంపల్లిలోని పెద్దచెరువు నుంచి అయిదువేల క్యూబిక్ మీటర్ల మట్టి



తవ్వకానికి నీటి పారుదలశాఖ అనుమతి పొందారు. కొన్ని అభివృద్ధి పనులకు మర్రిపల్లి చెరువులోని మట్టి తవ్వకాలకు అనుమతినిచ్చారు. గోశాలలో కోడెల వసతి కోసం బురదను తొలగించి మట్టితో చదును చేసేందుకు కొడుముంజ నుంచి మట్టిని తరలించారు. ఇవన్నీ తాత్కాలిక అనుమతులు పొందినవి మాత్రమే కానీ.. వీటిని అడ్డం పెట్టుకొని అడ్డగోలు తవ్వకాలు జరిపారు. తంగళ్లపల్లి మండలంలో రైల్వేలైను నిర్మాణ పనులకు లక్ష క్యూబిక్ మీటర్ల మట్టి అవసరముందని రెవెన్యూశాఖకు దరఖాస్తు చేసుకున్నారు. చంద్రవంక ప్రాజెక్టులోని మట్టి ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. ముస్తాబాద్ మండలం పొత్గల్‌లోని ఇటుక బట్టీల నిర్వాహకులు తహసీల్దార్‌కు మట్టి అవసరమై దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు పరిశీలించి అనుమతులు ఇవ్వకుండానే అక్రమంగా మట్టిని తవ్వుతుండటం గమనార్హం. జిల్లాలో మట్టి తవ్వకాలకు ప్రత్యేకంగా పాలసీని తీసుకొస్తేనే అక్రమాలకు అడ్డుకట్టవేసే అవకాశం ఉంటుంది.

**ఫిర్యాదులు వస్తే చర్యలు**

– క్రాంతికుమార్, గనులశాఖ ఏడీ

రెవెన్యూ, నీటిపారుదలశాఖలు అనుమతులు మంజూరు చేస్తున్నాయి. ఎన్ని క్యూబిక్ మీటర్లకు అనుమతులు ఉంటే వాటికి మాత్రమే వేబిల్లులు జారీ చేస్తున్నాం. అక్రమంగా తరలించిన వాటిపై ఫిర్యాదులు వస్తే క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

# ఏళ్లు గడిచినా అద్దె భవనాల్లోనే!

సారంగాపూర్: మండల కేంద్రాలు ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా మౌలిక వసతుల్లేక అరకొర వసతుల మధ్య పరిపాలన కొనసాగించాల్సి వస్తోంది. సరైన వసతులతో అద్దె భవనాలు దొరకపోవడంతో శిథిలావస్థ భవనాల్లోనే కార్యాలయాలు ఏర్పాటు చేశారు. జిల్లాల ఆవిర్భావ సమయంలో జగిత్యాల జిల్లాలో సారంగాపూర్ నుంచి బీర్‌పూర్, ధర్మపురి నుంచి బుగ్గారం, జగిత్యాల నుంచి జగిత్యాల గ్రామీణం, ఇటీవల మేడిపల్లి నుంచి బీమారం, వెల్గటూర్ నుంచి ఎండపల్లి గ్రామాలను మండలాలుగా ఏర్పాటు చేశారు. బీర్‌పూర్‌లో పాత పాఠశాల భవనాల్లో, బుగ్గారం, జగిత్యాలలో పాత ప్రభుత్వ భవనాల్లోనే కార్యాలయాలను కొనసాగిస్తున్నారు.

**పూర్తయిందొక్కటే..!**

బీర్‌పూర్ మండలంలో ప్రభుత్వ కార్యాలయాల భవనాలకు స్థల సేకరణ కొలిక్కి రాకపోవడంతో కేవలం మండల విద్యాధికారి కార్యాలయం భవనం ఒక్కటే పూర్తి చేయగలిగారు. తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి గతంలో ప్రత్యేక నిధులు విడుదల చేసినప్పటికీ ఎస్సారెస్పీ ముంపు గ్రామాల పునరావాస గ్రామాల ప్రజల కోసం పక్కా పాఠశాల భవనం నిర్మించి నిరుపయోగంగా ఉండడంతో మరమ్మతు చేపట్టి అందులోనే కార్యాలయం



కొనసాగిస్తున్నారు. మండల పరిషత్తు కార్యాలయం అద్దె భవనంలో కొనసాగగా గతేడాది పెచ్చులూడడంతో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనంలోకి మార్చారు. కార్యాలయాన్ని మార్చారు కానీ నిధుల విడుదల లేకపోవడంతో కనీస వసతులు లేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. పోలీసు స్టేషన్ ఇప్పటికీ అద్దె భవనంలోనే కొనసాగుతుండగా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు కావడంతో పనులు కొనసాగుతున్నాయి. వ్యవసాయ కార్యాలయాన్ని రైతు వేదికలో కొనసాగిస్తుండగా, మిగతా కార్యాలయాలు ఎక్కడొన్నాయో ప్రజలకు తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇటీవల రెవెన్యూ మంత్రి జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా పక్కా భవనాలకు నిధులు మంజూరు చేస్తానని హామీచ్చారు. నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేస్తేనే అద్దె భవనాల కష్టాలు తీరనున్నాయి.

**నిధులు మంజూరు చేయాలి**

ప్రస్తుతం పాత పాఠశాల భవనంలో మండల పరిషత్ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నాం. మరమ్మతు చేపట్టినప్పటికీ పూర్తి స్థాయిలో వసతులు లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి నూతన కార్యాలయాలు పూర్తి చేస్తేనే ప్రజలకు ఇబ్బంది లేకుండా సేవలు అందనున్నాయి. – లచ్చాలు. ఎంపీడీవో బీర్‌పూర్

# జనావాసాల్లోకి వన్యప్రాణులు



పూడూరు: అడవులను సంరక్షించడం.. పెంచడం, కలప రవాణా అరికట్టడం.. వన్యప్రాణులను కాపాడేందుకు ప్రభుత్వం తగిన నిధులు ఖర్చు చేస్తున్నా అమలు సరిగా లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా అడవి జంతువులు, పక్షులకు సరైన స్థావరాలు లేక జనారణ్యంలోకి పరుగులు పెడుతున్నాయి. పంట పొలాల్లోకి దూరి పొలాలను నాశనం చేస్తున్నాయి. మేకలు, గొర్రెలు, దూడలపై దాడులు చేస్తుండడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇలా వచ్చిన వన్యప్రాణులు శునకాల బారిన పడి మృత్యువాత చెందిన ఘటనలు ఉంటున్నాయి. ఈ ప్రాంతంలోని దామగుండం, తిప్పాపూర్, కండ్లపల్లి, నస్కల్, మహమ్మదాన్‌పల్లి, అనంతగిరితో కలుపుకుని దాదాపు 5,945 ఎకరాల్లో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఇరువైపుల పొలాలు ఉన్నాయి.

**సంరక్షణ లోపాలకు నిదర్శనాలివి...**

కుల్కచర్లలో ఇటీవల ఓ జింక జనారణ్యంలోకి వచ్చి ఓ ఇంటి ముందు ఏర్పాటు చేసిన గేటులో ఇరుక్కుంది. స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారువచ్చి బయటకు తీసి ప్రథమ చికిత్స అనంతరం కార్యాలయానికి తరలించి పర్యవేక్షణలో ఉంచారు. అనంతరం తీవ్ర అనారోగ్యానికి గురై మృత్యువాత పడింది. ః దోమ మండలం కొత్తపల్లికి చెందిన రైతు గుంట మల్లేశం పొలం వద్ద ప్రత్యేకంగా షెడ్డువేసి గొర్రెలు పెంచుతుండగా అడవి జంతువు దాడి చేసి ఒకే రోజు 44 గొర్రెపిల్లలను చంపేసింది. తొలుత ఊర కుక్కలుగా అనుమానించినా.. ఆ తర్వాత అది అడవి జంతువు పనేనని నిర్ధారించారు.

ఏడాదిన్నర కిందట ధారూరు మండలంలోని ఓ గ్రామంలో పాకలోని మేక పిల్లలపై అడవి జంతువులు దాడిచేసి హతమార్చాయి. ః కుల్కచర్ల మండలం తిర్మలాపూర్ సమీపంలో ఏడాది కిందట అటవీ ప్రాంతానికి సమీపంలో ఓ రైతు వేసిన పశువుల పాకలో కట్టి ఉంచిన ఆవు మృత్యువాత పడింది హైనా దాడి చేసినట్లు సంబంధిత అధికారులు గుర్తించారు.

గతంలో పట్టపగలు కండ్లపల్లి అడవి నుంచి ఓ కొండగొర్రె అంగడిచిట్టంపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి వచ్చింది. శునకాలు వెంబడించటంతో ఉపాధ్యాయులు కాపాడి అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. రెండు రోజుల తరువాత మృత్యువాత పడింది.

**ప్రత్యేక దృష్టిసారిస్తున్నాం: అరుణ, ఫారెస్టు అధికారిణి**

తమ పరిధిలోని జంతువుల సంరక్షణపై ప్రత్యేకం శ్రద్ధ వహిస్తున్నాం. దామగుండం, తిప్పాపూర్ తదితర అడవుల్లో చుట్టూ కందకాలు తీయించటంతో అప్పట్లో ఎటూ వెళ్లకుండా కట్టడి చేయగలిగాం. ప్రస్తుతం అడవి చుట్టూ ఉన్న కొన్ని కాలువలు మూసుకు పోవటంతో జంతువులు జనావాసాల్లోకి వస్తున్నాయి. శునకాల బెడద తీవ్రం కావటంతో తప్పించుకునే క్రమంలో అడవులను వదులుతున్నాయి. నివారణ చర్యలు చేపడతాం.

# అంగన్వాడీకి గూడు.. తీరనున్న గోడు



వికారాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల బలోపేతం దిశగా అడుగులు వేస్తోంది. జిల్లాకు 38 కొత్త భవనాలను మంజూరు చేశారు. త్వరలో వీటి నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. గత ఆగస్టులో అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధించే పాఠ్యాంశాలను మార్చారు. దానికనుగుణంగానే బోధిస్తున్నారు. ఆడుతూ.. పాడుతూ చిన్నారులకు బోధించే విధానాన్ని తీసుకొచ్చారు.

**జిల్లాలో 1,129 కేంద్రాలు..** జిల్లాలో గతంలో 1,107 అంగన్‌వాడీ కేంద్రాలుండగా.. కొత్తగా మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలోని పంచాయతీలు వికారాబాద్‌లో విలీనమయ్యాయి. దీంతో ఆయా పంచాయతీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను వికారాబాద్ జిల్లాలో కలిపారు. దీంతో కొత్తగా 22 అంగన్‌వాడీ కేంద్రాలు చేరాయి. ప్రస్తుతం 1,129 ఉన్నాయి. వీటిలో 500 కేంద్రాలకు పక్కా భవనాలున్నాయి. 439 ఉచిత భవనాల్లో కొనసాగుతున్నాయి. 195 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటిలో 38 కేంద్రాలకు కొత్త భవనాలు మంజూరు చేశారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.12 లక్షలు వ్యయం చేయనున్నారు. ఇందులో 8 లక్షలు ఈజీసీ, రూ.2 లక్షలు 15 ఆర్థిక సంఘం, రూ.2 లక్షలు మహిళా, శిశు సంక్షేమ శాఖ ద్వారా సమకూరుస్తారు.

**సదుపాయాల కల్పన..**

పక్కా భవనాలున్న, ప్రభుత్వ పాఠశాలల్లో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించారు. జిల్లాలో పరిగి, కొడంగల్, మర్పల్లి, వికారాబాద్, తాండూరు ప్రాజెక్టులున్నాయి. కేంద్రాల్లో పంకాలు బిగించారు. లేనిచోట్ల శౌచాలయాలు నిర్మించారు. తాగునీటి సౌకర్యం లేని కేంద్రాలను గుర్తించి ఏర్పాటు చేశారు. అధ్వానంగా మారిన 668 కేంద్రాలను గుర్తించి రంగులు వేశారు.

**వేగంగా పూర్తి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం..**

అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. పనులు నామినేషన్‌పై కేటాయిస్తారు. వేగంగా పూర్తి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. భవనాల పూర్తయితే చిన్నారులకు అనుకూలంగా ఉంటుంది. డా.పి.జయసుధ, జిల్లా సంక్షేమాధికారిణి, వికారాబాద్.

7 నెలల నుంచి 3 ఏళ్లలోపు చిన్నారులు: 34,497

3– 6 ఏళ్ల పిల్లలు: 19,693

# అన్నదాతకు గుండె కోత



వికారాబాద్ : నాణ్యతలేమితో నిర్మించిన చెక్‌డ్యాంల కారణంగా భారీ వర్షాలకు కోతకు గురయ్యాయి. మూడేళ్ల క్రితం కాల్వశ్రీరాంపూర్ పరిధిలోని పలు వ్యవసాయ భూములు వరద ధాటికి చెక్‌డ్యాంలు కట్టిన ప్రదేశాల్లో కరకట్టలు కొట్టుకుపోయి దెబ్బతిన్నాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. తమకు కొంతైనా ఆసరా కల్పిస్తే మేలు జరుగుతుందని రైతులు దీనంగా ఎదురుచూస్తున్నా.. భారాస ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుత సర్కారు అయినా తమ భూములను పరిశీలించి నష్ట పరిహారంతో ఆదుకోవాలని కోరుతున్నారు.

**అందని పరిహారం**

కాల్వశ్రీరాంపూర్ పరిధి మీర్జంపేటలోని పోచంపల్లిలో మానేరు నదిపై రూ.11 కోట్లతో 2022లో నిర్మించిన చెక్‌డ్యాం.. వరద ధాటికి ఏడాది గడవకముందే తెగిపోయింది. గుత్తేదారు చెక్‌డ్యాం నాణ్యతగా నిర్మించకపోవడంతోనే సుమారు 50 ఎకరాల్లో ఇసుక మేటలు వేసి, కోతకు గురి కావడంతో సాగుకు పనికిరాకుండా పోయాయి. నేటికి మూడేళు గడిచింది. దెబ్బతిన్న పంటలను అప్పటి అధికారులు పరిశీలించినా.. ఇప్పటికి రైతులకు పరిహారం అందలేదు.

**ఐదు మంజూరు.. రెండు పూర్తి**

హుస్సేన్‌మియా వాగుపై సుమారు రూ.17 కోట్లతో కాల్వశ్రీరాంపూర్‌లో రెండు, మడిపల్లి, పెగడపల్లి, పెద్దరాతుపల్లిలలో ఒక్కోటి చొప్పున మొత్తం ఐదు చెక్‌డ్యాంలు మంజూరయ్యాయి. పెగడపల్లి, కాల్వశ్రీరాంపూర్‌లో 2022లో పూర్తికాగా అధిక వర్షాలకు ఏడాది గడవకముందే కొట్టుకుపోయాయి. పంట భూములు కోతకు గురై, ఇసుక మేటలు వేయడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి.. తెగిపోయిన చెక్‌డ్యాంలు నాణ్యతగా నిర్మించి, తమకు నష్ట పరిహారం అందించాలని కోరుతున్నారు.

**గుత్తేదారులదే బాధ్యత** కాల్వశ్రీరాంపూర్ మండలం పరిధిలోని మానేరు, హుస్సేన్‌మియా వాగుల పరిధిలో తెగిపోయిన చెక్‌డ్యాంలను తిరిగి నిర్మించే బాధ్యత గుత్తేదారులదే. కూలినవాటిలో స్థానంలో కొత్తగా పనులు చేపట్టేలా, నష్టపోయిన రైతుల భూములు చదును చేసేలా గుత్తేదారులకు ఆదేశాలు జారీ చేశాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే పనులు చేపడతాం. – శ్రావణ్, నీటిపారుదల శాఖ ఏఈ

# హామీలతోనే సరి!

జగిత్యాల : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యాంత్రీకరణ రాయితీని పునరుద్ధరిస్తామన్న హామీ 2024–వానాకాలం, 2024–25–యాసంగి సీజన్లలోనూ నెరవేరలేదు. గత యాసంగిలో మహిళా రైతులకు యంత్ర పరికరాలు ఇస్తున్నట్లు పేర్కొన్నా సాధారణ నిధుల్లో ఇవి 5 శాతంకూడా ఉండవు. ప్రస్తుతం 2025–వానాకాలం సీజన్ మొదలైన నేపథ్యంలో యాంత్రీకరణకు నిధులను గతంలో మాదిరిగా పూర్తిస్థాయిలో విడుదల చేస్తేనే దున్నేవారికి దన్నుగా ఉంటుంది. సాగులో కూలీలకొరతతో రైతులు యంత్రాలపైనే పూర్తిగా ఆధారపడుతున్నారు. ఆరేళ్లక్రితం వరకు ప్రభుత్వంద్వారా అనేక రకాలైన యంత్రాలు, పరికరాలు, పనిముట్లను రాయితీపై ఇవ్వగా తదుపరి నిలిపివేతతో రైతులు పూర్తిధరకు యంత్రాలను బయటి మార్కెట్లో కొంటున్నారు. యంత్రాలను కొనలేనివారు హార్వెస్టర్లు, ట్రాక్టర్లు తదితరాల సేవలకు అధికంగా అద్దెలను చెల్లించి ఆర్థికంగా నష్టపోతున్నారు. రాష్ట్రబడ్జెట్లో యంత్రలక్ష్మి పథకానికి 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,500 కోట్లు, 2024–25లో రూ.1,650 కోట్లను, 2025–25లో రూ.1,800 కోట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నా జిల్లాలకు నిధుల విడుదల మాత్రం జరగటంలేదు. ప్రస్తుతం వానాకాలం సాగు మొదలుకాగా నిధులు



విడుదలచేసి ఆర్‌కేవీవై, యంత్రలక్ష్మి, ఉద్యాన మిషన్ తదితర పథకాల ద్వారా ఆగ్రోస్ మధ్యవర్తిత్వంతో ప్రభుత్వం యంత్రాలు, పరికరాలను సరఫరాచేస్తే రైతులకు నాణ్యమైన యంత్రాలు అందుతాయి. ఉమ్మడి జిల్లాలో ఒక సీజన్‌లో 12.43 లక్షల ఎకరాల్లో ఆహార, వాణిజ్య పంటలు, 1.91 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగు చేస్తున్నందున యంత్రాల వినియోగం అవశ్యంగా మారింది. దుక్కులకు, పొలాలను దున్నేందుకు ట్రాక్టర్ల వినియోగం 98 శాతానికి చేరగా వరికోతలకు పూర్తిగా హార్వెస్టర్లను వాడుతున్నారు. మినీట్రాక్టర్లు, పవర్‌టిల్లర్ల వినియోగం కూడా పెరగగా బోదెలు చేయటం, పసుపు ఉడికించి పాలిషింగ్, పత్తిలో దౌరకొట్టడం, మొక్కజొన్నలను ఒలవటం, ఇతరపైర్ల నూర్పిడి, మామిడిలో సస్యరక్షణ మందుల పిచికారీ, నేలలను చదును చేయటం, గడ్డికోత, గట్టుచేయటం తదితరాలన్నీ యంత్రాలు, పరికరాల సాయంతోనే చేపడుతున్నారు. గడ్డి కట్టలుకట్టే బేలార్ కటింగ్ యంత్రాలు, ఫ్లవ్‌లు, కల్టివేటర్లు, రొటోవేటర్లు, టార్పాలిన్‌షీట్లు, పంపుసెట్లు, పిచికారీ యంత్రాలు, సీడ్‌డ్రిల్, నీటిపైపులు, బిందు, తుంపరసేద్య పరికరాలు, సోలార్ ఫెన్సింగ్, డ్రోన్లు, పత్తితీత యంత్రాలు, మామిడి కాయలను తెంపే పరికరాలు, కొడవళ్లు, ఎద్దులతో నడిపే పరికరాల రాయితీని గతంలో మాదిరిగా మంజూరిస్తే రైతులకెంతో సాయంగా ఉంటుంది. యాంత్రీకరణకు నివేదించామని, నిధుల విడుదల, యంత్రాల మంజూరుకు అనుమతిస్తే రైతులనుంచి దరఖాస్తులను తీసుకుంటామని జగిత్యాల డీఏవో వడ్డెపల్లి భాస్కర్ పేర్కొన్నారు.

# దోమలొస్తున్నాయ్.. తెర వేసేయాలి..!

మిర్యాలగూడ : వానాకాలం వీధుల్లో, ఖాళీ స్థలాల్లో ఎక్కడ పడితే అక్కడ నీరు నిలిచి దోమల వ్యాప్తి అధికమవుతుంది. ఈ కారణంగా ప్రజలు అనేక రకాల వ్యాధుల బారిన పడుతుంటారు. విష జ్వరాల బారిన పడి చికిత్స పేరుతో డబ్బులు నష్టపోవడంతో పాటు..పలువురు ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. వానాకాలం ప్రారంభానికి ముందే దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం ద్వారా ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

**ఇవి పాటించండి...**

చర్మానికి దోమలను వికర్షించే క్రీములను రాసుకోవాలి.

ఇంటి కిటికీలకు జాలీలు, తలుపులకు తెరలు కట్టుకోవాలి.


పాత కూలర్లు, టైర్లు, కొబ్బరి చిప్పలు వంటి వాటిని వెంటనే పడేయాలి.

నీటి సంపులు, డ్రమ్ములు, నీటి తొట్లపై మూతలు ఏర్పాటు చేయాలి.

వారానికి ఒక సారి డ్రై డేగా పాటించి..నీరు నిల్వ చేసే అన్నింటిని ఖాళీ చేయాలి.

**స్థానిక సంస్థలు ఇవి చేయాలి...**

దోమల నివారణకు స్థానిక సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. నల్గొండ, మిర్యాలగూడ, దేవరకొండ, నందికొండ, హాలియా, నకిరేకల్, చిట్యాల, చండూరు పురపాలికలతో పాటు 33 మండలాలు, 564 గ్రామ



పంచాయతీలు ఉన్నాయి. సుమారు 17 లక్షల జనాభా ఉంది. ప్రస్తుతం అన్ని స్థానిక సంస్థల్లో ప్రత్యేకాధికారుల పాలన సాగుతుండటంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. ప్రస్తుతం వానాకాలం ప్రారంభమైనందున దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. వారానికి ఓ సారి మురుగు కాల్వలు శుభ్రం చేసి..దోమల నివారణకు ప్రత్యేక చర్యలు.

దోమలు వ్యాప్తి చెందకుండా మందులు పిచికారి, ఫాగింగ్.

రోడ్లు, ఖాళీ స్థలాల్లో నీరు నిలవకుండా చర్యలు.

ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పొడి చల్లించాలి.

పక్క కాల్వలు, నాలాల్లో లార్వా నివారణ చర్యలు.

మురుగు కాల్వల్లో నూనె బంతులు వేయాలి.

**నివారణకు చర్యలు**

దోమల నివారణకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా సాధారణ రోజుల్లో దోమల నియంత్రణకు ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహిస్తూ పలు రకాల కార్యక్రమాలు చేపడుతున్నాం. దోమలు అధికంగా వ్యాప్తి చెందే జూన్, జులై నెలల్లో వారంలో రెండు రోజులు మంగళ, శుక్రవారాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాం. మలేరియా, డెంగీ అధికంగా వచ్చే ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి బాధితులకు చికిత్స, ప్రజలకు అవగాహన కల్పించనున్నాం. డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, జిల్లా మలేరియా అధికారి, నల్గొండ

చురకలు



# నాడి తప్పిన వైద్యం..!

రాజమహేంద్రవరం : కాలానుగుణ వ్యాధులు విజృంభిస్తున్నాయి.. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి విషజ్వరాలతోపాటు దగ్గు, జలుబు, గొంతునొప్పి, డయేరియా లక్షణాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమవ్వాల్సిన అవసరం ఉంది. **ఇదీ పరిస్థితి..**

జిల్లాలో జీజీహెచ్, 31 పీహెచ్‌సీలు, 15 యూపీహెచ్‌సీలు, అయిదు సీహెచ్‌సీలు, ఒక ప్రాంతీయ ఆసుపత్రి ఉన్నాయి. పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో కొందరు వైద్యులు ఒక పూట మాత్రమే సేవలందిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. పీహెచ్‌సీల్లో ఇద్దరేసి వైద్యులుండాల్సి ఉండగా మూడు రోజులు ఒకరు.. మరో మూడు రోజులు ఇంకొకరు అనే రీతిలో విధులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

**సిబ్బంది కొరతతో..**

రాజమహేంద్రవరం నగరంలో 11 యూపీహెచ్‌సీలున్నాయి. కంబాలపేటలో ఫార్మాసిస్టుల కొరత ఉంది. స్టాఫ్ నర్సే రోగులకు మందులిస్తున్నారు. బృహన్నలపేట ఆసుపత్రిలో సాధారణ పరీక్షలు మినహా ఇతర రక్త పరీక్షలు జరగడం లేదు. సిబ్బందే మందులిస్తున్నారు. వీఎల్‌పురంలో డిప్యుటేషన్‌పై వైద్యుడు ఉన్నారు.



రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో శ్వాసకోశ వైద్యనిపుణుడు అందుబాటులో లేరు. రెండు నెలల కిందట వైద్యురాలు, ఇప్పుడు ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ బదిలీపై కాకినాడకు వెళ్లారు. ఫార్మసీ విద్యార్థులే ఓపీ చూస్తున్నారు. కొన్ని యూసీహెచ్‌సీల్లో ఓపీ 50-60 ఉంటున్నా సగం మందికి కూడా నిర్ధారణ పరీక్షలకు వైద్యులు సిఫార్సు చేయలేని పరిస్థితి ఉంది. కొవ్వూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో సివిల్ సర్జన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ లేరు. గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో దంత వైద్యుడు లేరు. ఎక్కువగా రిఫర్ చేయడంపై పలుమార్లు రోగి తరపు బంధువులు వైద్యులతో గొడవ పడిన సందర్భాలు ఉన్నాయి.

# ఆటలకు 'మట్టి'కొట్టారు

నంద్యాల : ఎమ్మిగనూరు బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.3.50 లక్షలు వెచ్చించి క్రీడా మైదానం నిర్మించారు.. గుంతలు తవ్వి కంకర, ఇసుక, 40 ఎంఎం కంకర వేశారు. సరిగా రోలింగ్ చేపట్టలేదు. ఎగుడుదిగుడుగా ఉంది. క్రీడాకారులు ఆడేందుకు సరిగా లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు మడుగులా మారింది.

సర్కారు బడులను బలోపేతం చేయడం.. అక్కడ చదువుతున్న విద్యార్థులను తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో కేంద్రం పీఎంశ్రీ పథకాన్ని తీసుకొచ్చింది. చదువుతోపాటు ఆటలకు ప్రాధాన్యం ఇచ్చేలా నిధులు విడుదల చేసింది. ఎంపిక చేసిన పాఠశాలల్లో మైదానాలు, ప్రయోగశాలలు అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, లాంగ్‌జంప్, కబడ్డీ, షటిల్, ఫుట్‌బాల్, పరుగు వంటి ఆటల కోసం మైదానాలను తీర్చిదిద్దాల్సి ఉంది. పాఠశాల యాజమాన్య కమిటీల ఆధ్వర్యంలో పనులు చేపట్టారు.. చాలా చోట్ల 'స్థానిక' గుత్తేదారులకు అప్పగించారు. 'మట్టి' పనులు కావడంతో మొక్కుబడిగా చేశారు. ప్రస్తుతం వర్షాలకు 'మట్టి'కొట్టుకుపోయి మడుగులా మారాయి.

**54 పాఠశాలలు.. రూ.97 లక్షలు**

ఉమ్మడి జిల్లాలో పీఎంశ్రీ పథకానికి 54 పాఠశాలలను ఎంపిక చేశారు. ఒక్కో పాఠశాలలో రూ.5 లక్షల వరకు పనులు చేపట్టారు.. కర్నూలు జిల్లా వ్యాప్తంగా రూ.60 లక్షలు, నంద్యాలలో రూ.37 లక్షలు వెచ్చించారు. నేమకల్, గుడేకల్లు, పోలకల్, ఎర్రిగేరి, పెద్దపాడు, పెరవలి,. హెచ్‌కైరవాడి, దొర్నిపాడు, ఇల్లూరు, కొత్తపేట, కొణిదెల, కొత్తపల్లి, ఎన్.కొత్తపల్లి, పేరుసోముల గ్రామాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో ప్రయోగశాలలు నిర్మించారు. దైవందిన్నె, నందవరం, పెద్దకడబూరు, తుగ్గలి, వెల్దుర్తి, ఆత్మకూరు, హలహర్వి, కర్నూలు మిలటరీ, హొళగుంద, గూడూరు, హలహర్వి, కల్లూరు, ఆదోని, చిప్పగిరి(ఆదర్శ) పాఠశాలల్లో మైదానాలు నిర్మించారు.

# జల మార్గం సుగమం

కర్నూలు : కృష్ణమ్మ బిరబిరా పరుగులు పెడుతోంది.. శ్రీశైల జలాశయం నిండుకుండలా మారింది.. వరద జలాలు సీమ ప్రాంతానికి విడుదల చేసేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. నీటి విడుదలకు కేంద్ర బిందువైన పోతిరెడ్డిపాడు నియంత్రణ వ్యవస్థ, బనకచర్ల వద్ద గేట్ల మరమ్మతు పనులు వేగంగా చేపడుతున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే వరదనీటిని విడుదల చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కేఆర్ఎంబీ, ప్రభుత్వ అనుమతి తీసుకొని పోతిరెడ్డిపాడు నుంచి జులై 10లోగా నీటి విడుదల చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

శ్రీశైలం వెనకజలాల నుంచి పోతిరెడ్డిపాడు చేరుకుని, అక్కడి నుంచి బనకచర్ల క్రాస్‌రెగ్యులేటర్ మీదుగా వెలుగోడు (తెలుగు గంగ), గోరకల్, అవుకు (ఎస్ఆర్‌బీసీ) జలాశయాలకు కృష్ణాజలాలు చేరుతాయి. వెలుగోడు నుంచి వైఎస్సార్ కడప జిల్లా బ్రహ్మంసాగర్, అవుకు నుంచి గండికోట జలాశయానికి చేరుతాయి.

శ్రీశైలం జలాశయానికి వరదనీటి ప్రవాహం 854 అడుగులు, పోతిరెడ్డిపాడు వద్ద 834 అడుగులకు చేరితే హంద్రీనీవా సుజల స్రవంతి (మల్యాల) నుంచి నీటిని విడుదల చేయడానికి వీలుంది.

బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ (బీసీఆర్) నుంచి తెలుగు గంగ కాల్వకు వరద నీటిని (వెలుగోడు జలాశయానికి) విడుదల చేసేందుకు మూడు గేట్లు ఉన్నాయి. ఒక్కోగేటు నుంచి ఐదువేల చొప్పున 15 వేల క్యూసెక్కుల వరకు ప్రవహిస్తాయి. బీసీఆర్ వద్ద ఎస్ఆర్‌బీసీ కాల్వకు నీటివిడుదల కోసం ఆరు గేట్ల ద్వారా 22,700 క్యూసెక్కులు విడుదలవుతుంది. రూ.12.50 లక్షలతో గేట్ల మరమ్మతులు చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు 10 గేట్ల నిర్వహణ, మరమ్మతులకు ఈ ఏడాది ప్రభుత్వం రూ.15 లక్షల నిధులు విడుదల చేసింది. రబ్బరుసీల్స్ మార్చుతున్నారు.. ఆయిలింగ్ చేస్తున్నారు. ప్రధానంగా లీకేజీలు లేకుండా మరమ్మతులు చేస్తున్నారు. శ్రీశైలం వెనుక జలాలు పోతిరెడ్డిపాడు నుంచి బనకచర్ల క్రాస్‌రెగ్యులేటర్‌కు చేరి, అక్కడి నుంచి తెలుగు గంగ, ఎస్ఆర్‌బీసీ, ఎస్కేప్ ఛానల్ ద్వారా వరద పారుతోంది. పోతిరెడ్డిపాడు వద్ద 10 గేట్ల నుంచి 44 వేల క్యూసెక్కుల నీటిప్రవాహం కొనసాగుతోంది. గతేడాది 210 టీఎంసీల వరద నీటిని పోతిరెడ్డిపాడు ద్వారా విడుదల చేశారు.

# 70 వసంతాల విద్యాధామం



తిరుపతి : శ్రీవారి పాదాల చెంత.. 1954 సెప్టెంబర్ 2వ తేదీన ఏర్పాటైన తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం అంచెలంచెలుగా ఎదిగి 70 వసంతాలు పూర్తి చేసుకుంది. 73 విభాగాలతో దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలతో పోటీపడుతూ అరుదైన విద్యాధామంగా వెలుగొందుతోంది. ఇక్కడ చదివిన ఎందరో విద్యార్థులు దేశవిదేశాల్లో పలు రంగాల్లో ఉన్నతంగా స్థిరపడటంలో ఓ దిక్సూచిగా నిలిచిందనడంలో సందేహం లేదు. వర్సిటీలోని పలు కీలక కోర్సులు నేటికీ యువతను ఆకట్టుకుంటూ వారి ఉపాధికి బాటలు వేస్తున్నాయి.

**త్వరలో పీజీ ప్రవేశాలకు కౌన్సెలింగ్**

ఏపీ పీజీసెట్ 2025 ఫలితాలు ఇటీవల వెలువడగా అర్హత సాధించిన వారికి త్వరలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. డిగ్రీ తర్వాత అధ్యాపక వృత్తి, పరిశోధనా రంగం, వివిధ సంస్థల పరిపాలనా రంగంలోనూ రాణించాలంటే కచ్చితంగా మాస్టర్స్ డిగ్రీ అవసరం. వృత్తివిద్య కోర్సులైన ఎంబీఏ, ఎంసీఏ.. ఇంజినీరింగ్‌లో ఎంటెక్, బీటెక్ తదితర కోర్సుల ప్రవేశానికి రాష్ట్రస్థాయిలో ఆయా సెట్‌లలో అర్హత సాధించిన వారికి ప్రవేశం ఉంటుంది. పీజీలో ముఖ్యమైనవి బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కామర్స్, ఎకనామిక్స్. ఇవి సమాజ అభివృద్ధిలో మూలాలు. వీటినుంచే అనేక కొత్త కోర్సులు ఉద్భవిస్తున్నాయి. అప్లైడ్ కోర్సులైన అనిమల్ బయోటెక్నాలజీ, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, వైరాలజీ, మైక్రోబయాలజీ, ఆక్వాకల్చర్, జియాలజీ తదితర కోర్సులు కీలకం.

**సమాజ అధ్యయనంలో కీలకం**

సైకాలజీ సబ్జెక్టు మానవ ప్రవర్తనను అధ్యయనం చేసేందుకు ఉపయుక్తంగా ఉంటుంది. సమాజంలో మానసిక రుగ్మతలను పారదోలేందుకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, విద్యాసంస్థల్లో వీరికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆయా రంగాల్లో సైకాలజిస్టులను నియమించుకుంటోంది. సోషియాలజీ, సోషల్ వర్క్ పూర్తిచేసిన వారు సమాజ అధ్యయనం, సమాజసేవ, వివిధ సంస్థల నిర్వహణలో కీలకం.

**నిత్యజీవితంతో ముడిపడి..**

కామర్స్, ఎకనామిక్స్, ఎంబీఏ తదితర కోర్సులు మానవుడి నిత్యజీవితంలో ముడిపడి ఉన్నాయి. వీటిలో పీజీ, పీహెచ్‌డీ చేసిన వారికి మంచి ఉపాధి దొరుకుతోంది. వర్తక వాణిజ్య రంగాల్లో యువతకు పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయి. అలాగే విద్యాభివృద్ధి, బోధనలో బీఈడీ తప్పనిసరి. భాషా శాస్త్రాలు అయిన తెలుగు, ఇంగ్లిష్, హిందీలో పీజీ చేసినవారికి బోధనారంగం ఆహ్వానం పలుకుతోంది.

**మెరుగైన ఉపాధి అవకాశాల కల్పనకు కృషి**

వర్సిటీ ప్రగతి, విద్యార్థుల భవిష్యత్తుకు నిరంతరం కృషి చేస్తున్నాం. పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఏపీ పీజీ సెట్‌ను దిగ్విజయంగా నిర్వహించాం. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు, వర్సిటీలోని ఏడు కళాశాలల్లో విద్యా ప్రగతిని సాధించేందుకు ప్రత్యేక అకడమిక్ ప్లానింగ్‌తో ముందుకెళ్తున్నాం. పలు విదేశీ విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుని ఇక్కడి విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. సీహెచ్ అప్పారావు, ఎస్వీయూ ఇన్‌ఛార్జి ఉపకులపతి

# పడకలు పడగొట్టి.. పనులు నిలబెట్టి



కర్నూలు : కర్నూలు సర్వజన ఆసుపత్రి భవన నిర్మాణ పనులు నత్తను తలపిస్తున్నాయి. కర్నూలు వైద్యాలయాన్ని 72 ఏళ్ల కిందట నిర్మించారు. ఏటా ఉమ్మడి కర్నూలు జిల్లాతోపాటు రాయలసీమ, తెలంగాణ ప్రాంతానికి చెందిన సుమారు తొమ్మిది లక్షల మంది రోగులు వస్తుంటారు. మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ఆస్పత్రి ప్రాంగణంలో ఆసుపత్రి భవన (ఐపీడీ బ్లాక్) నిర్మాణానికి పునాది వేశారు. 2023లో రూ.500 కోట్లతో పనులు ప్రారంభించారు. ఈ నెలాఖరుకు పనులు పూర్తి చేయాల్సి ఉంది. బిల్లుల అందకపోవడంతో గుత్తేదారు చేతులెత్తేశారు. వార్డులు తొలగించి పనులు చేపట్టారు. అటు కొత్త భవనాలు అందుబాటులోకి రాక.. వార్డులు లేక రోగులు అల్లాడుతున్నారు.

**బిల్లులు చెల్లించని గత ప్రభుత్వం**

వైకాపా ప్రభుత్వ హయాంలో బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరిగింది. ఫలితంగా ఆ సంస్థ పనులను నత్తనడకన సాగించింది. ఐపీడీ భవనం నిర్మాణానికి సుమారు రూ.72 కోట్ల విలువైన పనులు చేశారు. రూ.62 కోట్ల విలువైన బిల్లులు ప్రభుత్వానికి పంపగా.. రూ.50 కోట్లు చెల్లించారు. ఇంకనూ రూ.22 కోట్ల మేర రావాల్సి ఉండటంతో గతేడాదిగా సదరు సంస్థ పనులను ఆపేసింది. నిర్మాణ సామగ్రిని తరలిస్తోంది.

**ఈ భవనమే కీలకం**

సుమారు రూ.185 కోట్ల వ్యయంతో ఐపీడీ భవన నిర్మాణం చేపట్టారు. సెల్లార్‌తో సహా ఆరు అంతస్తులు, 668 పడకల సామర్థ్యంతో ప్రారంభించారు. జనరల్ సర్జరీ, డీవీఎల్, జనరల్ మెడిసిన్, పోస్ట్ ఆపరేటివ్, పోస్ట్ ఆపరేటివ్ రికవరీ, ఐసీయూ, ఐసీసీయూ, ఎంఐసీయూ, శస్త్రచికిత్సల విభాగాలన్నీ ఇందులో ఉండేలా 4,27,923 చదరపు అడుగుల విస్తీర్ణంతో నమూనా రూపొందించారు. భవనం సెల్లారులో 120 కార్లు, 460 ద్విచక్రవాహనాలు నిలిపేందుకు సౌకర్యంగా ఉండేలా డిజైన్ చేశారు.

కొత్త భవనం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావాలంటే రూ.140 కోట్లు అవసరమవుతుందని అంచనా.

**రోగులకు అవస్థలు**

ఐపీడీ భవన నిర్మాణంలో జాప్యం కారణంగా రెండేళ్లుగా ఆసుపత్రికి వచ్చే రోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

ఆపరేషన్ థియేటర్లు ఒకచోట ఉండగా.. వారిని ఉంచాల్సిన వార్డులు మరోచోట ఉండడంతో శస్త్రచికిత్స అనంతరం వారిని ఇతర భవనాల్లోకి తరలిస్తున్న సమయంలో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ట్రామాకేర్ విభాగానికి సంబంధించి వరండాలోనే వైద్యం అందిస్తున్నారు. కొన్ని విభాగాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పైకప్పు పెచ్చులూడి రోగులపై పడుతున్నాయి.

పాత భవనాల్లో విద్యుత్తు సౌకర్యం సరిగా లేకపోవడం, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తడంతో రోగులతోపాటు సిబ్బంది, వైద్యులు ఇబ్బందులు పడుతున్నారు. **ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లా: టీజీ భరత్, పరిశ్రమలశాఖ మంత్రి** నిత్యం వేలాది మంది రోగులు వచ్చే జీజీహెచ్‌కు గుండెకాయలాంటి ఐపీడీ భవన నిర్మాణం ఆగిపోయిన విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లా. పూర్తిచేసేందుకు తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు. త్వరలోనే ఆ భవనాల పనులు ప్రారంభించేలా చర్యలు చర్యలు తీసుకుంటాం.

# తాగిస్తాం.. తూలిస్తాం

నంద్యాల : నంద్యాల పట్టణంలో మద్యం దుకాణాలు మినీ బార్లను తలపిస్తున్నాయి. నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు నిర్వహిస్తున్నారు. బార్లలాగే ఏర్పాటు చేసి దుకాణంలోనే మద్యం తాగేలా ఏర్పాటు చేశారు. కొందరు బార్ల నిర్వాహకులు ఇష్టానుసారంగా ఉదయం 5నుంచి రాత్రి 12గంటల వరకు విక్రయాలు నిర్వహిస్తుండటం గమనార్హం.

నంద్యాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 24 మద్యం దుకాణాలు, 15 బార్లు ఉన్నాయి. వాటిల్లో కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో, మరికొన్ని పట్టణంలో ఉన్నాయి. మద్యం దుకాణాల నిర్వాహకులు నీళ్లు అమ్ముకోవడానికి ఇతర వ్యక్తులకు నెలకు రూ.లక్షల్లో అద్దెకి ఇచ్చి అక్కడే తినుబండరాలు విక్రయించేలా ఏర్పాటు చేశారు. దీంతో మందుబాబులు అక్కడే మద్యం తాగి తూలుతూ ఇంటికి వెళున్నారు. రాత్రిళ్లు పద్మావతినగర్, టెక్కె, సాయిబాబానగర్, నందమూరినగర్‌కు వెళ్లే దారిలో, శ్రీనివాససెంటర్‌లో మద్యం దుకాణాల దగ్గర దారిలోనే పార్కింగ్ చేస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

**ప్రతినెలా ముడుపులు!**

మద్యం దుకాణాల నుంచి పలువురికి ప్రతినెలా మామూళ్లు అందుతున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో ఆయా దుకాణాల వైపు కనీసం అధికారులు తొంగిచూడటం లేదు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడం లేదు. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు వచ్చిన సమయంలో హడావుడి చేస్తున్నారు. మిగిలిన రోజుల్లో చర్యలు శూన్యమే. ఇకనైనా మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



**సమయపాలన లేని బార్లు**

పట్టణంలోని కొన్ని బార్లలో సమయపాలన లేకుండా మద్యం విక్రయిస్తున్నారు. స్థానిక శ్రీనివాససెంటర్, ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో విచ్చలవిడిగా మద్యం లభ్యమవుతుంది. కొన్ని బార్లలో ఉదయం 5 గంటల నుంచే మద్యం విక్రయాలు చేస్తుండటంతోపాటు అక్కడే తాపిస్తున్నారు.

**గ్రామాల్లో దారుణం**

నంద్యాల పట్టణంలోనే మద్యం దుకాణాలు బార్లను తలపిస్తుంటే ఇక గ్రామాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. మందుబాబులు రాత్రి అయితే పొలాల్లోనే మద్యం తాగేస్తున్నారు. కొన్ని మద్యం దుకాణాల్లో సీసాపై రూ.10 ఎక్కువగా విక్రయిస్తున్నారు. సిసాలు, వాటర్ ప్యాకెట్లతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సంతజూటూరు, బుక్కాపురం, అయ్యలూరు మెట్ల, పాణ్యం మండలాల్లో మద్యం తాగి పొలాల్లో పడేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

# మెరవాలి.. మురవాలి

అమలాపురం : గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. అందులో భాగంగా ఉత్తమ గ్రామ పంచాయతీల ఎంపికకు స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ పేరిట కేంద్ర బృందాలు ప్రత్యేక సర్వే నిర్వహించనున్నాయి. 2014-19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం ప్రతి గ్రామంలో స్వచ్ఛభారత్ మిషన్ అమలు చేసింది. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం పూర్తిగా వదిలేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ ప్రక్రియను తిరిగి పునరుద్ధరించింది. జిల్లాలో 385 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో సుమారు 30 పంచాయతీలను బృందం పరిశీలించనుంది. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించేందుకు కేంద్రం నుంచి అయిదుగురు సభ్యులతో కూడిన బృందం రానుంది.

**11 అంశాల పరిశీలన..**

ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాలకు వెళ్తారు. చెత్తసంపద కేంద్రాల నిర్వహణ ఎలా ఉంది, బహిరంగ మలవిసర్జన, వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, రహదారి వెంబడి చెత్త వేస్తున్నారా, తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరిస్తున్నారా, పంచాయతీ రిక్షాలు, ఫాగింగ్ యంత్రాల నిర్వహణ తదితర 11



అంశాలు పరిశీలిస్తారు.

**ఇదీ ఉపయోగం..**

ఘన వ్యర్థాల నిర్వహణ, బహిరంగ మలవిసర్జన లేని గ్రామాలను గుర్తించడమే స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ ప్రధాన లక్ష్యం. అలాంటి పంచాయతీలకు ర్యాంకులు ప్రకటించి ఉత్తమంగా నిలిచిన వాటికి గాంధీ జయంతి(అక్టోబరు 2) రోజున కేంద్ర, రాష్ట్ర స్థాయిలో పురస్కారాలు అందజేస్తారు. ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు వస్తాయి. ఆ సొమ్ముతో మరిన్ని అభివృద్ధి పనులు చేసేందుకు వీలుంది.

**వచ్చే వారం మొదలు..**

కేంద్రం బృందం జిల్లాలోని పంచాయతీల్లో పర్యటిస్తారు. వారు గుర్తించిన అంశాల ఆధారంగా వివరాలు నమోదు చేసి, ఉన్నతాధికారులకు నివేదిస్తారు. వివిధ స్థాయిలో తనిఖీలు చేసి, పురస్కారాలు ప్రకటిస్తారు. ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభం అవ్వాల్సి ఉండగా సాంకేతిక కారణాలతో ఆలస్యమైంది. వచ్చే వారంలో మొదలయ్యే అవకాశం ఉంది. -శాంత లక్ష్మి, డీపీవో

**జిల్లాలో ఇలా..**

మండలాలు: 22
గ్రామ పంచాయతీలు: 385
చెత్త సంపద కేంద్రాలు: 272
నిర్వహణలో ఉన్నవి: 198
నిర్మించాల్సినవి: 79

# అక్రమాలపై త్రి'నేత్రం'

శ్రీశైలం : శ్రీశైల మహాక్షేత్రంలో రూ.కోట్ల నిధులతో జరిగే అభివృద్ధి పనులు పక్కదారి పట్టకుండా తరచూ విజిలెన్స్ అధికారులు నిఘా పెట్టారు. ముఖ్యంగా దేవస్థానం ఇంజినీరింగ్ విభాగంపై ప్రత్యేక దృష్టి పెట్టి విచారణ చేస్తున్నారు. విచారణ ఏళ్ల తరబడి జరగడం.. ఆ తర్వాత అభియోగాలన్నీ వీగిపోతుండడంతో విజిలెన్స్ అధికారుల పర్యటనలకు ఫలితం లేకుండా పోతోంది. ప్రస్తుతం మరోసారి అధికారులు వివిధ పనులపై దృష్టి పెట్టారు.

**కేసులు నెగ్గేనా?** విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శ్రీశైల మహాక్షేత్రంలో 2014 నుంచి ఇప్పటివరకు పలుమార్లు పర్యటించి తనిఖీలు జరిపారు. శ్రీశైల దేవస్థానం ఇంజినీరింగ్ విభాగం, అన్నదానం స్టోర్, పరిపాలన విభాగంలో తనిఖీలు చేసి నివేదికలు రూపొందించి కొందరు ఈవోలపై అభియోగాలు మోపారు. కర్నూలు నుంచి విచారణ నివేదికలు పంపితే విజిలెన్స్ ప్రధాన కార్యాలయం నుంచి అభియోగాలన్నీ వీగిపోతున్నాయి. జీవోలు సైతం జారీ అవుతున్నాయి. దీంతో విజిలెన్స్ అధికారుల పర్యటనలు బూడిదలో పోసిన పన్నీరుగా మారుతున్నాయి. ప్రస్తుతం గత వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన పనులపై తిరిగి విజిలెన్స్ విచారణలు కొనసాగుతుండడం ఆసక్తికరంగా మారింది.

**ఆర్థిక నష్టంపై ఫిర్యాదులు**

శ్రీశైల మహాక్షేత్రంలో 2021 నుంచి 2024 వరకు జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లలో నిర్లక్ష్యం, అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వచ్చాయి. ఆర్థిక నష్టం జరిగిందని.. విజిలెన్స్ విచారణ అవసరమంటూ ఫిర్యాదులు వెళ్లాయి. కర్నూలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ అధికారి కె.చౌడేశ్వరి విచారణ చేపట్టారు. గణేష్ సదన్, శ్రీశైల క్షేత్ర సరిహద్దులకు బౌండరీ నిర్మాణం, నక్షత్ర



వనంతోపాటు మరోపనిపై విచారణ జరిపారు. విజిలెన్స్ డీఈ ఆధ్వర్యంలో గణేష్ సదన్ వద్ద సీసీ రహదారుల నాణ్యతను పరిశీలించి నమూనాలు తీసుకెళ్లారు. శ్రీశైల క్షేత్రంలో సరిహద్దుల నిర్మాణం కోసం రూ.5 కోట్లతో టెండర్లు పిలిచారు. క్షేత్రం చుట్టూ ఇనుప కంచెతో బౌండరీ ఏర్పాటుచేస్తే పులులు, వన్యప్రాణులకు ముప్పు వాటిల్లే అవకాశముందని అటవీశాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పనులు ఆగిపోయాయి. తర్వాత ఈ టెండరును పక్కన పెట్టి రుద్రాక్ష మఠం వద్దనున్న మహిషాసురమర్దిని ఆలయం పక్కన రిటైనింగ్ వాల్‌తోపాటు రహదారి పనులు చేపట్టారు. విజిలెన్స్ అధికారుల అభ్యంతరంతో ఈ పనులూ నిలిచిపోయాయి. **శ్రీశైల క్షేత్ర సరిహద్దుల పనులు ఆపేసి..** ఆ టెండరుతోనే మహిషాసురమర్దిని ఆలయం వద్ద రిటైనింగ్ గోడ, రహదారి నిర్మించారు. గత ఈవో బి.పెద్దిరాజు తీసుకున్న నిర్ణయంపై విజిలెన్స్ విచారణ చేపట్టారు. గతనెల 29వ తేదీలోపు వివరణ ఇవ్వాలని విజిలెన్స్ ఆర్ఈవో కె.చౌడేశ్వరి ఆయనకు నోటీసు జారీ చేశారు. ఎలాంటి వివరణ ఇస్తారోనన్నది వేచి చూడాల్సి ఉంది.

# ఇంకెప్పుడు?

చెన్నేకొత్తపల్లి : పేదల సొంతింటి కల నెరవేర్చాలన్న లక్ష్యంతో 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం ప్రారంభించింది. ఒక్కో ఇంటికి రూ.1.5 లక్షలు వివిధ దశల్లో మంజూరు చేసేలా ఆదేశాలు జారీ చేసింది. తదనుగుణంగానే కొంతమేర చెల్లింపులు జరిగాయి. ఇలా రెండు, మూడు దఫాలు బిల్లులు పడిన తరవాత తదుపరి బిల్లులు ఆగిపోయాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం మంజూరుపై దృష్టి సారించలేదు. 70, 80 శాతం నిర్మాణాలు పూర్తయినా లబ్ధిదారులు బాడుగ ఇళ్లల్లో ఉండాల్సిన దుస్థితి నెలకొంది. అప్పులు చేసి ఇంటి నిర్మాణం మొదలు పెట్టి బిల్లులు మంజూరు కాక తీవ్ర అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బకాయిలు చెల్లిస్తామని, లబ్ధిదారుల వివరాలు సైతం సేకరించడంతో హర్షించారు. ఏడాది గడచినా బిల్లులు మంజూరు చేయక నైరాశ్యంలో ఉన్నారు.

శ్రీసత్యసాయి జిల్లాలో 2014-19 మధ్య కాలంలో 27,589 పక్కా గృహ నిర్మాణాలు చేపట్టారు. అందులో 10,785 పూర్తి కాగా, పునాది దశలో 3,469, గోడల వరకు పూర్తయినవి 1,642 ఉన్నాయి. మొదలు కానివి 7,559 ఉండగా అందులో 5,628 మంది లబ్ధిదారులను పీఎమ్ఏవై-2కి కన్వర్షన్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అప్పులు



చేసి నిర్మించామని, బిల్లులు త్వరగా మంజూరు చేసి సాంత్వన చేకూర్చాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

**ప్రభుత్వానికి నివేదించాం – వెంకటనారాయణ, జిల్లా గృహనిర్మాణ సంస్థ అధికారి**

వివిధ దశల్లో ఆగిపోయిన నిర్మాణాలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ పథకం ద్వారా ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల వివరాలు సేకరించాలని ఆదేశించింది. వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించాం.

**ఐడీ ఎలా క్లోజ్ అవుతుంది?**

రాజన్న, లబ్ధిదారుడు, చెన్నేకొత్తపల్లి

2018లో ఇళ్లు మంజూరైంది. బిల్లులు ఆలస్యమైనా అప్పు చేసి ఇల్లు నిర్మించాను. ఇప్పటివరకు రూ.1.08 లక్షలు అందింది. అధికారులను సంప్రదిస్తే ఐడీ క్లోజ్ అయిందని చెబుతున్నారు. బిల్లులు బకాయిలు ఉండగా ఎలా క్లోజ్ చేస్తారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలి.

**రూ.80 వేలు మంజూరు కావాలి**

చీమల లక్ష్మీ, లబ్ధిదారురాలు

2018లో ఇల్లు మంజూరవ్వడంతో నిర్మాణం చేపట్టాను. రూఫ్ టాప్ వరకు పూర్తయింది. ఇప్పటివరకు రూ.60 వేల నగదు, 25 బస్తాల సిమెంట్ మాత్రమే ప్రభుత్వం నుంచి అందింది. ఉన్నతాధికారులు చొరవ చూపి బిల్లులు సకాలంలో మంజూరయ్యేలా కృషి చేయాలి.

# పనులన్నీ... 'నిధి'తోనే..!

విశాఖ : మహా విశాఖ నగర పాలక సంస్థ చేపట్టే ప్రతి పని ఇకపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన 'నిధి' పోర్టల్‌లో నమోదు చేయాల్సిందే. టెండర్ నుంచి పని పూర్తయ్యేంత వరకు అన్ని వివరాలు అప్‌లోడ్ చేయడంతో పాటు, బిల్లులు 'నిధి' నుంచే పొందాల్సి ఉంటుంది. అమల్లో జాప్యం..!: కొత్త విధానంతో బిల్లుల చెల్లింపులో పారదర్శకత ఉంటుందని ప్రభుత్వం భావిస్తుంది. అయితే కొన్ని లోటుపాట్లతో ఇబ్బందులు తప్పవని, ఇప్పటికే పూర్తి చేసిన పనుల వివరాల నమోదుకు, బిల్లులు పొందేందుకు అవసరమైన ఏర్పాట్లు లేవని గుత్తేదారులు చెబుతున్నారు. గత నెలలోనే ప్రభుత్వం నిధి పోర్టల్‌కు సంబంధించి విధి విధానాలు రూపొందించి జీవీఎంసీ



అధికారులకు పంపినా... నేటికీ అమల్లోకి తీసుకురాలేదు.

**ఏటా చెల్లింపులు ఇలా..:**

మహా విశాఖ నగర పాలక సంస్థ ఏటా రూ.450 కోట్ల విలువైన సాధారణ, ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తుంటుంది. ఏటా రూ.350 కోట్ల నుంచి రూ.400 కోట్లు వరకు గుత్తేదారులకు బిల్లులు చెల్లిస్తుంటుంది. ఎనిమిదేళ్ల క్రితం వరకు జీవీఎంసీ సొంత నిధులు కమిషనర్ ఖాతాలోకి వస్తే, అక్కడ నుంచి వాటిని వివిధ అవసరాలకు, గుత్తేదారుల బిల్లులు చెల్లింపునకు వినియోగించారు.

ఆ తర్వాత సీఎఫ్ఎంఎస్ (కాంప్రహెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట సిస్టం) అమల్లోకి తీసుకొచ్చారు. అయితే నగర ప్రజలు ఆన్‌లైన్‌లో చెల్లించే వివిధ రకాల పన్నుల సొమ్ము రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్తుంది. జీవీఎంసీ సౌకర్యం, మీ-సేవ, బ్యాంకుల్లో చెల్లించే పన్నుల సొమ్మంతా కమిషనర్ ఖాతాలోకి జమ అవుతాయి. దీంతో సీఎఫ్ఎంఎస్‌తో పాటు, జీవీఎంసీ కమిషనర్ ఖాతా నుంచి బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయి.

**నూతన విధానంలో..:**

నిధి పోర్టల్ వినియోగంలోకి తీసుకొస్తే రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా గుత్తేదారులకు బిల్లులు ఇవ్వాల్సి ఉంటుంది. జీవీఎంసీ కమిషనర్ ఖాతాకు చేరే ఆస్తి పన్ను సొమ్ము మొత్తం రాష్ట్ర ప్రభుత్వానికి జమ చేస్తే... అక్కడ నుంచే ఉద్యోగుల వేతనాలు, గుత్తేదారుల బిల్లుల చెల్లింపు ఉంటుంది. ఒకవేళ ఆయా నిధులను ఇతర పనులకు మళ్లిస్తే నగర అభివృద్ధికి గండి పడినట్టే.రాష్ట్రంలో చిన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఇప్పటికే నిధి పోర్టల్ పరిధిలోకి వెళ్లాయి. మహా విశాఖ నగర పాలక సంస్థకు బలమైన ఆర్థిక వ్యవస్థ ఉండటంతో, జీవీఎంసీని మినహాయిస్తే బాగుంటుందనే వాదన వినిపిస్తుంది.

ప్రస్తుతం అమలవుతున్నట్టు 010 పద్దు ద్వారా ఉద్యోగుల వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసి, అభివృద్ధి పనులకు సంబంధించి జీవీఎంసీ నిధులు వినియోగించుకునేలా వెసులుబాటు కల్పిస్తే బాగుంటుందని అధికారులు చెబుతున్నారు.

# గట్టుకు మట్టి సంచులే దిక్కు



ఉరవకొండ : పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) కుడి కాలువ.. ఉమ్మడి అనంత జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయుక్తమైంది. ప్రస్తుతం ఎక్కడికక్కడ శిథిలమయ్యి.. లీకేజీలతో నీరు వృథా అవుతోంది. ఏళ్లు గడుస్తున్నా ఆధునికీకరణకు నోచుకోక నీటి ప్రవాహం ప్రశ్నార్థకంగా మారుతోంది. కుడి కాలువ 110 కిలోమీటర్ల మేర ఉరవకొండ, శింగనమల, రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాలను కలుపుతూ వెళ్తుంది. అక్విడెక్టులు, అండర్ టన్నెల్స్, వంతెనలు కలిపి 200 వరకు ఉన్నాయి. దీని ద్వారా 42 చెరువులకు నీరందిస్తారు. కాలువ ప్రధాన షట్టర్‌తో పాటు చాలా చోట్ల దెబ్బతినింది. అక్విడెక్టులు, అండర్ టన్నెల్స్‌ది ఇదే పరిస్థితి. గండ్లు పడి నీరంతా నేలపాలవుతోంది. దెబ్బతిన్న కాలువ గట్టుకు మట్టి సంచులను ఏర్పాటు చేసిన దయనీయ స్థితి నెలకొంది. పీఏబీఆర్ ద్వారా కాలువకు 2 టీఎంసీల నీరు విడుదల చేయగా అందులో అర టీఎంసీకిపైగా లీకేజీల రూపంలో వృథా అయిన దాఖలాలు ఉన్నాయి.

**గత సర్కారు గాలికి వదిలేసి..**

కాలువ ఆధునికీకరణతో పాటు దాని పరిధిలో 50 వేల ఎకరాల ఆయకట్టును అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశంతో ఉప కాలువల ఏర్పాటుకు తెదేపా ప్రభుత్వం (2014-19) రూ.191.7 కోట్లతో ప్రతిపాదనలను సిద్ధం చేసింది. తరువాత అధికారం చేపట్టిన వైకాపా సర్కారు ఐదేళ్ల పాలనలో నిర్వహణను గాలికొదిలేసింది. కనీసం మరమ్మతులకు సైతం నిధులు ఇవ్వకపోవడం గమనార్హం. చేసేదేమిలేక ఇంజినీరింగ్ అధికారులే సొంత నిధులతో మరమ్మతు చేయించిన సందర్భాలూ ఉన్నాయి. ఈఏడాది నీటిని విడుదల చేయాల్సి వస్తే మరిన్ని కష్టాలు ఎదుర్కోక తప్పదు.

**కూటమి ప్రభుత్వంపై ఆశలు**

తాజాగా కూటమి ప్రభుత్వం కంపను తొలగించడంతో పాటు ఇతరత్రా నిర్వహణ పనులకు రూ.2 కోట్లు కేటాయించింది.ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. ఇప్పటివరకు చెరువులకు మాత్రమే నీరందేది. ఉప కాలువలు అందుబాటులోకి వస్తే ప్రతిపాదిత 50 వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందని.. ఆ దిశగా సర్కారు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం..**

వెంకటేశ్వర్లు, ఈఈ, ధర్మవరం డివిజన్

కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. ఈ విషయాన్ని జిల్లా ఎస్ఈతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. వారి ఆదేశాలకు అనుగుణంగా ముందుకు సాగుతాం. నిర్వహణ పనులు చేపట్టేలా తగిన చర్యలు తీసుకుంటాం.

# రైళ్లల్లో నేరాలకు కళ్లెం పడేనా?




గుత్తి : గుత్తి రైల్వేపోలీస్ స్టేషన్‌కు పరిధికి తగ్గట్టుగా సిబ్బంది లేరు. ఈకారణంగానే రైళ్లల్లో నేరాల నియంత్రణ లోపిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏప్రిల్ 29న రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ జరిగింది. గత నెలలో తాడిపత్రి మండలంలోని కోమలి రైల్వేస్టేషన్ వద్ద సిగ్నల్ కేబుల్‌ను దుండగులు కత్తిరించి రైలు ఆపి దోపిడీకి పాల్పడ్డారు. రైళ్లల్లో దోపిడీలు, చోరీలు సర్వసాధారణమయ్యాయి. వీటితో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. రాత్రిళ్లు ప్రయాణించాలంటేనే భయపడుతున్నారు. దోపిడీలు, చోరీలపై కొందరు పోయిన సొమ్ము ఎలాగూ రాదని పోలీసులకు ఫిర్యాదులు ఇవ్వడంలేదు. కొందరు ఫిర్యాదులు ఇస్తున్నా పోలీసులు కేసులు నమోదు చేసుకుంటున్నారే తప్ప రికవరీపై పెద్దగా పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

**స్టేషన్ పరిధి ఇలా...**

గుంతకల్లు మండలంలోని నక్కనదొడ్డి రైల్వేస్టేషన్ గుత్తికి 25 కిలోమీటర్లు దూరంలో ఉంది. పామిడి 20 కిలోమీటర్ల దూరం. కర్నూలు జిల్లా పగిడిరాయి స్టేషన్ 25 కి.మీ. ఉంది. తాడిపత్రి మండలంలోని చల్లవారిపల్లి 60 కిలోమీటర్లు దూరంలో ఉంది. వారానికో మృతదేహం చొప్పున ట్రాక్‌లపై పడుతున్నాయి. వాటిని గుత్తి, తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి పోస్టుమార్టం చేయించాల్సి ఉంది. ఒక్కో శవం తరలింపు, ఖననానికి పోలీసులకు రూ.6 వేల వరకు ఖర్చు వస్తోంది. గుత్తి మీదుగా రోజూ 25 వరకు ప్యాసింజర్ రైళ్లు నడుస్తున్నాయి. వీటితో పాటు గూడ్సులు తిరుగుతుంటాయి. పరిధి దూరంగా ఉండటంతో పోలీసులు ఇబ్బందులు పడుతున్నారు.

**ఇరవైకి పది మందే..**

గుత్తి రైల్వేపోలీస్ స్టేషన్‌లో 20 మంది కానిస్టేబుళ్లకు గాను కేవలం పది మంది మాత్రమే ఉన్నారు. గుత్తి మీదుగా రైళ్లు ఎక్కువగా తిరుగుతుంటాయి. వాటి ఎస్కార్ట్‌కు సిబ్బంది లేరు. రాత్రి వేళల్లో రైళ్లకు జీఆర్పీ, ఆర్పీఎఫ్‌లు ఎస్కార్ట్‌గా వెళ్లాల్సి ఉంది. జీఆర్పీ పోలీసులు తక్కువగా ఉన్నాయి. పరిధి 60 కిలోమీటర్లు వరకు ఉండటంతో అవస్థలు తప్పడం లేదు. రైళ్లకు ఎస్కార్ట్ నామమాత్రంగా ఉంటోంది. దీంతో దుండగులు సునాయాసనంగా దోపిడీలు, చోరీలకు పాల్పడుతున్నారు. ఐదేళ్లు పూర్తి చేసుకుంటున్న కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు మాతృశాఖకు పంపుతున్నారు. కొత్తగా నియామకాలు చేయడం లేదు. ఈకారణంగానే సిబ్బంది కొరత ఉత్పన్నమవుతోంది.

**కొత్త నియామకాలు లేవు**

జీఆర్పీ పోలీసు స్టేషన్లలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఈకారణంగానే నేరాల నియంత్రణకు ఇబ్బందులు వస్తున్నాయి. 5ఏళ్లు పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లను మాతృశాఖ(సివిల్)కు పంపుతున్నారు. కొత్తగా నియామకాలు లేవు. ఉన్నవారితోనే నేరాలు నియంత్రిస్తున్నాం. రికవరీలపై కూడా శ్రద్ధపెడతాం. అజయ్‌కుమార్, జీఆర్పీ, సీఐ, గుంతకల్లు

# కొత్త కార్డులు వచ్చేస్తున్నాయ్..!



చిత్తూరు : కొత్త బియ్యం కార్డు పొందాలనుకుని ఎంతో కాలంగా నిరీక్షిస్తున్న వారికి కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించింది. రెండు మూడ్రోజుల్లో కొత్త బియ్యం కార్డుల జారీ మొదలుకానుంది. ఈ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం కసరత్తు వేగవంతం చేసింది.. ఎన్నడూలేని విధంగా కొత్త బియ్యం కార్డుల్లో క్యూఆర్ కోడ్ విధానం అమలు చేయనున్నారు. ఈ క్రమంలో బియ్యం కార్డుల్లో పలు రకాల సవరణలకు ఇప్పటి వరకు 60,583 దరఖాస్తులు అందాయి. వాటిని రెవెన్యూ అధికారులు పరిశీలించి వెంటనే ఆమోదిస్తున్నారు.

జిల్లాలో కొత్త బియ్యం కార్డులకు 5,938, కార్డు విభజనకు 5,194 దరఖాస్తులందాయి. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి 3,347 కొత్త కార్డుల జారీకి ఆమోదముద్ర వేశారు. కార్డుల విభజనకు సంబంధించి 3,689 దరఖాస్తులకు ఆమోదముద్ర వేశారు. ఇప్పటి వరకు అందిన దరఖాస్తుల్లో అర్హత కలిగిన కొత్త కార్డుల వివరాలను జిల్లా పౌరసరఫరాల శాఖ ప్రభుత్వానికి నివేదించింది.

**నిరంతర ప్రక్రియ..**

కొత్త బియ్యం కార్డు పొందాలన్నా కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయాలన్నా.. తొలగించాలన్నా.. ఇతరత్రా విభాగాలకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కూటమి ప్రభుత్వం కల్పించింది. మొత్తం ఏడు రకాల విభాగాలకు ప్రజలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. తుది గడువు విధించక పోవడంతో దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి.

**వీలైనంత త్వరగా జారీ..**

అర్హులందరికీ వీలైనంత త్వరగా కొత్త కార్డులు జారీ చేయనున్నాం. దీని వివరాలను ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం. ఈ నెల 5 లేదా 6 నుంచి కొత్త కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభం కానుంది.

శంకరన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

**ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు**

చిరునామా మార్పు: 1,474
ఆధార్ సవరణ: 908
సభ్యుల చేరిక: 45,890
సభ్యుని తొలగింపు: 1,117
కొత్త కార్డులకు: 5,938
కార్డు విభజనకు : 5,194
బియ్యం కార్డు సరెండర్: 41
చౌక దుకాణం నవీకరణ: 21

# జ్వరపీడితులతో ఆసుపత్రులు కిటకిట

నక్కపల్లి : మారిన వాతావరణంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఈ ఏడాది వేసవిలోనే పలుమార్లు వరుస తుపాన్లతో చల్లగా గడిచిపోయింది. తొలకరి మొదలుకాగానే వర్షాలు తక్కువగానే పడినా ఎండలు గట్టిగా కాయడంతో ఇబ్బందులు మొదలయ్యాయి. తాజాగా అల్పపీడన ప్రభావంతో వరుస నాలుగు రోజుల పాటు కురిసిన వర్షాలు ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపాయి. దీంతో జలుబు, జ్వరం, తలనొప్పితో పల్లెల్లో జనం ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల పారిశుధ్య లోపం, తాగునీరు క్లోరినేషన్ చేయకపోవడం తదితర కారణాలతో అనారోగ్యం బారినపడ్డారు. దీంతో అతిసారం కేసులు పెరుగుతున్నాయి. ఫలితంగా ఆసుపత్రుల్లో రద్దీ పెరిగింది. ముఖ్యంగా నక్కపల్లి ప్రభుత్వాసుపత్రి రోగులతో కిటకిటలాడుతోంది. నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాలనుంచి పలువురు జ్వరపీడితులు, డయేరియా బాధితులు ఇక్కడ చికిత్స పొందుతున్నారు. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగింది. రెండు వారాల వ్యవధిలో జ్వరానికి



సంబంధించి 200, డయేరియాకు సంబంధించి 50 కేసుల వరకు నమోదయ్యాయి.

**బయటి ఆహారానికి దూరంగా ఉండాలి..** వర్షాలు పడుతుండటంతో జ్వరాలు వస్తున్నాయి. ఆసుపత్రిలో రోగుల సంఖ పెరుగుతోంది. అవసరానికి తగినట్లు వైద్యం చేస్తున్నాం. ప్రజలు అప్రమత్తంగా ఉంటే ఇలాంటి వాటి నుంచి బయటపడొచ్చు. ప్రధానంగా కాచి చల్లార్చిన నీటినే తాగుతుండాలి. మాస్కులు ధరించడం ద్వారా అంటువ్యాధులు రాకుండా ఉంటాయి. ముఖ్యంగా బయట విక్రయించే ఆహార పదార్థాలు తినొద్దు. దీని ద్వారా అతిసారం ప్రబలుతోంది. ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

శిరీష, నక్కపల్లి ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి

# కన్నీళ్లు తుడవాలి.. నీళ్లతో తడపాలి

తిరుపతి: తమ కన్నీళ్లు తుడవాలి.. వైకాపా పాలనలో నిర్లక్ష్యానికి గురైన సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో కదలిక తెచ్చి సాగు భూములను తడపాలని కర్షకులు కోరుకుంటున్నారు. ఇందుకోసం కూటమి ప్రభుత్వం యత్నిస్తోంది. హంద్రీ- నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్)లో భాగమైన పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కాలువల విస్తరణ, లైనింగ్‌ను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. ఇదే తరహాలో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో దశాబ్దాలుగా ప్రతిపాదనల్లో ఉన్న ప్రాజెక్టులను పట్టాలెక్కిస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకోవాలని రైతాంగం, ప్రజలు ఆశిస్తున్నారు.

ఐదేళ్ల జగన్ హయాంలో రెండు జిల్లాల్లో ఒక్క జలాశయ పనులు కూడా కాలేదు. నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు నియోజకవర్గం కుప్పానికి నీళ్లు ఇచ్చామని చెప్పుకొనేందుకు ఆఖర్లో హడావుడి చేసి అభాసుపాలయ్యారు. వైకాపాలో నంబరు 2 నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి లబ్ధి చేకూర్చడానికి మూడు రిజర్వాయర్లు మంజూరు చేశారు. కేవలం స్వార్థ ప్రయోజనాలే పరమావధిగా పనిచేశారే తప్ప కర్షకుల మేలు కోసం పనులు జరిగిన దాఖలాలు లేవు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చీరాగానే పుంగనూరు, కుప్పం బ్రాంచి కాలువలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఒక్క చిత్తూరు జిల్లాలోనే ఏడాదిలో దాదాపు రూ.680 కోట్లు ఖర్చు చేసింది. జులై చివరి నాటికి పనులు పూర్తి చేసి రాష్ట్రంలో చిట్టచివర ఉన్న కుప్పానికి నీళ్లు తేవడానికి భగీరథుడిలా శ్రమిస్తున్నారు.

**రెండింటికి టెండర్లు పిలిచేదెప్పుడు?**

గుడుపల్లె మండలం యామగానిపల్లెలో 0.710 టీఎంసీలు, శాంతిపురం



మండలం మాదనపల్లి వద్ద 0.354 టీఎంసీల సామర్థ్యంతో రెండు జలాశయాల నిర్మాణానికి వైకాపా హయాంలో జీవో ఇచ్చారు. రూ.535.435 కోట్లతో పనులకు ఆమోదం తెలిపారు. తర్వాత వీటి ఊసే మరిచారు. రెండు రిజర్వాయర్లకు టెండర్లు పిలిస్తే వచ్చే ఏడాదైనా కృష్ణా జలాలను కుప్పంలో నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. కొత్త పరిశ్రమలకూ నీరందుతుంది.

**తమిళనాడుకు వృథాగా వెళ్లాల్సిందేనా?**

బైరెడ్డిపల్లె మండలంలోని కైగల్ నదిపై జలాశయం నిర్మిస్తే బైరెడ్డిపల్లె, వి.కోట మండలాల్లో తాగునీటి సమస్యకు చెక్ పడుతుంది. రిజర్వాయర్ లేకపోవడంతో వర్షపు నీరంతా తమిళనాడుకు వృథాగా పోతోంది. 2019లో తెదేపా హయాంలో రూ.16.01 కోట్లు మంజూరు చేయగా.. వైకాపా పాలనలో రద్దుల జాబితాలో చేర్చారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పలమనేరు వచ్చినప్పుడు దీని ప్రస్తావన వచ్చింది.

**అటవీ అభ్యంతరాలతో ఆగిన తుంబ**

బంగారుపాళ్యం మండలం తుంబపాళ్యానికి మూడు కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో తుంబ ప్రాజెక్టును నిర్మించారు. భూగర్భంలో కాలువలు ఏర్పాటు చేసి 3వేల ఎకరాలకు సాగునీరు అందించేవారు. భారీ వర్షాలకు గేట్లు కూలిపోవడంతో పంటలు వేసే పరిస్థితి లేదు. జైకా నిధులు రూ.2.30 కోట్లు మంజూరైనా అటవీ శాఖ అభ్యంతరాలతో పనులు ఆగాయి.

**ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించినా**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తూర్పు ప్రాంతానికి గాలేరు- నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్) ప్రాజెక్టు వరప్రదాయిని. ఇది అందుబాటులోకి వస్తే 5 లక్షల మందికి తాగునీరు ఇవ్వవచ్చు. 1.05 లక్షల ఎకరాలు సస్యశ్యామలమవుతాయి. గతంలో ఉమ్మడి కడప జిల్లాలోని గండికోట నుంచి నీరు తీసుకునేందుకు ప్రణాళికలు రూపొందించారు. అటవీ శాఖ అనుమతులు రావడం కష్టమని భావించి నెల్లూరు జిల్లాలోని కండలేరు రిజర్వాయర్ నుంచి ప్రత్యామ్నాయ ప్రణాళిక తయారుచేశారు. అధికారులు డిజైన్లు పంపినా ఇప్పటివరకు ప్రభుత్వం ఆమోదించలేదు. ఈ ఏడాది ప్రారంభిస్తే 2029 ఎన్నికల నాటికైనా పనులు పూర్తవుతాయి.

# అంతా 'మా ఇష్టం'..!

రంగంపేట: కూటమి ప్రభుత్వం రావడంతోనే ఏడీబీ రోడ్డు రూ.300 కోట్ల అంచనాతో అందంగా రూపుదిద్దుకుంటుంది. నిబంధనల ప్రకారం రోడ్డుకి ఆనుకుని ఉన్న గ్రామానికి కూడలిలో క్రాసింగ్‌లను ఇవ్వాల్సి ఉంది. ఒక ప్రదేశంలో ఇచ్చిన తర్వాత మరో 500 మీటర్లలోపు గ్రామ జంక్షన్ వచ్చినా ఇవ్వడానికి అనుమతి లేదు. అయితే వడిశలేరు జంక్షన్‌కు ఇరువైపులా 200మీటర్లలోపే రెండు క్రాసింగ్‌లు ఉన్నాయి. ఊళ్లు లేకపోతే 3 నుంచి 5 కిలోమీటర్ల వరకు క్రాసింగ్‌ను ఏర్పాటు చేయకూడదనే నిబంధన ఉన్నా కార్గిల్ రొయ్యల మేత తయారీ కేంద్రం వద్ద ఏర్పాటు చేసి దానికి దాదాపు కిలోమీటరులోపే మరొకటి నిర్మించారు. దీనిపై ప్రశ్నిస్తే అధికారులు నీళ్లు నములుతున్నారు.
వడిశలేరు జంక్షన్‌లో ఓ రోడ్డు క్రాసింగ్ ఉంది. దీనికి దాదాపు 150 మీటర్ల దూరంలోనే పెట్రోలుబంకు వద్ద మరొకటి ఏర్పాటు చేశారు. ఇక్కడే ఇటీవల ప్రమాదం జరిగి ఐదుగురు మృతి చెందారు. వడిశలేరు కూడలికి అవతలివైపున మరో 150మీటర్లలో మరో క్రాసింగ్ ఉంది. దీనికి ఆనుకుని ఉన్న రోడ్డు ద్వారా రాజానగరం మండలం పల్లకడియం వెళ్లవచ్చు. ఏడీబీ రోడ్డులో ఇలా ఇష్టానుసారంగా అధికారులు క్రాసింగ్‌లను ఏర్పాటు చేస్తూ ప్రయాణికులను ప్రమాదాలకు గురిచేస్తున్నారు. రంగంపేట-వడిశలేరు మధ్య ఓ ప్రముఖ వ్యాపారవేత్తకు



చెందిన భూమి ఉంది. దీనికి ఎదురుగానే మరో క్రాసింగ్‌ని ఏర్పాటు చేశారు. దీనికి సమీపంలోని ముకుందవరం, సుభద్రంపేట వెళ్లే రోడ్డు ఉండగా క్రాసింగ్ కోసం స్థానికులు కోరినా అక్కడ అనుమతి ఇవ్వలేదు. రామేశ్వరంపేట శివారున ఆదిత్య కళాశాల వద్ద ఏర్పాటుచేయగా దానికి 150మీటర్ల లోపే మరో చిన్న దారి వద్ద మరొకటి ఏర్పాటు చేశారు.

**పోలీసుల నిఘా కరవు**

ఏడీబీ రోడ్డు.. రాష్ట్రంలోనే అత్యధిక వాహనాలు రాకపోకలు సాగించే రహదారి. తూర్పుగోదావరి - కాకినాడ జిల్లాల మధ్య ఉన్న దీనిపై పోలీసుల నిఘా కొరవడింది. ఈ రోడ్డులో ఏర్పాటు చేసిన సీసీ కెమేరాల నిర్వహణను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో మరుగునపడ్డాయి.

**నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు**

రోడ్డు క్రాసింగ్ ఇవ్వడానికి కొన్ని నిబంధనలు ఉన్నాయి. ఎవరైనా ఓ ప్రదేశంలో కావాలని కోరితే దానిని పరిశీలించి అవసరమనుకుంటేనే ఇస్తాం. దీని కోసం ప్రత్యేకమైన నిబంధనలు రూపుదిద్దుకున్నాయి. వాటిని ఎవరైనా అతిక్రమిస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. సీసీ కెమేరాల ఏర్పాటు బాధ్యత పోలీసు శాఖదే.
రవీంద్ర, ఈఈ, ర.భ.శాఖ, రాజమహేంద్రవరం

# కోనసీమ.. చేద్దామా ప్రగతి సీమ

అమలాపురం: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రజల జీవన ప్రమాణాల మెరుగు దిశగా యంత్రాంగం అడుగులు వేస్తోంది. తలసరి ఆదాయం మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలు ఇచ్చిన నేపథ్యంలో కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. జిల్లా జీడీపీలో ప్రాథమిక రంగం నుంచి దాదాపు 45 శాతం ఆదాయం సమకూరుతున్న నేపథ్యంలో వచ్చే అయిదేళ్లలో వ్యవసాయ అనుబంధ రంగాల్లో 15 శాతం పురోగతి సాధించాల్సి ఉంది.

**కొబ్బరి ఆధారిత పరిశ్రమలతో...**

జిల్లాలో విస్తారంగా కొబ్బరి సాగవుతున్నా కాయలు మినహా మరే ఇతర ఉత్పత్తులు స్థానికంగా చేయడం లేదు. విలువ ఆధారిత, ఉప ఉత్పత్తులు స్థానికంగా చేయగలిగి ఎగుమతులను ప్రోత్సహిస్తే ఉపాధి మెరుగుపడి.. రైతులు, ప్రజలకు అదనపు ఆదాయం సమకూర్చవచ్చు. ఇప్పటికే అధికారుల బృందం కొబ్బరి ఉత్పత్తులు తయారుచేసి ఎగుమతి చేస్తున్న కేరళ, తమిళనాడు, కర్ణాటకలో పర్యటించి వచ్చిన నేపథ్యంలో వీలైనంత త్వరగా సాధ్యాసాధ్యాలపై సమీక్షించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది.



**పీతల హేచరీని పట్టాలెక్కిస్తే...**

కోనసీమలో పీతల హేచరీని అందుబాటులోకి తెస్తే ఆ రంగంవైపు ఎక్కువమంది మళ్లి ఆదాయం పొందొచ్చు. ప్రభుత్వ పరంగా అయిదెకరాల్లో ఏర్పాటుకు మార్గం సుగమం కాగా..కాట్రేనికోన మండలంలో ప్రైవేటు సంస్థ హేచరీ ఏర్పాటుకు ముందుకొచ్చింది. త్వరిగతిన పట్టాలెక్కిస్తే స్థానికంగా పీత సాగు పెంచవచ్చు.
కోకో సాగును ఇలా పెంచొచ్చుజిల్లాలో కొబ్బరి సుమారు 90 వేల ఎకరాల విస్తీర్ణం ఉండగా కోకో 2,500 ఎకరాల్లో అంతరపంటగా సాగు చేస్తున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేయడం ద్వారా ఏటా వెయ్యి ఎకరాల మేర పెంచేందుకు నిర్ణయించారు. అయినవిల్లి, అంబాజీపేట, రామచంద్రపురం ప్రాంతాల్లోని రైతులు కోకో వైపు మొగ్గు చూపుతున్నారని జిల్లా ఉద్యానశాఖ అధికారి బి.వి.రమణ తెలిపారు. ఇటీవల ఏలూరులో మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో వ్యాపారులతో నిర్వహించిన సమీక్షలో కిలో రూ.500 ధర నిర్ణయించారు. కోకోను నేరుగా విక్రయించకుండా దానిని ప్రాసెస్ చేస్తే రైతులకు మంచి ధర లభిస్తుంది. అవగాహన కల్పించి, ప్రాసెస్ చేసిన గింజలను నేరుగా సంస్థలు కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

**పర్యాటకానికి ఊపిరి పోస్తే..**

ప్రకృతి రమణీయతకు కోనసీమ పేరు. స్థానికంగా సరైన వసతి, ఆతిథ్యం మెరుగుపరిస్తే నిరుద్యోగ యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వాడపల్లి, అంతర్వేది, ద్రాక్షరామ, అప్పనపల్లి, అయినవిల్లిలో పుణ్యక్షేత్రాలు ఉన్నాయి.. ఆదుర్రుతోపాటు అంతర్వేది, మలికిపురం, ఉప్పలగుప్తం ప్రాంతాల్లో విశాల సాగర తీరం ఉన్నా అక్కడ తగిన వసతులు లేవు. హోటళ్ల నిర్మాణం పెరిగితే ఆదాయ వనరులు పెరుగుతాయని భావిస్తున్నారు.

# బంగారు బాతులా 'యాత్రి నివాస్'



విశాఖపట్నం: అప్పూఘర్‌లోని ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు చెందిన 'యాత్రి నివాస్' భవనం ఆధునికీకరణ పనుల్లో తిరకాసులు విస్తుగొలుపుతున్నాయి. నవీకరణ పేరుతో గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. నిర్మాణ పనులు మొదలు కొని.. కొనుగోలు చేసిన ఫర్నిచర్ వరకు చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వంలోనూ దీనిపై పూర్తిస్థాయి విచారణ సాగలేదనే విమర్శలొస్తున్నాయి. గత ప్రభుత్వం అంచనాలు పెంచి మంజూరు చేసిన నిధుల విడుదలకు తాజాగా కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపడం గమనార్హం.

**అన్ని నిధులా:** యాత్రి నివాస్ శిథిలావస్థకు చేరడంతో గత వైకాపా ప్రభుత్వం పునరుద్ధరణకు నిధులు కేటాయించింది. అదీ.. ఓ బ్యాంకు నుంచి రుణం తీసుకొని మరీ వెచ్చించారు. మొదట రూ.8.60 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కొద్ది రోజుల తర్వాత అదనపు వసతుల పేరుతో వ్యయాన్ని రూ.13.50 కోట్లకు పెంచేశారు. ఎంత ముఖ్యమైన పనులైనా అంచనాలను 15 శాతం వరకు పెంచుతుంటారు. ఇక్కడ మాత్రం 60 శాతం వరకు పెంచేశారు. యాత్రి నివాస్‌లో అదనపు పనుల పేరుతో గతంలో ఉన్న సమావేశ మందిరాన్ని కొంత విస్తరించారు. హోటల్ సిటింగ్ పెంచారు తప్ప అంతకుమించి ఎటువంటి అదనపు వసతులు కల్పించలేదు. దీనికి వెచ్చించిన నిధులతో ఓ బడ్జెట్ హోటల్ నిర్మించొచ్చు. కేవలం నాటి ప్రభుత్వంలో కొందరి స్వార్థం కోసమే ఇదంతా చేశారన్న ఆరోపణలున్నాయి.
తొలుత రూ.8.60 కోట్లకు మాత్రమే పరిపాలన అనుమతులున్నాయి. అదనపు ప్రతిపాదనలకు అనుమతి లేదు. గుత్తేదారు మాత్రం ఆ మేరకు పనులు చేసినట్లు చెప్పుకుంటూ వచ్చారు. నిజంగా అదనపు నిధులతో పనులు చేశారా అన్న సందేహం ఉన్నప్పటికీ ఎటువంటి తనిఖీలు లేకుండానే కూటమి ప్రభుత్వం ఆ నిధుల మంజూరుకు అనుమతిస్తూ ఇటీవల ఆమోదం తెలిపింది. కొద్ది రోజుల్లోనే దీన్ని ప్రారంభించి నెల రోజుల్లో నిర్వహణలోకి తీసుకురానున్నారు. ఫలితంగా 44 గదులు అందుబాటులోకి వస్తాయి. అలాగే 50 మంది ఒకేసారి భోజనం చేసే రెస్టారెంట్, వంద మందికి సరిపడా సమావేశ మందిరం అందుబాటులోకి వస్తాయి.

**నోరు విప్పని అధికారులు:** హోటల్ ఆధునికీకరణ పనులు నాణ్యత లోపంగా సాగాయన్న

విమర్శలు ముందునుంచీ ఉన్నాయి. ఏపీటీడీసీకి చెందిన కొందరు అధికారులు ఈ పనుల మీద తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. కొన్ని చోట్ల లోపాలు బయటపడినా ఎవరూ నోరువిప్పడం లేదు. కొన్ని గదుల్లో చేపట్టిన ఆధునికీకరణ పనులు డొల్లగా కనిపిస్తున్నాయి. పలు చోట్ల నాణ్యత లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గదుల్లో ఏర్పాటు చేసేందుకు తీసుకొచ్చిన పడకలు, ఇతర ఫర్నిచర్ వస్తువులు నాణ్యత లోపంగా ఉన్నట్లు సమాచారం.

# 'అడ్డుకోరని దర్జా'.. గెడ్డలన్నీ కబ్జా



విశాఖపట్నం : సహజ సిద్ధమైన గెడ్డలు ఆక్రమణలతో బక్కచిక్కిపోతున్నాయి. వర్షపు నీరు, కాలనీల నుంచి వచ్చే వృథా నీటిని మోసుకెళ్లే ప్రధాన గెడ్డలు ప్రస్తుతం పిల్ల కాల్వలను తలపిస్తున్నాయి. పలుకుబడి ఉన్న కొందరు గెడ్డలను కబ్జా చేయడంతో అధికారులు ప్రశ్నించకుండా కళ్లుమూసుకున్నారు. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే జీవీఎంసీ, రెవెన్యూ ఉద్యోగులు...ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ తప్పించుకుంటున్నారు. ఈ గెడ్డలను రక్షించకపోతే భవిష్యత్‌లో వరద నీటికి చుట్టుపక్కల కాలనీలకు ముంపు గండం తప్పదు.

**ఆ రెండు కాలనీల్లో...** పీఎంపాలెం లాస్ట్ బస్‌స్టాప్ హౌసింగ్ బోర్డు నుంచి హెచ్‌బీసీఎల్ లే-అవుట్ మీదుగా మధురవాడ ప్రాంతాలవైపు ఈ గెడ్డ వెళుతుంది. హౌసింగ్ బోర్డు కాలనీ, హెచ్‌బీసీఎల్ లేఅవుట్‌లో ఎక్కువగా ఆక్రణలకు గురైంది. ఆక్రమణలతో హెచ్‌బీసీఎల్ లేఅవుట్‌లో గెడ్డ వెడల్పు 4 అడుగులకు కుంచించుకుపోయింది. పూడిక తీత సమయంలో పారిశుద్ధ్య విభాగం ఇబ్బంది పడుతున్నారు.

**అయినా...ప్లాన్ మంజూరు!**

ఈ గెడ్డ చంద్రంపాలెం, కృష్ణానగర్, వాంబేకాలనీ నుంచి వికలాంగుల కాలనీ మీదుగా రుషికొండ సమీపంలో సముద్రంలో కలుస్తుంది. కృష్ణానగర్ కాలనీలో ఎక్కువగా ఆక్రమణలకు గురవుతోంది. గెడ్డలోకి చొచ్చుకొచ్చి ప్రహరీ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికే కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టేశారు. 20 అడుగులు ఉండాల్సిన గెడ్డ 5 అడుగులకు కుంచించుకుపోయింది. దీని వల్ల గెడ్డలోకి జీవీఎంసీ యంత్రాలు వెళ్లి పూడిక తీయడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గెడ్డ పక్కన ఇరువైపులా బఫర్ జోన్ కింద పరిగణించి జీవీఎంసీ పర్యవేక్షించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. విచిత్రమేమంటే ఈ గెడ్డలో చొచ్చుకొచ్చిన నిర్మాణాలకు జీవీఎంసీనే ప్లాన్ అనుమతులు ఇవ్వడం గమనార్హం.

**స్థానిక నాయకుల హడావుడి:** ఆక్రమణలపై ఫిర్యాదుల నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి చర్యలకు ఆదేశిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో అక్కడికి వెళ్తున్న స్థానిక అధికారులపై నాయకుల ఒత్తిడి పెరిగింది. మొత్తం ఆక్రమణలు తొలగించి అప్పుడు కొత్తవి తీసేయాలంటూ హడావుడి చేస్తున్నారు. దీంతో అధికారులు నోటీసులిచ్చి వదిలేస్తున్నారు. మధురవాడలో జనాభా నాలుగు లక్షలు దాటిపోయింది. నివాసాల సంఖ్య పెరిగిపోయింది. జనాభా పెరుగుదలకు అనుగుణంగా గెడ్డలను కాపాడుకోకపోతే వర్షాకాలంలో తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.
అడుగుకో ఆక్రమణ: నగరంపాలెం బృహత్తర ప్రణాళిక మార్గం నుంచి జాతీయ రహదారి దాటి చంద్రంపాలెం ఉన్నత పాఠశాల సమీపంగా...పదుల సంఖ్యలో కాలనీల చెంతగా ఈగెడ్డ వెళుతుంది. నగరంపాలెంలో అడుగడుగునా ఆక్రమించేశారు. 15 అడుగుల వెడల్పు ఉండాల్సిన గెడ్డ ప్రస్తుతం బక్కచిక్కిపోయింది. ఆక్రమణలపై పలుసార్లు ఫిర్యాదులందినా జీవీఎంసీ అధికారులు నోటీసులిచ్చి చేతులు దులిపేసుకుంటున్నారు.

# కోడూరుకు కొత్త శోభ




అనకాపల్లి : అనకాపల్లి సమీపంలోని కోడూరు ఆటోనగర్‌లో ఎట్టకేలకు సూక్ష్మ, లఘు, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) పార్క్ అందుబాటులోకి వచ్చింది. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించారు. కావాల్సిన అన్ని వసతులు ఉండటంతో పారిశ్రామికవేత్తలు సంస్థ ఏర్పాటుకు ఉత్సాహం చూపుతున్నారు. యువతకు ఉపాధి అవకాశాల కల్పనతోపాటు అనకాపల్లి అభివృద్ధికి ఎంఎస్‌ఎంఈ పార్క్ కీలకం కానుంది.
అనకాపల్లి మండలం కోడూరు వద్ద పారిశ్రామికవాడ నెలకొల్పడానికి అయిదేళ్ల క్రితం 129 ఎకరాలు సేకరించారు. ఇక్కడ రూ. 25.41 ఎకరాలు పరిశ్రమల ఏర్పాటుకు కేటాయించారు. గత వైకాపా ప్రభుత్వంలో అప్పటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ 2022లో ఆటోనగర్ అభివృద్ధికి హడావుడిగా శంకుస్థాపన చేసి వదిలేశారు. ఎన్నికల ముంగిట ఎలాంటి సదుపాయాలు కల్పించకుండా నాటి ఇన్‌ఛార్జి మంత్రి రాజన్నదొర మరోసారి ఆటోనగర్ ప్రారంభించారు. పరిశ్రమల ఏర్పాటుకు యూనిట్ల కోసం వెళ్లే వారికి అక్కడ శిలాఫలకాలే దర్శనమిచ్చాయి. ఎలాంటి వసతులు లేకుండా సంస్థలు ఎలా ఏర్పాటు చేయగలమన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ప్రశ్నకు సమాధానం కరవైంది. దీంతో ప్రారంభోత్సవాలు.. శిలాఫలకాలే తప్ప అక్కడ చిన్న ఇటుక రాయి కూడా పడలేదు.
కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా అసంపూర్తిగా ఉన్న ఆటోనగర్‌పై దృష్టి సారించి ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటుకు చర్యలు ప్రారంభించింది. లేఅవుట్‌లో వంద అడుగుల బీటీ రోడ్లు, వాటిని ఆనుకుని కాలువలు నిర్మించారు. విద్యుత్తు లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు వేశారు. కనీసం వంద చ.మీ. నుంచి వెయ్యి చ.మీ. వరకు ప్లాట్లు ఏర్పాటు చేశారు. అన్ని రకాల మౌలిక సదుపాయాలతోపాటు సరకు రవాణా, ఎగుమతి, దిగుమతికి సంబంధించి అధునాతన బీటీ రహదారులు నిర్మించారు. ఇలా అభివృద్ధి చేసిన 250 ప్లాట్ల వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. ఇందులో 171 యూనిట్ల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు సైతం ఆసక్తి చూపి ముందుకువచ్చారు. కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి ఎమ్మెల్యే రామకృష్ణ శుక్రవారం ఎంఎస్‌ఎంఈ పార్కును ప్రారంభించారు.

**ఆరు నెలల్లో పరిశ్రమలతో కొత్తరూపు ...** కోడూరు ఎంఎస్‌ఎంఈ పార్కుకు ఆరు నెలల్లో పరిశ్రమలతో కొత్తరూపు రానుంది. అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడంతో పారిశ్రామికవేత్తలు సైతం యూనిట్ల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. సూక్ష్మ, లఘు, మధ్యతరహా పరిశ్రమలు వస్తాయి. గ్రామ యువతకు తొలి ప్రాధాన్యం కల్పిస్తాం. యువత సాంకేతిక నైపుణ్యంపై దృష్టి సారించాలి.
నరసింహారావు, జోనల్ మేనేజర్, ఏపీఐఐసీ

# పిచ్చుకలంకకు పర్యాటక శోభ

ఆత్రేయపురం: పర్యాటక ఆతిథ్యానికి ముఖద్వారంగా నిలిచిన కోనసీమ జిల్లా అయిదేళ్ల వైకాపా పాలనలో వెలవెలబోయింది. హడావుడే తప్ప క్షేత్రస్థాయిలో కనీస పురోగతి చూపించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పాత ప్రాజెక్టులను పట్టాలెక్కించే పనులు ప్రారంభించింది. ఇందులో భాగంగా గత ఆగస్టు 26న ఒబెరాయ్ ప్రతినిధులతో కలిసి పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కలెక్టర్ మహేష్‌కుమార్ తదితరులు ఆత్రేయపురం మండలంలోని పిచ్చుకలంక ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించిన విషయం తెలిసిందే.

**తాజాగా కదలిక..**

ప్రభుత్వ ఆదేశాలతో పర్యాటక శాఖ అధికారులు, ఆర్డీవో, ఇతర ఏజెన్సీ ప్రతినిధులు పిచ్చుకలంక, బ్యారేజీ పరిసరాలను పరిశీలించారు. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆర్డీవో పి.శ్రీకర్, జిల్లా పర్యాటక అధికారి అన్వర్, ఎస్టేట్



అధికారి రాంప్రసాద్ పేర్కొన్నారు. తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, ఇంజినీరింగ్ అధికారులు రాధాకృష్ణ, సాయిరాం, బొబ్బర్లంక సర్పంచి సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

**ఇక్కడే ఎందుకంటే..**

రాజమహేంద్రవరానికి అత్యంత చేరువలో ఉన్న పిచ్చుకలంక భూముల చుట్టూ గోదావరి జలాలు ప్రవహించడంతో అదొక అందమైన ద్వీపంలా కనిపిస్తుంది. చూపరులకు కనువిందు చేస్తుంది. ఇక్కడి పరిసరాల్లోనే అఖండ గోదావరి వశిష్ఠ, గౌతమి పాయలుగా విడిపోవడం, బోటుషికారుకు అనుకూలంగా ఉండటంతో పర్యాటకులకు మంచి అనుభూతి ఇస్తుంది.

**ఏర్పాటుచేసే సౌకర్యాలు**

ఇక్కడ అయిదు నక్షత్రాల హోటల్, బోటింగ్, కాటేజీలు, జల క్రీడలు, ఇతర హంగులు అన్నీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉంది. రాజమహేంద్రవరంతో పాటు కోనసీమ జిల్లాలోని వాడపల్లి వంటి ప్రదేశాలు మరింత అభివృద్ధి సాధించనున్నాయి.

# ఎస్.అన్నవరం సొసైటీలో స్వాహా పర్వం

తుని : రైతులను ఆర్థికంగా ఆదుకోవాలనే లక్ష్యంతో ఏర్పాటుచేసిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్)లో దొంగలు పడ్డారు. రైతుల పేరిట తప్పుడు ఖాతాలతో ఏకంగా రూ.1.05 కోట్లను దోచుకున్నారు. దాదాపు 13 ఏళ్లుగా సాగుతున్న ఈ దందాపై కూటమి ప్రభుత్వం విచారణ చేపట్టడంతో అవినీతి తిమింగలాల వివరాలు వెలుగులోకి వస్తున్నాయి. తుని మండలం ఎస్.అన్నవరం సొసైటీలో దాదాపు 4,864 మంది సభ్యులు ఉండగా వారిలో 1,265 మందికి వివిధ రకాల రుణాలు మంజూరు చేశారు. వీరిలో 595 మంది రైతుల పేర్లతో సీఈవో విశ్వనాథుని త్రినాథ శ్రీనివాస్ రెవెన్యూ దస్త్రాల్లో భూములు లేనివారిపేరుతో, అనధికారకంగా, తనఖా బాండ్లు లేకుండా ఆయా పేర్లతో రుణాలు, అర్హతలేని రైతులకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాల పేరుతో మొత్తం రూ.1,05,65,285 రుణాలు మంజూరు చేసినట్లు విచారణ అధికారులు నిర్ధారించారని ప్రస్తుత సీఈవో తమరాన రాములు



చెప్పారు. ఈ వ్యవహారం 2012 నుంచి 2014 మార్చి మధ్యలో జరిగిందని వివరించారు. అవినీతి ప్రారంభమైన నాటి నుంచి దారిమళ్లిన అసలు మొత్తానికి వడ్డీగా రూ.2,47,22,766 లెక్కకట్టి మొత్తంగా రూ.3,52,88,005 సంబంధిత వ్యక్తుల నుంచి వసూలు చేయాలని సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఎస్‌డీఎల్‌సీవో బీఎన్ శివకుమార్ ఆదేశాలు జారీచేశారని చెప్పారు. ఈ విషయంలో ఆనాటి సీఈవో వీటీ శ్రీనివాస్, డీసీసీబీ మేనేజర్ కేవీ రమణమూర్తి, సూపర్‌వైజర్ జి.ఆదినారాయణ, డీవీ రామరాజు, పీవీ కుక్కుటేశ్వరరావుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో సంఘం సభ్యులతో అత్యవసర సమావేశం నిర్వహించి రుణాల వసూలుపై చర్చించి తగిన చర్యలు చేపడతామని సీఈవో చెప్పారు.

# అన్నదాత చూపు.. ఆయిల్‌పాం వైపు

పిఠాపురం : జిల్లాలో ఎక్కువ శాతం వరి పంటే సాగు చేస్తున్నారు. ఏటా వరదలు, చీడపీడలతో రైతులు నష్టాలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యానశాఖ అధికారులు రైతులను ప్రత్యామ్నాయంగా బహుళ వార్షిక పంటల దిశగా ప్రోత్సహిస్తున్నారు. ఆసక్తి పెంచేలా అవగాహన కల్పిస్తున్నారు. బోర్లతో సాగుచేసే ప్రాంతాల్లో రైతులను గుర్తిస్తున్నారు. ఆయిల్‌పాం సాగు విస్తీర్ణం పెంచేందుకు రాయితీలు కూడా ప్రకటించారు.

**నిర్ణయించిన లక్ష్యం ఇదీ..**కాకినాడ జిల్లాలో మెట్ట భూములు, బోర్లపై ఆధారపడి వరి, ఇతర ఉద్యాన పంటలు పండించే వారంతా ఆయిల్‌పాం సాగు చేయాలని గతేడాది నుంచి ఉద్యానశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం వరి, కూరగాయలు, మల్బరీ, పత్తి తదితర వాణిజ్య పంటలు వేస్తున్నారు. ఈ ఏడాది నుంచి పిఠాపురంలో 3,050 హెక్టార్లు, పెద్దాపురంలో 2,133.50 హెక్టార్లు, తునిలో 2,222.40, శంఖవరంలో 1,825, జగ్గంపేటలో 2,347, ప్రత్తిపాడులో 2,129 హెక్టార్లలో ఆయిల్‌పాం సాగు చేయించాలనేది లక్ష్యం. ఇప్పటికే రైతులతో పంట వేయిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రానికి పామాయిల్ కూడా ఇతర దేశాల నుంచి దిగుమతి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సాగు పెంచితే రైతులకు ఆదాయం పెరుగుతుందని చెబుతున్నారు.
రాయితీలు అందుకోండిలా..ఆయిల్‌పాం సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం రాయితీలు ప్రకటించింది. ఒక హెక్టార్‌కు 57 మొక్కలు వేయొచ్చని చెబుతున్నారు. మొక్కలు, నాటేందుకు రూ.29 వేలు ఉచితంగా అందిస్తారు. మొక్కల సంరక్షణకు ఎరువుల నిమిత్తం నాలుగేళ్లకు ఏడాదికి రూ.5,200, అందులోనే అంతర పంటలు వేసుకుంటే నాలుగేళ్లకు ఏడాదికి మరో రూ.5,200 చొప్పున అందించనున్నారు.

# అధునాతన సౌకర్యాలు.. మెరుగైన వైద్య సేవలు

పుట్టపర్తి : మారుమూల ప్రాంతాల్లోనూ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుసంధానంగా బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ (బీపీహెచ్‌యూ)లను నిర్మిస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో శ్రీసత్యసాయి జిల్లాలో మొత్తం 14 యూనిట్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.50 లక్షల కేటాయించి ఆర్అండ్‌బీ శాఖకు అప్పగించారు. తాడిమర్రి మండలంలో సిద్ధమైన బీపీహెచ్‌యూ భవనాన్ని మంగళవారం రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించనున్నారు.

**తుది దశలో...:** జిల్లాలో ఎన్ఎస్ గేట్, లేపాక్షి, కనగానపల్లి, ఓబుళదేవరచెరువులో భవనాలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి.



ముదిగుబ్బలో పెయింటింగ్ పనులు చేస్తుండగా.. తలుపుల, పాముదుర్తి, సోమందేపల్లి, రొద్దం, అగళి, గాండ్లపెంట, అమరాపురంలో నిర్మాణాలు చివరి దశలో ఉన్నాయి. చిలమత్తూరులో మాత్రం స్థలం సమస్యతో పనులు ప్రారంభం కాలేదు.

**రక్త పరీక్షలు చేస్తాం..** పీహెచ్‌సీలకు అనుసంధానంగా నిర్మిస్తున్న యూనిట్‌లలో రక్తపరీక్షలు చేయనున్నాం. దీంతో రోగులకు అందించే సేవలు సులభతరం కానున్నాయి. నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించాం. త్వరలోనే అన్ని యూనిట్లను అందుబాటులోకి తీసుకొస్తాం. ఫైరోజబేగం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి

# విద్యుత్తు వినియోగం పైపైకి..

అనకాపల్లి : జిల్లాలో విద్యుత్తు వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించినా ఇవి మందగించడంతో ఉష్ణోగ్రత, ఉక్కపోత ఒక్కసారిగా పెరిగాయి. దీంతో కొద్దిరోజులుగా విద్యుత్తు వినియోగం పెరుగుతూ వస్తున్నట్లు సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. సాధారణంగా మే నెలలో కరెంటు వాడకం ఎక్కువగా ఉంటుంది. డిమాండ్‌కు తగిన సరఫరా ఉండేలా ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు. వినియోగానికి తగ్గట్టుగా జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్లను అధికంగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జిల్లాలో 26,700 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఈ ఏడాది జిల్లాలో అవసరమైన చోట 90 వరకు ఈ రెండు నెలల కాలంలో ఏర్పాటుచేశారు. మొత్తంమీద అవసరాలకు తగ్గట్టు సరఫరా ఉండటంతో ఈ ఏడాది పరిశ్రమలకు పవర్ హాలిడేలు, కోతలు అవసరం తలెత్తలేదు. దీనికితోడు మేలో ఎండలు కాస్త తక్కువ ఉండడంతో విద్యుత్తు వినియోగం పెరగలేదు. అయితే సాధారణ పరిస్థితులకు భిన్నంగా జూన్ ప్రారంభం నుంచి విద్యుత్తు వాడకం పెరగడం విశేషం. ఉక్కపోత పెరగడంతో ఏసీలు, ఫ్యాన్ల వినియోగం ఎక్కువైంది. అడపాదడపా వానలు కురుస్తున్నా పెద్దగా ప్రయోజనం



ఉండకపోవడంతో ఒకటో తేదీ నుంచి ప్రతి రోజూ పెరుగుతూనే వస్తోంది. రాబోయే నాలుగైదు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీంతో విద్యుత్తు డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందని తూర్పుప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో సరాసరి విద్యుత్తు వినియోగం రోజుకు 29 మిలియన్ యూనిట్లు (ఎంయూ) ఉండేది. ఈ నెలలో దీనికి అదనంగా మరో 2.7 ఎంయూ వరకు వినియోగం పెరిగింది. అనకాపల్లి జిల్లాలో 6.25 లక్షల ఇంటి విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. వాణిజ్య కనెక్షన్లు 79 వేలు, పరిశ్రమలు 700 వరకు ఉన్నాయి. వాడకం తగ్గట్టుగా సరఫరా... జిల్లాలో విద్యుత్తు వినియోగం పెరుగుతూ వస్తోంది. మే నెలతో పోలిస్తే ఈనెల ఎక్కువైంది. దీనికి తగ్గట్టుగా సరఫరా ఇస్తున్నాం. ప్రజలు విద్యుత్తు పొదుపుగా వాడాలి. వృథా చేయవద్దు. ఈదురు గాలులతో చెట్లు కూలి ఎక్కడైనా అంతరాయం ఏర్పడినా వెంటనే సమస్యను పరిష్కరించి సరఫరా మెరుగుపరుస్తున్నాం. ఈ ఏడాది పవర్ హాలిడే, కోతలు అన్నవే లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. రాజశేఖర్, ఈఈ, అనకాపల్లి

# ఎగుమతిదారులు వచ్చేశారు

చిత్తూరు : మార్కెట్ యార్డులో టేబుల్ రకాల మామిడి సీజన్ ఊపందుకుంది. సోమవారం పెద్దఎత్తున యార్డుకు చేరుకున్నాయి. సీజన్ మొదట్లో బేనీషా తదితర రకాల ధరలు ఆశాజనకంగా ఉండగా.. తర్వాత తగ్గించేశారు. ప్రస్తుతం రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, పంజాబ్‌కు చెందిన ఎగుమతిదారులు ఇక్కడికి చేరుకున్నారు. బేనీషా కాయలను పోటీపడి కొనుగోలు చేస్తుండటంతో వచ్చినవి వచ్చినట్లు తరలిస్తున్నారు. **అధికారులకు పర్యవేక్షణ విధులు:** రానున్న 15 రోజులు ఎంతో



కీలకమని, గుజ్జు పరిశ్రమల వద్ద పర్యవేక్షణ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో సోమవారం సమీక్షించారు. మద్దతు ధర ప్రకటించిన నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి తోతాపురి రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. పరిశ్రమలకు మామిడి సరఫరా చేసే రైతుల వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని స్పష్టం చేశారు. తోతాపురి కిలోకు పరిశ్రమలవారు రూ.8 ఇస్తుండగా, ప్రభుత్వం ఇచ్చే రూ.4 వివరాల్ని అక్కడే బోర్డులో ప్రదర్శించాలని' పేర్కొన్నారు.

# బతుకు బాటలో ప్రమాద ఘంటికలు



తాడిపత్రి: తాడిపత్రి, యాడికి మండలాల్లో నిత్యం శ్రామికులు రాకపోకలు సాగించే రహదారులు. పరిశ్రమల్లో పనులు చేసి అలసిపోయి వేళకు ఇంటికి చేరుకోవాలనే క్రమంలో గుంతల కారణంగా ప్రమాదాలబారిన పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో ఐదేళ్లు రహదారుల బాగుకోసం చిల్లిగవ్వ విదల్చలేదు. ఫలితంగా నిత్యం కార్మికులు రాకపోకలు సాగించేందుకు నానాపాట్లు పడుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే కార్మికులు ఆశలు పెట్టుకున్నారు. నియోజకవర్గంలోని తాడిపత్రి, యాడికి మండలాల్లో నాలుగు సిమెంట్ పరిశ్రమలు, రెండు ఉక్కు పరిశ్రలున్నాయి. వీటిల్లో సుమారు 30వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. నిత్యం పరిశ్రమలకు చెందిన బస్సులు, సొంత ద్విచక్ర వాహనాల్లో ఆయా పరిశ్రమల కార్మికులు రాకపోకలు సాగిస్తుంటారు. కొన్ని పరిశ్రమలు జాతీయ రహదారి పక్కనే ఉండటంతో ఇటు రాకపోకలకు, అటు రహదారుల సమస్య లేదు. యాడికి మండలంలోని బోయరెడ్డిపల్లి, తాడిపత్రి మండలంలోని తలారిచెరువులోని పరిశ్రమలకు దారులు సరిగా లేకపోవడంతో కార్మికులు అష్టకష్టాలు పడుతున్నారు. విధులకు వెళ్లేటప్పుడు కొందరు విధులకు ఆలస్యమవుతుందని కంగారు వెళ్తూ గుంతలను తప్పించే క్రమంలో కింద పడుతున్నారు. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ఎలాంటి చర్యలు లేవని కార్మికులు వాపోతున్నారు.

**క్షేత్రస్థాయిలో ఎక్కడెక్కడంటే?**

తాడిపత్రి నుంచి సజ్జలదిన్నె తలారిచెరువు పెన్నా పరిశ్రమకు వెళ్లే దారి అస్తవ్యస్తంగా ఉంది. సజ్జలదిన్నె వరకు పర్వాలేదు అనిపించినా అక్కడి నుంచి సుమారు 7 కిలోమీటర్ల మేర అడుగడుగునా గుంతలు పడ్డాయి. ఇప్పటికే 544-డి జాతీయ రహదారి వంతెన నిర్మాణం జరుగుతుండటంతో భారీ వాహనాలు కూడా రాకపోకలు సాగిస్తున్నాయి. దారిలో పరిశ్రమకు తాడిపత్రి, చుట్టు పక్కల పలు గ్రామాల నంచి నిత్యం 2 వేలకు పైగానే కార్మికులు రాకపోకలు సాగిస్తుంటారు.

యాడికి మండలంలోని కమలపాడు, చింతరాయపల్లి, బోయరెడ్డిపల్లి గ్రామాల మీదుగా ఆదాని సిమెంట్ పరిశ్రమకు ఇటు కార్మికులు, అటు గ్రామస్థులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఐదేళ్లుగా రహదారిని పట్టించుకోక పోవడంతో ప్రమాదకరంగా గుంతలు పడ్డాయి. ప్రధానంగా కమలపాడు గ్రామం వద్ద బరుగొడ్లవంక వద్ద అధ్వానంగా ఉంది. వర్షాకాంలో ఇక్కడ వరద వచ్చిందంటే రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. ఆ రోజు విధులకు గైర్హాజరు కావాల్సిందేనని కార్మికులు వాపోతున్నారు.

**సమస్య పరిష్కారానికి కృషి**

తాడిపత్రి మండలంలోని సజ్జలదిన్నె నుంచి తలారిచెరువు వరకు వెళ్లే దారిపై గుంతలు పడిన విషయం వాస్తవమే. దారిలో జాతీయ రహదారి నిర్మాణం కోసం భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో గుంతలు భారీగా పడ్డాయి. వీటిపై ఉన్నతాధికారులతో చర్చించి దారిని బాగు చేసి సమస్యను పరిష్కరిస్తాం.
రామేశ్వరరెడ్డి, ఆర్అండ్‌బీ ఏఈ

# నిర్వహణ లోపం.. సంపద శూన్యం




హిందూపురం : హిందూపురం నియోజకవర్గంలోని పంచాయతీ గ్రామాల్లో 8 ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన చెత్తతో సంపద తయారీ కేంద్రాలు సిద్ధంగా ఉన్నా నిర్వహణ లోపంతో నిరపయోగంగా ఉన్నాయి. ఆరేళ్లుగా దిష్టిబొమ్మలా దర్శనమిస్తూ పంచాయతీలకు ఆదాయం పెంపొందించాలనే ప్రభుత్వ లక్ష్యం కలగానే మిగిలిపోయింది. 37 తయారీ కేంద్రాలున్నాయి. వీటిలో కేవలం 5 మాత్రమే అడపా దడపా నిర్వహణ కార్యక్రమాలు కొనసాగుతున్నా పూర్తి స్థాయిలో లేవు. వీటి బాగోగులు చూసుకోవడానికి 155 మంది సిబ్బంది ఉన్నారు. వీరికి వేతనం ఇవ్వలేదనే సాకుతో పనులకు రావడం లేదు. తెదేపా ప్రభుత్వ హయాంలో 2013లో రూ.లక్షల్లో ప్రజాధనం వెచ్చించి సంపద కేంద్రాలను నిర్మిస్తే 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వంలో ఐదేళ్లకాలం వీటి పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. తదుపరి 2024లో మళ్లీ అధికారంలోకి వచ్చిన తెదేపా ప్రభుత్వం ఏడాది గడిచినా సంపద కేంద్రాలు మనుగడ కొనసాగించే ప్రారంభ కార్యకలాపాలు చేపట్టలేదని ప్రజల్లో విమర్శలు ఉన్నాయి.

**ప్రస్తుతం ఎలా ఉన్నాయంటే..**

కిరికెర, గోళ్లాపురం, తూముకుంట, కోడూరు, చిలమత్తూరు, లేపాక్షిలోని చెత్తతో సంపద కేంద్రాలు నిర్వహణలో ఉన్నా వందశాతం సంపద తయారు కావడం లేదు. సిబ్బందికి జీతం ఇవ్వని కారణంగా పూర్తిస్థాయిలో పనులకు రావడం లేదు. కగ్గల్లులో చెరువు సమీపంలో నిర్మించడంతో వర్షాకాలంలో నీరు చేరుతోంది. కొటిపి శివారు ప్రాంతంలో ఉంది. చోళసముద్రం, చాగలేరు, సోమఘట్ట, కొడికొండ, చలివెందల, శిరివరం, కొండూరు, తదితర గ్రామాల్లోని కేంద్రాల్లోకి పశువులు, గొర్రెలు, జీవాలకు నిలయాలుగా మారింది. మరికొన్ని గ్రామాల్లో చెత్తను సేకరిస్తున్నా సంపద తయారీకి వినియోగించడం లేదు. బందర దొడ్లుగా ఉన్నాయి.

**ప్రభుత్వానికి నివేదిక పంపుతాం**

చెత్తతో సంపద తయారీ కేంద్రాల నిర్వహణ సిబ్బందికి చెల్లించాల్సిన వేతనాల విషయమై ప్రభుత్వానికి నివేదిక పంపుతాం. ఆదేశాలు వస్తే నిర్వహణ కార్యకలాపాలు ప్రారంభించి పంచాయతీల ఆదాయం పెంపుపట్ల దృష్టిసారిస్తాం. శివకుమార్, ప్రభుదాస్, ఈవోఆర్‌డీలు

# ఐటీఐ ఉందిగా.. ఉపాధికి తోడుగా!



విశాఖపట్నం : ఒక వైపు కంపెనీల్లో కొలువులు.. మరో వైపు సొంత కాళ్లపై నిలబడేలా ఆర్థిక భరోసా వెరసి ఐటీఐ చేసిన అభ్యర్థులకు నేటి రోజుల్లో పుష్కలంగా ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయి. దీంతో పదో తరగతి పూర్తి చేసి ఐటీఐల్లో చేరేందుకు యువత ఉత్సుకత చూపుతున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయగా జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలకు 1666 మంది దరఖాస్తు చేశారంటే ఐటీఐ పట్ల యువత మక్కువ ఎలా చూపుతున్నారో ఇట్టే అర్థమవుతోంది. వీరికి ఈనెల 5 నుంచి ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రారంభమవ్వగా శనివారం నాటికి 481 మందికి సీట్లు లభించాయి.

**ఏఏ ట్రేడ్‌లు ఉన్నాయంటే:** ఐటీఐలో చేరే అభ్యర్థులకు ఏడాది, రెండేళ్ల కోర్సులు కలిగిన ట్రేడ్‌లు అందుబాటులో ఉన్నాయి. కంప్యూటర్ ఆపరేటర్(కోపా), స్టెనోగ్రాఫర్, ప్లంబర్, వెల్డర్, ఉడ్‌వర్క్ టెక్నీషియన్, డీజిల్ మెకానిక్, పీపీవో, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, ఏఓ కెమికల్, డ్రాఫ్ట్స్‌మెన్ మెకానికల్, టర్నర్, మెషినిస్ట్, రేడియో అండ్ ఏసీ, ఎంఎంటీఎం, ఐసీటీఎస్ఎం, వెహికల్ మోటారు మెకానిక్ తదితర ట్రేడ్‌లు జిల్లాలోని ఐటీఐల్లో ఉన్నాయి. అభ్యర్థులు వారికి నచ్చిన ట్రేడ్‌లను ఎంచుకుంటూ అందులో చేరుతున్నారు.

**అందుబాటులో 1440 సీట్లు:** జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో 1440 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 4484 సీట్లు ఉన్నాయి. కంచరపాలెంలో బాలురు, బాలికలు, నరవ, కొత్త గాజువాకలో ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. సుమారు 36 వరకు ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి.

ఏటా పెరుగుతున్న డిమాండ్: ఐటీఐలో ప్రతి ట్రేడ్ ఉపాధి కల్పించేదే కావడంతో ఈ కోర్సులకు ఏటా డిమాండ్ పెరుగుతోంది. కొన్ని ట్రేడ్‌ల్లో ఉత్తీర్ణులైన వారిని నేరుగా కంపెనీలే వచ్చి ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. మరికొన్నింటిలో అభ్యర్థే సొంతంగా యూనిట్లు పెట్టుకుని తమ కాళ్లపై నిలబడటమే కాకుండా మరి కొంతమందికి ఉపాధి కల్పించవచ్చు.

95 శాతం ఉపాధి కల్పిస్తున్నాం..: ఐటీఐ చేసిన విద్యార్థుల్లో 95 శాతం మందికి ఉపాధి దొరుకుతోంది. పలు కంపెనీలు నేరుగా కళాశాలకు వచ్చి ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నాయి. వారికి కావాల్సిన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటున్నారు. ఈ ఏడాది 351 మందికి పలు కంపెనీలు ఆఫర్ లెటర్స్ ఇచ్చాయంటే ఉపాధి అవకాశాలు ఏ మేరకు ఉన్నాయో అర్థమవుతోంది. భవిష్యత్‌లో వారికి ఉపాధి మరింత ఎక్కువ లభించేలా చర్యలు తీసుకుంటున్నాం .జె.శ్రీకాంత్, ప్రిన్సిపల్, ప్రభుత్వ పాత ఐటీఐ

# పొద్దు వాలగానే గద్దల్లా వాలిపోతున్నారు

తిరుపతి : సహజవనరుల దోపిడీని ఉపేక్షించవద్దని రాష్ట్ర ప్రభుత్వం పదేపదే చెబుతోంది. అక్రమార్కులు ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలని గనులు, రెవెన్యూ, పోలీసుశాఖ అధికారులకు ఇప్పటికే స్పష్టం చేసింది. గత వైకాపా పాలన తరహాలోనే సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో యథేచ్ఛగా అక్రమ రవాణా జరుగుతున్నా సంబంధిత అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. నగరిలో రోడ్డు నిర్మాణం ముసుగులో అనుమతులకు మించి తరలిస్తున్నా అటువైపు చూడటం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఉక్కుపాదం మోపితే అటు ప్రకృతి సంపద దోపిడీకి ఇటు ప్రభుత్వ ఖజానాకు చిల్లుపడకుండా ఉంటుంది. జగన్ పాలనలో కడప నుంచి వచ్చిన ముఠాలు సత్యవేడు నియోజకవర్గాన్ని లూటీ చేశాయి. నాణ్యమైన గ్రావెల్ ఉండటంతో వైకాపా ముఖ్యనేతలు ఇక్కడ తిష్ఠ వేశారు. రాష్ట్రంలోనే 'ముఖ్య' నాయకుడికి ఈ దోపిడీదారులు బంధువులు కావడంతో ఫ్యాను పార్టీ నేతలే మౌనం వహించారు. అధికారులు సైతం కీలుబొమ్మలుగా మారారు. రోజూ వందలాది టిప్పర్లు తమిళనాడుకు చీమలదండులా వెళ్లేవి. ఆ వేగంచూసి అప్పటి, ప్రస్తుత ఎమ్మెల్యే ఆదిమూలం పక్కకు తప్పుకోవాల్సి వచ్చింది.

శ్రీకాళహస్తి మండలంలోని జంగిలపాలెం చెరువులో అక్రమ తవ్వకాలకు అడ్డే లేకుండా పోయింది. తొట్టంబేడు మండలంలో శివనాథపాళ్యంలోనూ గ్రావెల్‌ను గద్దల్లా తన్నుకుపోతున్నారు. కేవలం రాత్రుళ్లు రవాణా చేస్తున్నారు. వచ్చిన ఆర్డర్లను బట్టి ఒక్కోరోజు 100-150 టిప్పర్ల వరకు అమ్ముకుంటున్నారు. ఇదే మండలంలోని తాటిపర్తిలో ఏపీఐఐసీ భూముల్లోనూ తవ్వకాలు జరుగుతున్నాయి.



**తమిళనాడుకు రూ.40వేలకు**

వైకాపా హయాంతో పోలిస్తే ఇప్పుడు సత్యవేడులో కొంత వేగం తగ్గించారు. ప్రస్తుతం సత్యవేడు, వరదయ్యపాళెంలో అక్రమ రవాణా జరుగుతోంది. సత్యవేడు మండలంలో వానెల్లూరు, వీఆర్‌కండ్రిగ, తదితర ప్రాంతాలు తవ్వకాలకు చిరునామాగా మారాయి. ఇటీవల తూతూమంత్రంగా వానెల్లూరులో రెండు టిప్పర్లు పట్టుకుని మమ అనిపించారు. వరదయ్యపాళెం మండలంలో చెదులుపాకం, చిలమత్తూరులో అనధికారిక తవ్వకాలు చేస్తున్నారు. శ్రీసిటీ, స్థానిక వెంచర్లతోపాటు తమిళనాడుకూ పంపిస్తున్నారు. టిప్పర్ గ్రావెల్ రూ.40వేల వరకు విక్రయిస్తున్నారు.

**చెరువులు, ఏపీఐఐసీ భూముల్లోనూ**

జాతీయ రహదారి నిర్మాణం సాకుతో నగరి నియోజకవర్గంలో చిత్తూరు- తచ్చూరు జాతీయ రహదారి నిర్మాణాన్ని సాకుగా చూపి అనుమతులకు మించి గ్రావెల్ తరలిస్తున్నారు. ప్రధానంగా గుండ్రాజు కుప్పంలో తవ్వకాలు జరుగుతున్నాయి. ఇచ్చిన దాన్ని కన్నా అధిక విస్తీర్ణంలో తరలిస్తున్నారు. ఇటీవల సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ నగరి మండలంలోని క్వారీలు పరిశీలించారు.

# గరళ గోదావరి..

రాజమహేంద్రవరం: వేదంలా ఘోషించే గోదావరి.. అమరధామంలా శోభిల్లే రాజమహేంద్రి.. ఎంతో ప్రాముఖ్యం ఉన్న గోదావరిని, దానికి ఆనుకొని ఉన్న రాజమహేంద్రవరాన్ని కీర్తిస్తూ ఓ కవి వర్ణన ఇది. అంతటి ప్రాముఖ్యం ఉన్న గోదావరి నది అంతకంతకూ కాలుష్య కోరల్లో చిక్కుకుంటోంది. కర్మాగారాల నుంచి వస్తున్న కలుషిత జలాలు, నగరం నుంచి కలుస్తున్న మురుగునీటి వ్యర్థాలు నదీ స్వరూపాన్ని



మార్చేస్తున్నాయి. నగరంలో వ్యర్థ జలాలను శుద్ధి చేసి, గోదావరిలో వదలాల్సి ఉండగా, నేరుగా వదిలేస్తున్నారు. ఆంధ్రా పేపర్ లిమిటెడ్ కర్మాగారం నుంచి కాలుష్య జలాలు నేరుగా కలుస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. దీంతో స్వచ్ఛమైన నీటితో గలగల పారాల్సిన గోదావరి.. రంగుమారి, ప్లాస్టిక్ వ్యర్థాలతో దర్శనమిస్తుంది. పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు ఇక్కట్లు తప్పట్లేదు.

# ఊరించి ఉసూరనిపించిన నైరుతి

నిడదవోలు: మే నెల చివరిలో నైరుతి ఊరించి.. ఊరించి... రైతులను ఉసూరుమనిపించి వెళ్లిపోయింది. వేసవి వేడిమి.. ఉక్కబోత ఇంకా తగ్గలేదు. మే నెల చివరిలో ఎండ ప్రభావం కొంత తగ్గడంతో పలువురు రైతులు ఖరీఫ్ వ్యవసాయ పనులపై దృష్టి సారించారు. మళ్లీ పెరగడంతో విత్తనాలు చల్లేందుకు ఆలోచనలో పడ్డారు. అధికారులు ప్రకటించిన విధంగా కాలువలకు జూన్ 1నే సాగునీరు విడుదల చేసినా పశ్చిమ డెల్టా కాలువలకు ఇంకా పూర్తిస్థాయిలో విడుదల చేయడం లేదు. నిడదవోలులో ఆర్వోబీ నిర్మాణ పనుల దృష్ట్యా ఈనెల 10న సాగునీరు విడుదల చేస్తారనే ప్రచారం ఉంది. ఈ ఏడాది కాలువల్లో నిర్వహణ పనులు చేపట్టారు. ఈ దశలో నీరు విడుదల చేసిన అనంతరం నారుమళ్లు పనులు ప్రారంభమైనా... జులై నెలలోగాని నాట్లు ప్రారంభమయ్యే అవకాశం లేదు. సాధారణంగా ఏటా డెల్టాలోనే ముందుగా నారుమళ్ల పనులు ప్రారంభమవుతాయి. అయితే గత కొన్నేళ్లుగా మెట్ట ప్రాంతంలోని బోర్లకింద నారుమళ్ల తయారీలో రైతులు నిమగ్నమవుతున్నారు. దీనిలో భాగంగా 5 వేల ఎకరాల్లో నారుమళ్లు వేయాల్సి ఉంది. ఇప్పుడిప్పుడే మెట్ట మండలాలతోపాటు, డెల్టాలోని పలు ప్రాంతాల్లో బోర్లకింద నారుమళ్లు వేస్తున్నారు. నిడదవోలు మండలం తాడిమళ్ల, కాటకోటేశ్వరం, తిమ్మరాజుపాలెం, ఉనకరమిల్లి, సూరాపురం తదితర గ్రామాలతో పాటు, డెల్టాలోని సమిశ్రగూడెం, గోపవరం, డి.ముప్పవరం, పురుషోత్తపల్లి గ్రామాల్లో కూడా నారుమళ్లు వేసే పనిలో రైతులు ఉన్నారు.

**1.80 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగు..** ఈ ఖరీఫ్ సీజన్‌లో తూర్పు గోదావరి జిల్లా పరిధిలో 1.80 లక్షల ఎకరాల్లో రైతులు వరిపంటను సాగు చేయనున్నారు.

## రేణు దేశాయ్ రెండో పెళ్లి గురించి ఏమి చెప్పారు అంటే ?

టాలీవుడ్ పవర్ స్టార్ మాజీ భార్య, సీనియర్ యాక్ట్రెస్ రేణూ దేశాయ్ గురించి అందరికీ తెలిసిందే. నటిగా, నిర్మాతగా దర్శకురాలిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. తల్లిగా స్పూర్తిదాయకంగా నిలిచారు. పవన్ తో విడిపోయిన తర్వాత పిల్లలు అకీరా నందన్, ఆద్యతో కలిసి జీవిస్తున్నారు. అయితే తన పిల్లలు రెండో పెళ్లి చేసుకోమని ఎప్పటి నుంచో చెబుతున్నా, తాను వారు కోసం చేసుకోవడం లేదని ఇప్పటికే పలుమార్లు తెలిపారు. ఇప్పుడు మరో వివాహంపై క్లారిటీ ఇచ్చారు. అందుకు సంబంధించిన వ్యాఖ్యలు.. సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. తెగ చక్కర్లు కొడుతున్నాయి. తాను రెండో పెళ్లి చేసుకోవడానికి పూర్తి సిద్ధంగా ఉన్నానని రేణూ దేశాయ్ తెలిపారు. అందుకు మరి కొన్నేళ్లపాటు వెయిట్ చేయాలని డిసైడ్ అయినట్లు చెప్పారు. రెండు మూడేళ్లలో పెళ్లి చేసుకుంటానని, తనకు ఓ మ్యారేజ్ లైఫ్ ఉండాలని, ప్రేమ ఉండాలని కోరుకుంటున్నానని రేణూ దేశాయ్ తెలిపారు. అందుకే మళ్లీ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్న ఆమె, పిల్లల కోసమే ఇప్పటివరకు



చేసుకోలేదని మరోసారి క్లారిటీ ఇచ్చారు. కానీ మళ్లీ పెళ్లి చేసుకోవాలని కుటుంబం నుంచి ఒత్తిడి వచ్చినా కూడా.. అప్పట్లో పిల్లలు చిన్నవారు కావడంతో వాళ్లను వదిలి కొత్త జీవితం ప్రారంభించడం కరెక్ట్ కాదని అనిపించిందని అన్నారు. అలా చేస్తే తన ఇద్దరు పిల్లలు ఒంటరితనంతో బాధపడతారనిపించిందని భావోద్వేగంగా గురయ్యారు. అయితే అకీరా, ఆద్య కూడా పెళ్లి చేసుకోమంటున్నారని తెలిపిన రేణు.. తన పిల్లలు కూడా మద్దతుగా ఉండటం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. వారిద్దరూ రెండో పెళ్లి విషయంలో చాలా పాజిటివ్ గా ఉన్నారని అన్నారు. ఎవరితో సంతోషంగా ఉంటావో వాళ్లను పెళ్లి చేసుకోమని చెప్పగా, తనకు ధైర్యంగా ఉందన్నారు. మరి కొన్ని సంవత్సరాల తర్వాత పూర్తి స్వేచ్ఛ వస్తుందని, అప్పుడు కొత్త జీవితాన్ని కొత్తగా మొదలు పెట్టాలని భావిస్తున్నట్లు చెప్పారు. పిల్లలు కాలేజ్ కు వెళ్తే వాళ్లకు కొత్త వరల్డ్ ప్రారంభవుతుందని చెప్పిన రేణూ.. తల్లిదండ్రులపై డిపెండెంట్ గా ఉండరని అన్నారు. అలాంటి సమయంలో తాను కూడా జీవితాన్ని ఆనందించగలుగుతానంటూ చెప్పుకొచ్చారు. అయితే, రేణు దేశాయ్.. పవన్ కళ్యాణ్ తో బద్రి సినిమాలో యాక్ట్ చేసిన టైమ్ లో లవ్ లో పడ్డారు. పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. కానీ కొంతకాలం తర్వాత పరస్పర అంగీకారంతో విడిపోయారు.

## దేవియాని హై గ్లామర్ డోస్.. అన్‌స్టాపబుల్!

నార్త్ బ్యూటీ దేవియాని శర్మ సోషల్ మీడియాలో తనదైన స్టైల్‌తో క్రేజ్‌ను పెంచుకుంటూ దూసుకెళ్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన లేటెస్ట్ ఫోటోషూట్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. డిఫరెంట్ లైటింగ్‌తో, మోడర్న్ స్టైలింగ్‌లో దేవియాని ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్ చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. క్లాస్, గ్లామర్ ను మిక్స్ చేసిన ఈ లుక్‌కి కామెంట్స్ వర్షం కురుస్తోంది. 'షార్ప్', 'అటిట్యూడ్ కిల్లింగ్', 'అన్‌స్టాపబుల్ గ్లామర్' అంటూ అభిమానులు తెగ కామెంట్ చేస్తున్నారు. ఈ ఫోటోల్లో దేవియాని తన మూడీ మూడ్‌కి తగ్గట్లుగా, హాలీవుడ్ స్టైల్‌లో స్టైలింగ్ చేసుకుంది. చక్కగా వుండే కర్లీ హెయిర్, మినిమల్ మేకప్, డీప్ బ్రౌన్ లిప్‌షేడ్ ఆమె లుక్స్‌కు మరింత హైలైట్‌గా నిలిచాయి. ఫోటోషూట్ మాత్రమే కాదు, ఆమె క్యాప్షన్ కూడా అందరిలో ఆసక్తి రేకెత్తిస్తోంది. "జీవితంలో



ఎదురైన కష్టాలే నాకు బలం.. ఇప్పుడు నాకు నేనే ముఖ్యం" అంటూ దేవియాని రాసిన మాటలు ఆమె స్వాభిమానాన్ని చాటుతున్నాయి. వెబ్ సిరీస్‌ల ద్వారా వెలుగులోకి వచ్చిన దేవియాని 'సేవ్ ది టైగర్స్', 'షైతాన్' వంటి హిట్ కంటెంట్ ప్రాజెక్ట్స్‌కి ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ఆమె నటన, బాడీ లాంగ్వేజ్, ఇంటెన్స్ క్యారెక్టర్లపై అందరికీ మంచి ఇంప్రెషన్ వచ్చింది. ఈ సక్సెస్‌తో ఆమెకు ఇతర భాషల నుంచి కూడా మంచి ఆఫర్లు వస్తున్నాయి. ప్రస్తుతం తెలుగులో ఓ మిడ్ రేంజ్ హీరోతో కీలక పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది.

ఆన్ స్క్రీన్‌లో అంతగా లిమిట్స్ పెట్టుకోని దేవియాని, గ్లామర్‌కు సంబంధించిన పాత్రలపైనా ఓపెన్‌గా స్పందిస్తూ వస్తోంది. తాను ఎలాంటి ఛాలెంజింగ్ రోల్స్‌కైనా సిద్ధమనే దిశగా, ఇలాంటి ఫోటోషూట్స్ చేస్తూ క్యారెక్టర్ బిల్డప్ చేస్తోంది. ఆమె తనకు తానే మార్కెటింగ్ చేసుకుంటూ, సోషల్ మీడియాలో స్ట్రాంగ్ ఫాలోయింగ్‌తో ఓ ప్రత్యేకమైన క్రేజ్‌ను నిలబెట్టుకుంటోంది.




# 'రామాయణం'లో కుంభకర్ణుడిగా?



నితీష్ తివారీ రామాయణం సర్వత్రా ఆసక్తిని పెంచుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్ కి అద్భుతమైన స్పందన వచ్చింది. టీజర్ లో రణ్ బీర్ ని శ్రీరాముడిగా ఆవిష్కరించాడు నితీష్. మొదటి గ్లింప్స్‌లో, రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీత పాత్రను పోషిస్తుండగా, యష్ రావణుడిగా, సన్నీ డియోల్ హనుమంతుడిగా, రవి దూబే లక్ష్మణుడిగా కనిపిస్తారని నిర్మాతలు ఇప్పటికే వెల్లడించారు. అయితే ఈ సినిమాలో కుంభకర్ణుడి పాత్రలో ఎవరు నటిస్తారు? అనేదానికి ఇంకా సమాధానం రాలేదు. ఈ పాత్రలో యానిమల్ లో అబ్రార్ పాత్రతో ఆకట్టుకున్న బాబి డియోల్ నటించే అవకాశం ఉందని చాలా కాలంగా పుకార్లు ఉన్నాయి. అయితే ఇది నిజమా? అంటే... ఇప్పటివరకూ ఎలాంటి అధికారిక కన్ఫర్మేషన్ లేదు. బాబి డియోల్ రామాయణంలో నటిస్తున్నాడా లేదా? అన్నదానికి ఇప్పటికీ స్పష్టత లేదు. ఒకవేళ బాబీకి అవకాశం కల్పించినా కుంభకర్ణుడి పాత్రలో కనిపిస్తాడా? అనేదానికి క్లారిటీ లేదు. ప్రస్తుతానికి బాబి డియోల్ తో నితీష్ బృందం ఎలాంటి చర్చలు జరపలేదని కథనాలొస్తున్నాయి. ఒక పోర్టల్ లో "రిపోర్టులు తప్పు. అతడి పేరు అకస్మాత్తుగా బయటపడింది" అని రాసారు. రెండు భాగాలుగా రూపొందుతున్న రామాయణం 2026-27 సీజన్ లో మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ గా గుర్తింపు పొందింది.

ఈ చిత్రం రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. మొదటి భాగం 2026 దీపావళిన విడుదల కానుంది. రెండవ భాగం 2027 దీపావళిన పెద్ద తెరలపైకి వస్తుంది. ఈ రెండు భాగాలకు కలుపుకుని 1600 కోట్ల బడ్జెట్ ఖర్చు కానుందని ఇటీవల కథనాలొచ్చాయి. ఇక బాబీ డియోల్ కెరీర్ మ్యాటర్ కి వస్తే, అతడు ఇటీవల బాలీవుడ్ సినిమాలతో పాటు సౌత్ సినిమాల్లోను నటిస్తున్నాడు. చివరిగా కంగువ, హౌస్‌ఫుల్ 5 లో కనిపించాడు. తదుపరి హరి హర వీర మల్లు: పార్ట్ 1, ఆల్ఫా, జన నాయగన్ వంటి భారీ చిత్రాలలో నటిస్తున్నాడు. హరి హర వీర మల్లు: పార్ట్ 1, ఆల్ఫా ఈ సంవత్సరం విడుదల కానుండగా, జన నాయగన్ 2026 లో పెద్ద తెరపైకి రానుంది.

# ఆర్కె సాగర్ 'ది 100' ట్రైలర్ టాక్..!




బుల్లితెర మీద నటించిన వారిలో చాలా తక్కువ మందికి హీరో ఇమేజ్ వస్తుంది. సీరియల్ లో తాము చేసిన పాత్రల వల్ల ఏర్పడ్డ క్రేజ్ తో కొందరు సిల్వర్ స్క్రీన్ పై కూడా ప్రయత్నాలు చేస్తారు. అలాంటి వారిలో ఆర్కె సాగర్ కూడా ఒకరు. నటుడిగా బుల్లితెర ప్రేక్షకుల ఆమోదం పొందిన అతను సిల్వర్ స్క్రీన్ పై ప్రేక్షకుల మెప్పు పొందాలని చూస్తున్నాడు. ఈ క్రమంలో అతను చేస్తున్న ప్రయత్నమే ది 100 మూవీ. ఆర్కె సాగర్ లీడ్ రోల్ లో తెరకెక్కిన ఈ సినిమాను రాఘవ్ ఓంకార్ శశిధర్ డైరెక్ట్ చేశారు. సినిమాలో మిష నారంగ్, ధన్య బాలకృష్ణ. ఆనంద్, కళ్యాణ్ నటరాజన్ వంటి వారు ఇంపార్టెంట్ రోల్స్ లో నటించారు. క్రియా ఫిల్మ్ కార్ప్ బ్యానర్ లో రమేష్ కరుకూరి, వెంకీ పుషాడపు, జె తారక్ రాం ఈ మూవీ నిర్మించారు. ఇక ఈ సినిమా ట్రైలర్ ని పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా రిలీజ్ చేశారు. పవన్ కళ్యాణ్ రిలీజ్ చేయడం వల్ల ట్రైలర్ కి సూపర్ క్రేజ్ ఏర్పడింది. ఇక ట్రైలర్ విషయానికి వస్తే సిన్సియర్ పోలీస్ ఆఫీసర్ అయిన హీరో తుపాకి వాడకుండానే తన పనితనం చూపిస్తాడు.

కానీ తను తుపాకి వాడితే కానీ సాల్వ్ చేయలేని సమస్య వస్తే ఏం చేశాడు అన్నది ది 100 కథ. ట్రైలర్ లో కథ మెయిన్ ప్లాట్ రివీల్ చేయకపోయినా ఆర్కె సాగర్ ఫ్యాన్స్ కి కావాల్సిన మాస్ స్టఫ్ ఉందని అర్ధమవుతుంది. ట్రైలర్ కట్ కూడా ఇంప్రెసివ్ గా ఉంది. ఈ సినిమాకు శ్యాం కె నాయుడు సినిమాటోగ్రఫీ అందించారు. సూపర్ హిట్ మ్యూజిక్ డైరెక్టర్ హర్షవర్ధన్ రామేశ్వర్ మ్యూజిక్ అందించారు. కెమెరా వర్క్, మ్యూజిక్ ఈ రెండు కూడా సినిమా మీద మంచి ఇంపాక్ట్ కలిగేలా చేశాయి. ది 100 ట్రైలర్ ఇంప్రెసివ్ గా ఉంది. యాక్షన్ సినిమాలు, పవర్ ఫుల్ పోలీస్ స్టోరీస్ చూసే ఆడియన్స్ కు ఇది ఒక మంచి స్టఫ్ అందిస్తుంది. జూలై 11న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ మూవీ ట్రైలర్ తో మంచి బజ్ క్రియేట్ అయ్యింది. ఎలాగు ట్రైలర్ రిలీజ్ చేసింది పవర్ స్టార్ కాబట్టి ఆయన ఫ్యాన్స్ కూడా ఈ సినిమాకు సపోర్ట్ అందించే ఛాన్స్ ఉంటుంది.

## అప్పుడు హీరోయిన్‌గా.. ఇప్పుడు స్పెషల్ సాంగ్‌లో!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న సినిమాల్లో ది రాజా సాబ్ కూడా ఒకటి. మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. మామూలుగా అయితే ఈ సినిమా ఎప్పుడో రిలీజవాల్సింది కానీ మధ్యలో కొన్ని కారణాల వల్ల షూటింగ్ లేటైంది. ఇప్పుడు తిరిగి మళ్లీ పరిస్థితులు అనుకూలించడంతో రాజా సాబ్ ను వేగంగా పూర్తి చేసే పనిలో చిత్ర యూనిట్ బిజీగా ఉంది. హార్రర్ కామెడీ థ్రిల్లర్ గా రూపొందుతున్న ఈ సినిమాపై అందరికీ భారీ అంచనాలున్నాయి. ప్రభాస్ తన కెరీర్లోనే మొదటి సారి ఈ జానర్ లో సినిమా చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ ఉందని ఎప్పట్నుంచో అంటున్న సంగతి తెలిసిందే. రాజా సాబ్ లో స్పెషల్ సాంగ్ ఉందని తెలిసినప్పటి నుంచి అందులో ఏ హీరోయిన్ నటిస్తుందా అని తెలుసుకోవడానికి అందరూ ఎంతో ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎంతోమంది స్టార్ హీరోయిన్ల పేర్లు కూడా వార్తల్లోకి వచ్చాయి. అయితే ఇప్పుడు



రాజా సాబ్ లోని స్పెషల్ సాంగ్ చేయబోయే హీరోయిన్ గా మిల్కీ బ్యూటీ తమన్నా పేరు వినిపిస్తోంది. ఈ మధ్య వరుస పెట్టి స్పెషల్ సాంగ్స్ చేస్తూ ఐటెం సాంగ్స్ కు కేరాఫ్ గా మారిన తమన్నా రాజా సాబ్ లో ప్రభాస్ తో కలిసి కాలు కదుపుతుందని అంటున్నారు. రాజా సాబ్ లోని స్పెషల్ సాంగ్ షూటింగ్ డేట్స్ కోసం చిత్ర యూనిట్ తమన్నాతో చర్చలు జరిపారని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఇందులో నిజమెంతన్నది తెలియాలంటే రాజా సాబ్ మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. కాగా గతంలో ప్రభాస్ కు జోడీగా తమన్నా మూడు సినిమాల్లో నటించారు. రెబల్, బాహుబలి1, బాహుబలి2లో ప్రభాస్ కు జోడీగా నటించిన తమన్నా ఇప్పుడు ప్రభాస్ పక్కన స్పెషల్ సాంగ్ చేస్తుందని వార్తలు వస్తుండగా అందరికీ ఈ సాంగ్ పై ఇంట్రెస్ట్ పెరిగింది. ఇక రాజా సాబ్ సినిమా విషయానికొస్తే ఈ సినిమాలో ప్రభాస్ ను డైరెక్టర్ మారుతి వింటేజ్ లుక్ లో చూపించబోతున్నట్టు టీజర్ చూస్తే అర్ధమవుతుంది. రాజా సాబ్ లో ప్రభాస్ సరసన మాళవికా మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయన్లుగా నటిస్తుండగా, సంజయ్ దత్ సినిమాలో కీలకపాత్రలో కనిపించనున్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా డిసెంబర్ 5న రిలీజ్ కానున్నట్టు మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు.

## అందాల పూజ.. ప్యాకప్ మోడ్ పిక్ చూశారా?

హీరోయిన్ పూజా హెగ్డే గురించి అందరికీ తెలిసిందే. ఒకప్పుడు వరుసగా బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్న ఆమె.. మధ్యలో వివిధ సినిమాలతో నిరాశపరిచారు. మళ్లీ ఇప్పుడు వరుస ప్రాజెక్టులతో బిజీగా అయ్యారు. వివిధ సినిమా షూటింగ్స్ లో పాల్గొంటున్న అమ్మడు.. మరిన్ని చిత్రాలను లైన్ లో కూడా పెడుతున్నారు. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ నటిస్తున్న జన నాయగన్ లో హీరోయిన్ గా నటిస్తున్న పూజ.. సూపర్ స్టార్ రజినీకాంత్ కూలీలో స్పెషల్ సాంగ్ లో కనిపించనున్నారు. రాఘవేంద్ర లారెన్స్ కాంచన -4లో కూడా పూజ యాక్ట్ చేస్తోంది. రీసెంట్ గా మరో స్టార్ హీరో ధనుష్ మూవీ లో ఛాన్స్ అందుకున్నట్లు తెలుస్తోంది. అయితే తాజాగా పూజ పెట్టిన క్రేజీ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. మిర్రర్ సెల్ఫీ పోస్ట్ చేసిన బ్యూటీ.. ప్యాక్ అప్ అంటూ క్యాప్షన్ ఇచ్చింది. మేకప్ లేకుండా.. సింపుల్ గా.. వైట్ అండ్ బ్లాక్ టీ షర్ట్




తో కనిపించిన అమ్మడు.. నెటిజన్లను ఆకట్టుకుంటోంది. తన నేచురల్ అందంతో మెప్పిస్తోంది. కానీ షూటింగ్ లో పాల్గొని అలసిపోయినట్లు మాత్రం కనిపించింది. ఎండ్-ఆఫ్‌డే మిర్రర్ స్నాప్ తీసుకున్నట్లు అర్థమవుతోంది. ప్రస్తుతం ఆమె పోస్ట్ వైరల్ గా మారగా.. నెటిజన్లు రెస్పాండ్ అవుతున్నారు. మిర్రర్ సెల్ఫీ బాగుందని మేడమ్ అని చెబుతున్నారు. మంచి హిట్స్ అందుకోవాలని కోరుకుంటున్నారు. కాగా, ఒకప్పుడు తెలుగులో బ్లాక్ బస్టర్స్ హిట్స్ అందుకున్న బ్యూటీ.. స్టార్ హీరోలతో ఆడిపాడింది. వరుస ఛాన్స్ లు అందుకున్న పూజ.. ఇప్పుడు మాత్రం తెలుగులో కనిపించడం లేదు. పలు చిత్రాల్లో నటిస్తున్నా.. అవి వేరే భాషలకు చెందినవే. ఆ మధ్య టాలీవుడ్ యంగ్ హీరోలు నాగచైతన్య, విజయ్ దేవరకొండ సినిమాల్లో పూజ నటిస్తారని వార్తలు వచ్చినా అనౌన్స్మెంట్స్ రాలేదు. మరి ఆమె తెలుగు సినిమాల్లో ఎప్పుడు ప్యాకప్ చెప్పే టైమ్ వస్తుందో వేచి చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536